

పొగాకు బ్యారన్

పొగాకు మార్కెట్ కళకళలాడుతోంది. ప్రస్తుత సీజన్‌లో ధరలు అదిరిపోతున్నాయి. ఊహించని రీతిలో రికార్డు స్థాయిలో లభిస్తున్నాయి. దీంతో అప్పుడే రైతులు వచ్చే సీజన్ సాగుపై దృష్టి సారించారు. క్రమంగా పొగాకు సాగులో కౌలు రైతులు పెరుగుతుండగా రానున్న ఏడాదికి మరింత అధికమయ్యే అవకాశం కనిపిస్తోంది. వేలం కేంద్రాల్లో సగం పొగాకు అమ్మకం పూర్తయిందో? లేదో? వచ్చే పంట కాలంపై దృష్టిపెట్టారు. వచ్చే ఏడాది సాగుకు భూములు, బ్యారన్ల కోసం పరుగులు తీస్తున్నారు. దీంతో అటు భూముల కౌలు, ఇటు బ్యారన్ అద్దెలు ఆకాశాన్నంటుతున్నాయి. గతేడాది కన్నా కనీసం 50శాతం అధికంగా కౌలు, అద్దె చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. అంతేకాక కొన్నిచోట్ల డిమాండ్ అధికమై ముందుగానే అడ్వాన్సులు చెల్లించి ఖాయపర్చుకుంటున్నారు.



పొగాకు సాగు చేసిన ప్రస్తుతం ఖాళీగా ఉన్న భూమి

కొండపి, జరుగుమల్లి, టంగుటూరు మండలాల్లోని సారవంతమైన నల్లరేగడి నేలల్లో వాతావరణం అనుకూలిస్తే పది క్వింటాళ్ల పొగాకు పండుతుంది. దీంతో ఈ నేలల కోసం రైతులు ఎగబడుతున్నారు. రింగ్‌రోడ్డుగా పిలిచే మండలాల్లో ఎకరం రూ.45వేల చొప్పున రాబోయే సీజన్‌కి రైతులు ఇప్పుడే అడ్వాన్సులు ఇచ్చి ఖాయపర్చుకుంటున్నారు. ఏడు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి వచ్చే పొలాలను ఎకరా రూ.30వేలకు కౌలుకు తీసుకుంటున్నారు.

కొండపి మండలంలోని ఒకట్రెండు గ్రామాల్లో కౌలు రైతులు పొగాకు బ్యారన్ అద్దె వచ్చే ఏడాదికి రూ.2.30లక్షలు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. తక్కువగా అనుకున్నా రూ.2లక్షల నుంచి ఉంటుందని రైతులు అంటున్నారు. బ్యారన్ క్యూరింగ్, లైసెన్స్ అమ్మకాలకు కలిపి ఈ ధర ఉంటుందని భావిస్తున్నారు.



అధరహో

- భారీగా పొగాకు కొనుగోలు ధరలు
- ఆశాజనకంగా మార్కెట్
- పోటీపడి కొంటున్న బయ్యర్లు
- వచ్చే ఏడాది మరింతగా సాగు పెరిగే అవకాశం
- బ్యారన్‌లు, పొలాల కోసం రైతుల పరుగు
- బ్యారన్ అద్దె రూ.2లక్షలపైనే
- ఎకరా కౌలు రూ.30వేల నుంచి రూ.45వేల వరకు
- ఇప్పుడే అడ్వాన్సులిస్తున్న కౌలుదారులు

ఒంగోలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి)/ కొండపి : సాధారణంగా పొగాకు పంటలో అధిక లాభాలకు అవకాశం ఉండదు. అంతర్జాతీయ పరిణామాలపై ఈ మార్కెట్ ఆధారపడి ఉండటంతోపాటు కూలీల అవసరం, ఉత్పత్తి ఖర్చులు కూడా అధికంగా ఉంటాయి. సొంత బ్యారన్, భూమి ఉన్న రైతులకు ఒక మోస్తరులో మిగులదల ఉంటే కౌలురైతులకు ఒక ఏడాది లాభం వస్తే మరోసారి నష్టం వస్తుంటుంది. కొన్ని సందర్భాల్లో వరుసగా రెండు, మూడేళ్లు మార్కెట్ సరిలేక తీవ్రంగా నష్టపోతుంటారు. అలా 2015లో తీవ్రనష్టాల పాలైన పొగాకు రైతులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. అనంతరం పంటసాగు విస్తీర్ణం కొంతమేర తగ్గడంతో తిరిగి మార్కెట్ కాస్తంత కోలుకుంటూ వస్తోంది. మూడేళ్లుగా మంచి ధరలే లభిస్తున్నాయి. గతేడాది (2022-23) దక్షిణాదిలో పొగాకు రైతులకు కాస్తంత మంచి ధరలే లభించాయి. 56వేల హెక్టార్లలో సాగుకు, 88 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతివ్వగా సుమారు 61వేల హెక్టార్లలో సాగు చేశారు. దాదాపు 90 మిలియన్ కిలోల పంట ఉత్పత్తి జరగ్గా సగటు ధర కిలోకు రూ.237 లభించింది. బ్యారన్‌కు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు రైతులకు మిగిలాయి. దీంతో ప్రస్తుత ఏడాది (2023-24)లో భారీగా సాగు పెంచారు. సుమారు 56వేల హెక్టార్లలో సాగుకు, 99.82 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతివ్వగా 72వేల హెక్టార్లకుపైగా విస్తీర్ణంలో పంట సాగు చేశారు. దాదాపు 134 మిలియన్ కిలోల ఉత్పత్తి అంచనా వేస్తున్నారు.

డిమాండ్‌తో పెరిగిన కౌలు

ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి, కందుకూరు నియోజకవర్గాల పరిధిలోని అనేక గ్రామాల్లో ఇప్పటికే వేలాది ఎకరాల భూములను, వందలాది బ్యారన్‌లను వచ్చే ఏడాది కోసం గతం కన్నా దాదాపు 50శాతం అధిక ధరతో రైతులు తీసుకున్నట్లు సమాచారం. ఆ పరిధిలోని దాదాపు వందకుపైగా గ్రామాల్లో గతంలో ఎకరా రూ. 25వేలు ఉన్న భూమి కౌలు ప్రస్తుతం రూ.30వేల నుంచి రూ.35వేల వరకు చేరింది. అలాగే బ్యారన్ అద్దెలు కూడా రూ. లక్షన్నర నుంచి ఏకంగా రూ. 2.5లక్షలకు చేరాయి. సాధారణంగా పొగాకు అమ్మకాల తర్వాత కౌలు, అద్దెల చెల్లింపు జరుగుతుంది. అయితే ప్రస్తుత డిమాండ్‌తో చాలా చోట్ల అడ్వాన్స్‌లు ఇస్తున్నారు.

అంతకుముందు సీజన్‌లో (2022-23)లో ఎకరా భూమి కౌలు రూ.15వేల నుంచి రూ.20వేలు, బ్యారన్ అద్దె రూ.లక్ష ఉండగా 2023-24 సీజన్‌కు భూమి కౌలు ఎకరాకు రూ.20వేల నుంచి రూ.25వేలు, బ్యారన్ అద్దె లక్షన్నర పెట్టి తీసుకున్నారు. ఇతర ఖర్చులు కూడా అలాగే పెరిగాయి. అయినప్పటికీ ప్రస్తుత సీజన్‌లో మార్కెట్ జోరుగానే సాగుతోంది.

సీజన్ మొదటి నుంచి హాట్‌హాట్‌గా..

అంతర్జాతీయంగా అధికంగా నాణ్యమైన పొగాకు పండే బ్రెజిల్, జింబాబ్వేలలో ఉత్పత్తి గణనీయంగా తగ్గడం వంటి సానుకూల పరిస్థితులతో ప్రస్తుత సీజన్ హాట్‌హాట్‌గా సాగుతోంది. మేలురకం గరిష్ఠ ధరలు కిలో రూ.360కు చేరుకోగా బ్రౌన్‌రకం రూ.270, లోగ్రేడ్‌లు సైతం కిలో రూ.225పైనే ఉంటున్నాయి. ఇప్పటివరకూ సుమారు 62.52 మిలియన్ కిలోలు దక్షిణాదిలో విక్రయాలు జరగ్గా సగటు ధర కిలో రూ.249.50గా ఉంది. అయితే ఇప్పటివరకూ అమ్మకాలు జరిగిన దానిలో లోగ్రేడ్ రకం మూడొంతులు ఉంది. అంటే ఈ ఏడాది మార్కెట్ ముగిసేసరికి సగటు ధర కిలో రూ.260కిపైన చేరే అవకాశం ఉంది. ఈ స్థాయి ధరలతో ఈ ఏడాది కూడా రైతులకు బ్యారన్‌కు రూ.5లక్షల వరకు మిగులుదల కనిపిస్తోంది. దీంతో ప్రస్తుత సీజన్ అమ్మకాలు సగం కూడా పూర్తి కాకముందే రైతులు వచ్చే సీజన్ పంట సాగుపై దృష్టి సారించారు. అందుకు సంబంధించి భూముల కౌలు, బ్యారన్ అద్దెలకు తీసుకోవడం గత నెలరోజుల నుంచి జోరుగా సాగుతోంది.

అప్రమత్తంగా ఉండాలంటున్న అనుభవజ్ఞులు

ఈ విపరీత పోకడపై ఆ రంగంలోని అనుభవజ్ఞులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు మార్కెట్ పూర్తిగా అంతర్జాతీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని, రెండేళ్లుగా అనుకూల పరిస్థితులతో మంచి ధరలు లభిస్తున్నాయంటున్నారు. వచ్చే ఏడాది ఇతర దేశాల్లో పంట ఉత్పత్తి, నాణ్యత పెరిగితే ఆ మేర దేశీయంగా ప్రత్యేకించి దక్షిణాది ఆంధ్ర మార్కెట్‌లో ధరలు పడిపోయే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. గతంలో అనేక సందర్భాలలో ఇలా జరిగి ధరల కోసం రైతులు రోడ్డెక్కడం, చివరకు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవడాన్ని ఉదహరిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

స్వీయ నియంత్రణ పాటించాలి

- ఎం.లక్ష్మణరావు, పొగాకు బోర్డు ఆర్ఎం

ప్రస్తుత పరిస్థితిపై పొగాకు బోర్డు ఒంగోలు ప్రాంతీయ మేనేజర్ ఎం.లక్ష్మణరావు స్పందిస్తూ రైతులు స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. అత్యధిక మంది పొగాకు రైతులు దీర్ఘకాలంగా ఈ పంట సాగులో ఉండి ఒడిదొడుకులు చూస్తున్న వారేనని, అలాంటి వారు ప్రస్తుతం ధరలను చూసి అధికంగా కౌలు, అద్దెలకు భూములు, బ్యారన్‌లు తీసుకోవడం సరైంది కాదన్నారు. వీటితోపాటు ఇతర ఖర్చులు కూడా భారీగా పెరిగి ఉత్పత్తి వ్యయం అధికమైతే ఎంతధర ఉన్నా మిగిలేది ఏమీ ఉండదన్న వాస్తవాన్ని గ్రహించాలని కోరారు. పొగాకు బోర్డు అనుమతిచ్చిన మేరకు మాత్రమే పంట సాగు, ఉత్పత్తిని నియంత్రించుకోవాలని సూచించారు.

ఆల్‌టైం రికార్డు

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.360

- బోర్డు చరిత్రలో భారీ రేటు
- మేలురకం కోసం పోటీపడుతున్న బయ్యర్లు

పొగాకు ధరలు అదరగొడుతున్నాయి. తాజాగా శనివారం మార్కెట్‌లో కిలో గరిష్ఠ ధర ఏకంగా రూ.360 పలికింది. పొగాకు బోర్డు చరిత్రలో ఇది ఆల్‌టైం రికార్డు. సాధారణంగా కర్ణాటకలో అధికంగా, ఆంధ్రలోని ఉత్తరాదిలో కర్ణాటక కన్నా కాస్తంత తక్కువగా.. అలాగే దక్షిణాదిలో ఇంకాస్త తక్కువగా ధరలు ఉంటుంటాయి. అలాంటిది ఈ ఏడాది దక్షిణాది పొగాకు మార్కెట్ ఆరంభం నుంచి ఆశాజనకంగా సాగుతోంది. ఇక్కడ అనుమతి ఇచ్చిన దాని కన్నా పంట సాగు విస్తీర్ణం, పంట ఉత్పత్తి అధికమైనా కూడా ఊహించని రీతిలో ధరలు పెరిగాయి. ఈ సీజన్ కొనుగోళ్లు ప్రారంభమైన రోజు గరిష్ఠ ధర కిలో రూ.230 ఉండగా శనివారం నాటికి కిలోకు రూ.130 పెరిగి ఏకంగా రూ.360 ధర లభించింది. ఈ ఏడాది కొనుగోళ్లను ఫిబ్రవరి 29న తొలిదశ, మార్చి 6న రెండోదశ ప్రారంభించారు. దాదాపు నెలన్నర రోజులు పెద్దగా గరిష్ఠ ధరలు పెంచకుండానే కొనుగోలు చేశారు. అయితే లోగ్రేడ్, మీడియం రకం బేళ్లను మాత్రం భారీగానే ధర ఇచ్చి కొన్నారు. దీంతో రైతులు మేలురకం బేళ్లను కాకుండా లోగ్రేడ్ బేళ్లను అధికంగా వేలానికి తెచ్చారు. కాగా నెలక్రితం నుంచి మేలురకం బేళ్ల ధరలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. పక్షం క్రితం కిలో రూ.300 ధర పలికింది. అనంతరం రోజూ పెరుగుతూ గురువారం కిలో రూ.326 లభించింది. శుక్రవారం రూ.338 లభించింది. ఆ ధరలే బోర్డు చరిత్రలో అధికం కాగా శనివారం ఊహించని రీతిలో ఏకంగా కిలో గరిష్ఠ ధర రూ.360 పలికింది. ఒంగోలు-1 కేంద్రంలో ఈ ధర లభించగా ఒంగోలు-2లో రూ.356 దక్కింది. ఇతర కేంద్రాల్లోనూ ధరలు కిలో రూ.345 నుంచి రూ.355 వరకు ఉన్నాయి. మూడు దశాబ్దాల పొగాకు బోర్డు చరిత్రలో ఎన్నడూ ఇంత ధర లభించిన దాఖలాలు లేవు. అంతర్జాతీయంగా పంట ఉత్పత్తి తగ్గి ఇక్కడ ఈ స్థాయి ధరలు లభిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాగా ఊహించని రీతిలో పెరిగిన డిమాండ్, మార్కెట్‌లో లభిస్తున్న ధరలతో రైతుల్లో సంతోషం, ఉత్సాహం కనిపిస్తున్నా భవిష్యత్ పరిణామాలపై బోర్డు అధికారులు, రైతు ప్రతినిధుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.





విలేకరుల సమావేశంలో ఆధారాలు చూపుతూ మాట్లాడుతున్న టీడీపీ ఒంగోలు అభ్యర్థి దామచర్ల

బాలినేని కుటుంబంపై రౌడీషీట్ తెరవాలి

- ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా పోలీసుల నిర్లక్ష్యం
- ఘర్షణలతో సంబంధం లేని టీడీపీ వారిపై షీట్లు
- విలేకరుల సమావేశంలో కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 1 : ఎన్నికల సమయంలో రౌడీయిజానికి పాల్పడిన బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కుటుంబీకులపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమతానగర్‌లో టీడీపీ శ్రేణులపై దాడి, అలాగే రిమ్స్‌లో జరిగిన గొడవలో బాలినేని, ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొని దౌర్జన్యం చేశారన్నారు. అలాగే పోలింగ్ రోజున వెంగముక్కలపాలెంలో ఆయన కోడలు కావ్యశ్రీ దాడి చేశారని తెలిపారు. పోలీసులు వారిపై కేసులు నమోదు చేసి, రౌడీషీటు ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల పోలీసులు 137 మందిపై రౌడీషీట్లు తెరిచారని, అందులో 62మంది టీడీపీ వారు ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో రౌడీయిజం చేసి టీడీపీ శ్రేణులపై దాడులు చేసిన బాలినేని కుటుంబంపై పోలీసులు ఎందుకు రౌడీషీట్ తెరవలేదని ప్రశ్నించారు. ఈ విషయంలో ఎస్పీ, డీఎస్పీ, ముగ్గురు సీఐలు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో అర్థంకావడం లేదన్నారు. రిమ్స్ దాడిలో వైసీపీ శ్రేణులు రెండు వేలమంది పాల్గొన్నట్లు బాలినేని స్వయంగా వెల్లడించారని, ఆధారాలతో సహా తాము పోలీసులకు రెండుసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదన్నారు. బాలినేని స్వయంగా, మీడియా సాక్షిగా దాడి ఘటనపై మాట్లాడినా పోలీసుల నుంచి చర్యలు కరువయ్యాయని మండిపడ్డారు. ఘర్షణతో సంబంధం లేని వారిపై రౌడీషీట్లు తెరవడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ ఎప్పుడూ గొడవలు చేయలేదన్నారు. కనీస విచక్షణ లేకుండా వైసీపీ శ్రేణులతో కలిసి బాలినేని, ఆయన తనయుడు నేరుగా రిమ్స్‌లోకి వచ్చి రోగులను భయభ్రాంతులకు గురిచేశారని, ఆ విషయాన్ని ఆధారాలతో సహా తాము పోలీసులకు అందజేశామన్నారు. దీనిపై సీరియస్‌గా దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రైవేటు కేసు వేస్తామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని టీడీపీ భావించిందని, అందుకోసం తాము సహకరించామన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని, పోలీసుల సహకారంతో రౌడీయిజం చేసిన వైసీపీ శ్రేణుల్లో ఎవరినీ వదిలిపెట్టమన్నారు. ఘర్షణలకు సంబంధం లేని వారిపైనా పోలీసులు ఉద్దేశపూర్వకంగా రౌడీషీట్లు తెరిచారన్నారు. వారు భయపడాల్సిన అవసరం లేదని, టీడీపీ అండగా ఉంటుందని తెలిపారు. హైకోర్టు ద్వారా రౌడీషీట్లు తొలగించేందుకు కృషిచేస్తానని, పార్టీశ్రేణులు అధైర్యపడొద్దని దామచర్ల తెలిపారు. రెండురోజుల్లో ఎన్నికల కౌంటింగ్ ముగుస్తుందని, కచ్చితంగా టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి కాబోతున్నారని స్పష్టం చేశారు. ఒంగోలులో అత్యధిక మెజారిటీతో తాను గెలవబోతున్నానని జనార్దన్ ధీమాను వ్యక్తం చేశారు.

కూటమి శ్రేణుల్లో జోష్

- ఎక్కువ సర్వే సంస్థల అంచనా టీడీపీకే అధికారం
- ఆరా సంస్థ లెక్కలపై విభిన్న చర్చ
- జిల్లాలోనూ కూటమికే మెజారిటీ అని లెక్కలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రంలో టీడీపీ కూటమికే అధికారం దక్కనుందని ఎక్కువ సర్వే సంస్థలు అంచనా వేయడంతో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. జాతీయ సర్వే సంస్థలు దాదాపు పూర్తిగా కూటమికే విజయావకాశాలున్నాయని తేల్చేశాయి. రాష్ట్ర స్థాయిలోని సర్వే సంస్థలు కూడా అత్యధికం అటువైపు మొగ్గుచూపాయి. తదనుగుణంగా జిల్లాలోనూ ఎక్కువ స్థానాలు టీడీపీ కూటమికే దక్కుతాయని ఆ సంస్థలు అంచనా వేశాయి. అయితే వైసీపీకి అధికారం దక్కే అవకాశం ఉందని కొన్ని సర్వే సంస్థలు వెల్లడించినప్పటికీ అందులో ఆరా అనే సంస్థ అంచనాలపై విస్తృత చర్చ జరుగుతోంది. జిల్లాకు సంబంధించి కూడా కొన్ని స్థానాలపై ఆరా ఇచ్చిన విశ్లేషణ కూడా అనుమానాలకు తావిచ్చింది.

అక్కడా.. ఇక్కడా కూటమే..

కేంద్రంలో తిరిగి ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని ప్రధాన సర్వే సంస్థలన్నీ అంచనా వేశాయి. రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉన్న సంస్థలన్నీ కూడా ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని వెల్లడించాయి. ఇండియా టుడే, ఏబీసీ సీవోటర్, పయనీర్, ఇండియా టీవీ, సీఎన్ఎస్, న్యూస్ 18 తదితర జాతీయ స్థాయి సర్వే సంస్థలన్నీ కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని వెల్లడించాయి. రాష్ట్రంలో టీడీపీ కూటమికి ఇటు అసెంబ్లీ, అటు లోక్‌సభ స్థానాల్లో పూర్తి ఆధిక్యత వస్తుందని కూడా బహిర్గతం చేశాయి. ఇక రాష్ట్రస్థాయిలో అయితే గతం నుంచి పనిచేస్తున్న సర్వే సంస్థలలో అత్యధికం టీడీపీ కూటమికి అధికారం ఖాయమని అంచనా వేశాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కచ్చితమైన ఎగ్జిట్ పోల్స్‌ను ఇచ్చిన ఎక్కువ సంస్థలు రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని అంచనా వేశాయి. అలాంటి వాటిలో పీపుల్స్‌సర్వే, చాణక్య, రైస్ లాంటి సంస్థలతోపాటు కేకే సర్వీసెస్ లాంటి కొత్త సంస్థ కూడా ఉంది. అయితే వీటిలో ఆరా సంస్థ రాష్ట్రంలో తిరిగి వైసీపీ అధికారంలోకి వస్తుందని వెల్లడించడం చర్చనీయాంశమైంది. గత ఏడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆరా సంస్థ ఎగ్జిట్ పోల్స్ నిజమయ్యాయి. అయితే ఈ పర్యాయం ఆ సంస్థ కేవలం టీడీపీ కూటమి కన్నా 15 నుంచి 20 స్థానాల ఆధిక్యతతో మాత్రమే వైసీపీ తిరిగి అధికారంలోకి రావచ్చని అంచనా వేసింది. అదే సమయంలో వైసీపీలోని కొందరు ప్రముఖులు, కొందరు మంత్రులు ఘోర ఓటమిని చవిచూడబోతున్నారని ప్రకటించింది. దీంతో స్వల్ప చోట్ల ఆధిక్యతనే ఆరా సంస్థ చూపించినందున ఆ అంచనా నిజమవుతుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



జిల్లాకు వచ్చేసరికి

ఇంకోవైపు ఉమ్మడి జిల్లాలోని వైసీపీ ప్రముఖుల స్థానాల గురించి ఆయన ప్రస్తావిస్తూ సంతనూతలపాడులో మంత్రి నాగార్జున గట్టిపోటీలో స్వల్ప ఓట్లతో గెలుపొందవచ్చని అంచనా వేశారు. కొండపిలో మాత్రం మంత్రి సురేష్ ఓడిపోతారని తేల్చారు. మరో వైసీపీ ప్రముఖుడు బాలినేని శ్రీనివాసరెడ్డి అంశాన్ని ఆయన ప్రస్తావించకపోవడం విశేషం. అలాగే ఉమ్మడి జిల్లాలో వైసీపీకే అధిక స్థానాలు వచ్చే అవకాశం ఉందని ఆరా సంస్థ మస్తాన్ అంచనా వేశారు. నెల్లూరు లోక్‌సభలో వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి ఓటమి ఖాయమని చెప్పిన మస్తాన్.. ఒంగోలు సిట్టింగ్ ఎంపీ మాగుంట విషయం ప్రస్తావించకపోవడం చర్చనీయాంశమైంది.

ఉమ్మడి జిల్లాలో కూటమికే ఎక్కువ స్థానాలు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో టీడీపీ కూటమికి కూడా గత ఎన్నికల్లో వచ్చిన ప్రకారం నాలుగు నుంచి ఐదు స్థానాలు దక్కవచ్చని అంచనా వేసినట్లు తెలిసింది. మిగిలిన సర్వే సంస్థలైతే జిల్లాలో టీడీపీ కూటమికే ఎక్కువ స్థానాలు వస్తాయని అంచనా వేశాయి. ఆ సంస్థల్లో కొన్ని టీడీపీ కూటమికి ఆరు స్థానాలని, మరికొన్ని ఎనిమిది రావచ్చని అంచనా వేయగా, ఒక సంస్థ మాత్రం 11 స్థానాలు రావచ్చని లెక్కకట్టింది. సర్వే సంస్థల అంచనాలను పరిగణనలోకి తీసుకుంటే టీడీపీకి ఉమ్మడి జిల్లాలో గతం కన్నా ఎక్కువ స్థానాలు వచ్చే అవకాశం కనిపిస్తోంది.



ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన ఎస్పీ సుమిత్

కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

- అధికారులకు పలు సూచనలు

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 1: ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. శనివారం ఎస్పీ గరుడ్ సుమిత్‌తో కలిసి అక్కడికి చేరుకున్న ఆయన ముందుగా పార్కింగ్‌కు సంబంధించి చర్చించారు. అనంతరం కౌంటింగ్ హాల్స్‌ను పరిశీలించారు. అక్కడ అధికారులకు పలు సూచనలు చేశారు. కంప్యూటర్లు, ప్రింటర్లను, స్ట్రాంగ్‌రూమ్ సీల్‌ను పరిశీలించారు. అనంతరం పార్లమెంట్ నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రంతోపాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను చూశారు. కలెక్టర్ వెంట డీఆర్వో శ్రీలతతో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

24 ఎయిడెడ్ స్కూళ్ల మూసివేతకు నోటీసులు

- 18 పాఠశాలల్లో అసలు పిల్లలే లేరు
- ఆరింటిలో పది మందిలోపే విద్యార్థులు

ఒంగోలు(విద్య), జూన్ 1 : జిల్లాలో 24 ఎయిడెడ్ పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధమైంది. అసలు పిల్లలు లేని(జీరో ఎన్‌రోల్‌మెంట్), పది మందిలోపు విద్యార్థులు ఉన్నవాటిని గుర్తించి యాజమాన్యాలకు నోటీసులు జారీచేసి మూసివేయాలని ప్రభుత్వం డీఈవోని ఆదేశించింది. ఈ మేరకు 2022-23, 2023-24 విద్యాసంవత్సరాల్లో పిల్లలు లేని పాఠశాలలపై వేటు పడనుంది. అధికారులు తేల్చిన లెక్కల ప్రకారం.. ఈ రెండు విద్యా సంవత్సరాల్లో 18 పాఠశాలల్లో అసలు విద్యార్థులు లేరు. మరో ఆరింటిలో పది మందిలోపు ఉన్నారు. వీటి యాజమాన్యాలకు ఇప్పటికే రెండుసార్లు నోటీసులు జారీచేశారు. తాజాగా మరోసారి డీఈవో సుభద్ర శుక్రవారం నోటీసులు ఇచ్చారు. 15 రోజుల్లోపు వారు వివరణ ఇవ్వాలి. అలా ఇవ్వకపోతే పాఠశాలలకు ఎయిడెడ్ గ్రాంట్‌ను నిలిపివేసి, పాఠశాల ప్రభుత్వ గుర్తింపును వెనక్కు తీసుకుంటామని ఆ నోటీసుల్లో హెచ్చరించారు.

నోటీసులు జారీ అయిన పాఠశాలలు ఇవే..

దొనకొండ మండలం బచ్చాపురం ప్రాథమిక పాఠశాల, ఒంగోలు వీజీఎస్ హైస్కూలు, వైపాలెం డీఎంఎస్‌బీసీ హైస్కూలు, మార్కాపురం ఏబీఎం హైస్కూలు, కొమరోలు మండలం నల్లగుంట హైస్కూలు, కంభం ఎస్ఎస్ఏ హైస్కూలు, అర్ధవీడు ఎస్ఎస్ఆర్ఎం, నికరంపల్లి ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూలు, మద్దిపాడు మండలం రాచవారిపాలెం ఎయిడెడ్ స్కూల్‌కు నోటీసులు జారీ చేశారు. వీటితోపాటు కనిగిరి ఏబీఎం ప్రైమరీ స్కూలు, గిద్దలూరు ఎస్‌పీజీ ప్రైమరీ స్కూలు, నల్లగుంట్ల ప్రైమరీ, దశరాజుపల్లి ఎయిడెడ్ ప్రైమరీ, ఒంగోలు గద్దలగుంట ప్రైమరీ, ఒంగోలు సీతారాంపురం ప్రైమరీ, సింగరాయకొండ ప్రైమరీ, మానేపల్లి ప్రైమరీ, ఒంగోలు జగ్జీవన్ గురుకులం యూటీ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా లేడు. దీంతో వాటికి కూడా నోటీసులు ఇచ్చారు. పోతవరం వీవీఎస్ ఎయిడెడ్‌లో ఆరుగురు, పెద్దకొత్తపల్లి ఆర్ఏఈఎస్‌లో ఏడుగురు, ఒంగోలు ఏబీఎం పీఎస్‌లో ఏడుగురు, మార్కాపురం శారదా ఏఈఎస్‌లో నలుగురు, బోడపాడు ఏఈఎస్‌లో పదిమంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలన్నింటి మూసివేతకు నోటీసులు జారీ అయ్యాయి.




కేశవస్వామిపేటలోని శ్రీవీరాంజనేయస్వామి


కొప్పోలులోని శ్రీప్రసన్నాంజనేయస్వామి


లాయర్‌పేటలోని చిట్టిఅంజనేయస్వామి


కోటవీధిలోని అంజనేయస్వామి

అంగరంగ వైభవంగా హనుమజ్జయంతి

స్వామివార్లకు ప్రత్యేక పూజలు ● దేవాలయాల్లో భక్తుల రద్దీ

ఒంగోలు(కల్చరల్), జూన్ 1: హనుమజ్జయంతి పండగను శనివారం ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వాడవాడలా ఆంజనేయస్వామి దేవస్థానాలలో ప్రత్యేక అలంకరణలు, విశేషపూజలు, సింధూర అభిషేకాలు నిర్వహించారు. అంతేకాకుండా పలు గ్రామాలు, పట్టణాలలో వేలాదిమంది భక్తులకు అన్నదాన కార్యక్రమాలు సైతం చేపట్టారు. ఇక జిల్లాకేంద్రమైన ఒంగోలు నగరంలో హనుమజ్జయంతి సందర్భంగా పలు ఆంజనేయస్వామి దేవాలయాలకు ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి దర్శనం చేసుకున్నారు. స్థానిక కేశవస్వామిపేట శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు ఉప్పులూరి హనుమశర్మ, వేదపురోహితులు జొన్నలగడ్డ వేదసాయిశర్మల ఆధ్వర్యంలో సామూహిక మన్యుసూక్త సహిత అర్చనలు జరిగాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి పెద్దినేని అంజనీదేవి కార్యక్రమాలు పర్యవేక్షించారు. అదేవిధంగా స్థానిక లాయర్‌పేట శ్రీచిట్టి అంజనేయస్వామి దేవస్థానంలో అర్చకులు అళఘరి శ్రీనుస్వామి యాజ్ఞీకంలో స్వామివారికి మామిడిపళ్లతో సహస్రనామార్చన, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఇక స్థానిక సుందరనగర్ శ్రీపంచముఖ నవావతక్షేత్రంలో స్వామివారికి సిందూరార్చన, నాగవల్లీ దళార్చన నిర్వహించారు. సంతపేట శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి సందర్భంగా స్వామివారికి తమలపాకులతో సామూహిక అర్చన జరిగింది. కేశవస్వామిపేట శ్రీప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణోత్సవం వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థాన ఈవో డి.రజనీకుమారి ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక దిబ్బలరోడ్ కోదండ రామస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి సందర్భంగా శనివారం రాత్రి ఆలిండియా కళారంగం అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి సంగీత విభావరి భక్తులను మంత్రముగ్ధులను చేసింది. గాయకులు మనోహర్, డి.కోటేశ్వరరావు, లక్ష్మీతులసీ తదితరులు పలు భక్తిగీతాలను ఆలపించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, కళారంగం కోశాధికారి చల్లా బాలకొండయ్య, ఎస్.లక్ష్మి, సీహెచ్.వాసుబాబు, జి.బ్రహ్మయ్య రాజు పాల్గొన్నారు.

దామచర్ల ప్రత్యేక పూజలు : హనుమజ్జయంతి సందర్భంగా స్థానిక దశరాజుపల్లిరోడ్డు అప్పాయిగుంట పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ సభ్యులు భైరపనేని శ్రీనివాసరావు, తిరుపతిరావు, అయినాబత్తిన సీతయ్య, కార్పొరేటర్ దాచర్ల రమణయ్యలు దామచర్ల ఘన స్వాగతం పలికారు. అనంతరం దేవస్థాన అర్చకులు స్వామి వారి శేషవస్త్రాన్ని బహూకరించి ఆశీర్వదించారు.

కొప్పోలులో.. కొప్పోలులోని శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి సందర్భంగా 108 లీటర్ల ఆవుపాలతో శ్రీకార్యసిద్ధి ప్రసన్నాంజనేయ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా శనివారం కావడంతో తైలాభిషేకాన్ని అర్చకులు పరాంకుశం సమీర్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించి విశేష పుష్పాలంకరణ, సహస్ర నాగవల్లి దళార్చన మొదలైన కార్యక్రమాలు జరిపారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అప్పాయిగుంట పంచముఖ ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు, స్వామివారికి దామచర్ల జనార్దన్ పూజలు

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: హనుమజ్జయంతి వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు ఘనంగా నిర్వహించారు. మద్దిపాడు, పైపాలెం, నందిపాడు, బసవన్నపాలెం తదితర గ్రామాల్లో అంజనేయ స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సీతారాంపురం కొస్టాల్ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు మద్దిపాటి వెంకటరమణ దీక్షితులు ఆధ్వర్యంలో సిందూర పూజ జరిగింది. భారీగా అన్నసంతర్పణ చేశారు. హనుమాన్ చాలీసా పారాయణ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. సీతారాంపురంలో స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఇక ఘడియపూడికాలనీలోని శివాలయంలోని ఆంజనేయస్వామికి అర్చకుడు మణికంఠస్వామి ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ సర్పంచ్ అన్నమనేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


ఘడియపూడి శివాలయంలో పూజలు

మాజీ ఎమ్మెల్యే పోతుల పూజలు

టంగుటూరు : టంగుటూరు పంచాయతీ పరిధిలోని గ్రామచావడి వద్ద ఉన్న శ్రీపంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద శ్రీహనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచే భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు పంచముఖేశ్వరుని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రామారావు సోదరులు నరసింహారావు, రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో అన్నసంతర్పణ జరిగింది.


పంచముఖేశ్వరునికి పూజలు చేస్తున్న పోతుల రామారావు

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు : హనుమజ్జయంతి వేడుకలను మండల పరిధిలోని ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముప్పాళ్ళ గ్రామంలోని 33 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద జరిగిన వేడుకల్లో సర్పంచ్ వైకుంఠ పద్మశ్రీ వీరాంజనేయులు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. 108 సార్లు హనుమాన్ చాలీసా జపించారు. ఉప్పుగుండూరులోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలోని దక్షిణ ముఖ ఆంజనేయ స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి దీవి శ్రీధర్‌బాబు పండుగ విశిష్టతను వివరించారు. అన్నదానం చేశారు. ఊరచెరువులోని శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వినాయకస్వామి దేవస్థానంలో చంద్రపాటి కృష్ణప్రసాద్, అంజనేయస్వామి రూపులు, అరటిపండ్లు, నిమ్మకాయలు పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శ్యాముల్ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాగులుప్పలపాడు, చదలవాడ, చీర్వానుప్పలపాడు, తిమ్మసముద్రం గ్రామాల్లోని వీరాంజనేయ స్వామి విగ్రహాల వద్ద, దేవాలయాల్లో హనుమజ్జయంతి ఘనంగా నిర్వహించారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: హనుమాన్ జయంతి వేడుకలను శనివారం వాడవాడలా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో ప్రసన్నాంజనేయస్వామికి మన్యుసూక్త హోమం, 250కలశాలతో పంచామృతాభిషేకం, సామూహిక ఆకుపూజ, సహస్రనామావళిని జరిపించారు. నగరోత్సవాన్ని కనులపండవగా జరిపారు. అలాగే మండలంలోని పల్లామల్లి, నేకునంబాదు, చంద్రపాడు, కూనంనేనివారిపాలెం, పులి కొండ తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలతో పాటు వేడుకలను భారీగా జరిపారు.


హరిహరక్షేత్రంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ

కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు పాటించాలి

కొండపి, జూన్ 1 : ఓట్ల కౌంటింగ్‌కు అభ్యర్థుల తరఫున హాజరయ్యే ఏజెంట్లు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని కొండపి నియోజకవర్గ ఆర్వో ఎ.కుమార్ సూచించారు. శనివారం తన కార్యాలయంలో ఏజెంట్లు, పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్ ఈనెల 4న ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతుందన్నారు. అసెంబ్లీ స్థానానికి పోటీ చేసిన 15 మంది అభ్యర్థుల తరఫున 100 మంది ఏజెంట్లు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఏజెంట్లు ఉదయం 7 గంటలకు కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకోవాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్లు బి.కిరణ్‌కుమార్, సుధాకర్‌రావు, ఇండిపెండెంట్ అభ్యర్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో కుమార్

మాదిగ జనజాతరను విజయవంతం చేయాలి

● బ్రహ్మయ్య మాదిగ పిలుపు

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 1: ఈదుమూడిలో ఈ నెల 7వ తేదీన జరిగే మాదిగ జనజాతరను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని ఎంపీఏ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముప్పై సంవత్సరాలుగా మాదిగ జాతి వివక్షతకు గురవుతుందన్నారు. మాదిగ జన జాతర కార్యక్రమం కోటప్పకొండ, తెలంగాణలో సమ్మక్కసారక్క జాతను తలపించే విధంగా వేలాది మంది డప్పుకళాకారులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగలను మోసం చేస్తున్న నాయకులను ఇక నమ్మే పరిస్థితి లేదన్నారు. మాదిగలను అడ్డుపెట్టుకుని చేస్తున్న రాజకీయాలను తాము ప్రజల్లోకి తీసుకెళతామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎందరో యువకులు, మాదిగ జాతి శ్రేణులు తమ ప్రాణాలు పణంగా పెట్టారని, అమరులైన మాదిగ వీరుల జ్ఞాపకార్థం స్థూపం ఏర్పాటు చేసేలా కొత్త ప్రభుత్వం ముందు ప్రతిపాదనలు తెస్తామన్నారు. అయితే జాతిని అడ్డుపెట్టుకుని కొందరు చేస్తున్న రాజకీయాలను మాదిగలు నమ్మవద్దని తెలిపారు. మాదిగల పుణ్యభూమి నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామంలో మాదిగ జన జాతర నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మార్పీఎస్ పేరుతో మాదిగలను మోసం చేస్తున్న నాయకుడు కబంధ హస్తాల నుంచి వారిని విముక్తి చేయడం కోసం తాము ఇకపై ప్రజల్లోకి వెళతామన్నారు. ఉద్యమం నుంచి గెంటివేయబడ్డ వారనందరినీ ఒకే వేదికపై తీసుకువచ్చేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి మాదిగలను ఒకే వేదికపై తీసుకొచ్చి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బ్రహ్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి మాదిగలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరిసంహ, మణికొండ శ్రీధర్, ఏటుకూరి విజయ్, కొమ్మూరి గరటయ్య, కోటి, మున్నింగి డేవిడ్, మున్నంగి చంద్రశేఖర్, తేళ్ళ ఏసయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

అలరించిన సినీ సంగీత విభావరి

ఒంగోలు(కల్చరల్), జూన్ 1: మయూరి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూములో ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి ఘనంగా జరిగింది. ఆర్కెస్ట్రా నిర్వాహకులు, సీనియర్ కీబోర్డు ప్లేయర్ బి.జెర్మియా ఆధ్వర్యంలో ముందుగా పలువురు అతిథులు, కళాకారులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జిల్లాలోనే సీనియర్ గాయకుడు, ఎన్టీఆర్ చేతులమీదుగా ప్రశంసలు అందుకున్న కళాకారుడు బొడ్డువానిపాలెంకు చెందిన ఆరుమళ్ల కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాణిజ్య పన్నులశాఖ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ ఆర్.సదానందరావు మాట్లాడుతూ సుమారు ఐదు దశాబ్దాలపాటు ఎన్నో వేదికల మీద తన గళాన్ని వినిపించి, ఎన్టీఆర్ వంటి ప్రముఖల ప్రశంసలందుకున్న కోటేశ్వరరావును సత్కరించడం ఎంతో సముచితంగా ఉందన్నారు. అనంతరం కీబోర్డు ప్లేయర్ ఎస్.కె.బాబును సైతం సన్మానించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీ సీహెచ్.సుధీర్‌బాబు, జిల్లా సంగీత కళాకారుల సమాఖ్య అధ్యక్షురాలు ఏల్చూరి అనంతలక్ష్మి, గాయకులు లక్ష్మీతులసి, పి.పద్మ, కోటేశ్వరరావు, విజయ్, పూర్ణిమ, శైలజ, భారతి, రామకోటేశ్వరరావు, నూకతోటి శరత్ బాబు, కనకారావు, అప్పిశెట్టి రత్తయ్య, బ్రహ్మయ్య తదితరులు పలు సినీగీతాలు ఆలపించారు. కాగా కీబోర్డుపై జెర్మియా, ప్యాడ్స్ సురేష్, డ్రమ్స్ మోహన్, తబలాపై శివప్రసాద్‌లు వాద్యసహకారాన్ని అందజేశారు.


కోటేశ్వరరావును సన్మానిస్తున్న నిర్వాహకులు, అతిథులు

అవీ..ఇవీ..

జిల్లాకు చేరిన 1,896 సర్వీసు ఓట్లు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 1: జిల్లాకు ఇప్పటివరకు 1,896 సర్వీసు ఓట్లు చేరాయని జిల్లా పోస్టల్ ఓటింగ్ పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ కె.ఝాన్సీలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్ వద్ద రాజకీయ పార్టీలతో కలిసి శనివారం సర్వీసు ఓట్లను బ్యాలెట్ బాక్సుల్లో వేసి స్ట్రాంగు రూములో భద్రపర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 6,693 సర్వీసు ఓట్లు ఉన్నాయని తెలిపారు. శనివారం ఉదయం 25 సర్వీసు ఓట్లు రాగా ఆ ఓట్లను కూడా బ్యాలెట్ బాక్సులో వేసి భద్రర్చడం జరిగిందన్నారు. ఈనెల 4వ తేదీ ఉదయం 8గంటల లోపు వచ్చే సర్వీసు ఓట్లన్నింటిని ఓట్ల లెక్కింపు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రాంతికుమార్, రసూల్, బి.రాజశేఖర్, యోహాను, సీహెచ్.ఏడుకొండలు, కొండారెడ్డి, సూర్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.


సర్వీసుఓట్లను స్ట్రాంగు రూములో భద్రపర్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు

పాలిసెట్‌లో కరవది విద్యార్థినికి 43వ ర్యాంకు

ఒంగోలు(విద్య), జూన్ 1 : ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్‌లో ఒంగోలు మండలం కరవది జడ్పీ హైస్కూలు విద్యార్థిని సున్నం యోగిత రాష్ట్ర స్థాయిలో 43వ ర్యాంకు సాధించి సత్తాచాటారు. పేద కుటుంబంలో పుట్టిన యోగిత కరవదిలో తాతయ్య ఇంట్లో ఉండి కరవది పీఆర్ఆర్ జడ్పీ హైస్కూలులో పదో తరగతి చదివారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారంతో యోగిత పాలిసెట్‌లో 43వ ర్యాంకు సాధించి ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ఆమెను ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

ఉచిత ప్రవేశాలకు 263 మంది ఎంపిక : డీఈవో

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 1: బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో రెండవ విడతలో లాటరీలో 1వ తరగతి ప్రవేశానికి 263 మంది బాలబాలికలను ఎంపిక చేసినట్లు డీఈవో సుభద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో బీసీలు, 141, ముస్లింలు 38, ఓసీలు 58, ఎస్సీలు 25 మంది, ఎస్టీలు ఒక్కరు ఉన్నారు. లాటరీ ద్వారా 1వతరగతిలో ప్రవేశానికి ఎంపికైన వీరందరూ తాము ఎంపిక చేసుకున్న పాఠశాలలో సంబంధిత పత్రాలతో చేరాల్సి ఉంటుందన్నారు. అడ్మిషన్లకు సంబంధించి మండల స్థాయి అభ్యంతరాలను సంబంధిత ఎంఈవోల ద్వారా వచ్చిన అభ్యంతరాలను డీఈవో సమక్షంలో పరిష్కరిస్తామన్నారు. డీఈవో అభ్యంతరాలను విజయవాడ సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ సమక్షంలో పరిష్కరిస్తారని ఆమె పేర్కొన్నారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 1 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు, ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి మూడు రోజుల పాటు నగరంలో జరగనున్న పలు కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరవుతారు. సోమవారం ప్రజలకు ఒంగోలులో మాగుంట అందుబాటులో ఉంటారు. మంగళవారం ఉదయం 9గంటలకు రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలో జరగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో పాల్గొంటారు.

పేస్ విద్యార్థి ప్రతిభ

ఒంగోలు(విద్య), జూన్ 1: ఒంగోలులోని పేస్ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ తృతీయ సంవత్సరం చదువుతున్న వల్లెపు సురేష్ స్టేట్ టెక్నికల్ బోర్డు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో మేధ సర్వో కంపెనీ, జీఈ ఏరోస్పేస్ కంపెనీలలో ఉద్యోగాలు సాధించి తన ప్రతిభను నాటారు. వార్షిక వేతనం రూ.3 లక్షలు. ఉద్యోగం సాధించిన సురేష్‌ను శనివారం స్థానిక కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జి.కోటిరెడ్డి, డీన్ వీరాంజనేయులు, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, రూప అక్కేష్, అధ్యాపకులు అభినందిచారు.

ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు

ఒంగోలు(విద్య), జూన్ 1 : జిల్లాలో శనివారం ప్రారంభమైన ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని 15 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. పది, ఇంటర్ విద్యార్థులు 650 మందికి 555 మంది హాజరయ్యారు. 55మంది గైర్హాజరయ్యారు. ఒంగోలు జిల్లా జైలులో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రంలో పరీక్ష జరగలేదు. ఈ కేంద్రంలో ముగ్గురు రిమాండ్ ఖైదీలు పరీక్ష రాయాల్సి ఉండగా వారు బెయిల్ మీద బయటకు వెళ్ళిపోవడంతో అక్కడ పరీక్ష జరగలేదు. మిగిలిన ఐదు పరీక్షా కేంద్రాల్లో 387 మందికిగాను 319మంది హాజరు కాగా 68 మంది గైర్హాజరయ్యారని ఓపెన్ స్కూలు జిల్లా కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇంటర్ పరీక్షకు 640కి 546మంది హాజరు కాగా 94 మంది గైర్హాజరయ్యారు. హిందీకి ఎనిమిది మందికి ఏడుగురు పరీక్ష రాయగా, ఉర్దుకు ఇద్దరు గాను ఇద్దరు పరీక్షకు హాజరయ్యారు. ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ షేక్ అక్బర్‌అలీ, సీహెచ్.శ్రీనివాసరావు ఒంగోలు నగరంలోని పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

కూలీలకు 200 పని దినాలు కల్పించాలి

మద్దిపాడు, జూన్ 1: ఉపాధి కూలీలకు 200 పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు కోరారు. కీర్తిపాడులో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ గతంలో కూలీలకు మంచినీరు, మజ్జిగ, పరికరాలు, సమ్మర్ అలవెన్సు ఇచ్చేవారని, ప్రస్తుతం అవి నిలిచిపోయాయని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చే రూ.300 కూలి సరిగా ఇవ్వటం లేదన్నారు. కార్యక్రమంలో బురగా శ్రీను, గుండాబత్తిన అంజయ్య, అల్లడి బాబూరావు, వరదయ్య పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

విద్యార్థులకు పోషకాహారం అందించాలి

నాగులుప్పలపాడు, జూన్ 1: విద్యార్థులకు పోషక విలువలున్న ఆహారం అందించాలని ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈమని రమణయ్య సూచించారు. ప్రభుత్వ పాఠశాలలోని కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులకు శనివారం నాగులుప్పలపాడులో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న మధ్యాహ్న భోజనం పథకం కింద మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కుకింగ్ ఏజన్సీలు పని చేయాలన్నారు. భోజనం తయారులో రుచిశుచి పాటించాలని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. కుకింగ్ ఏజన్సీ సిబ్బంది తయారు చేసిన పలురకాల వంటకా లను ప్రదర్శించారు. కార్యక్రమంలో సీఆర్పీలు కళ్యాణి, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, ఎండీఎం కోఆర్డినేటర్ కాశీవిశ్వేశ్వరశర్మ, వంట రీసోర్స్‌పర్సన్ షేక్ మీరాబి, సిబ్బంది నాగార్జున, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

ప్రారంభమైన సీడబ్ల్యూఎస్ఎన్ సర్వే

టంగుటూరు, జూన్ 1 : విద్యాశాఖ ఆధ్వర్యంలో సీడబ్ల్యుఎస్ఎన్ సర్వే శనివారం నుంచి ప్రారంభమైంది. దీని ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన 18 ఏళ్ల లోపు వయసున్న పిల్లలను గుర్తిస్తున్నారు. వారికి స్థానిక పాఠశాలల్లో, టంగుటూరు పురంసెంటర్‌లోని భవిత కేంద్రంలో ప్రవేశం కల్పిస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రతి నెలా ఎస్కార్ట్, రవాణా భత్యం, స్టైఫండ్, అవసరమైన చిన్నచిన్న శస్త్ర చికిత్సలు, మూడు చక్రాల రిక్షాలు, సదరం సర్టిఫికెట్లు, ఫిజియోథెరిపీ తదితర సదుపాయాలు ఉంటాయని ఎంఈవో-2 బాలాజీ తెలిపారు. ఇప్పటి వరకూ మండలంలో 30మంది సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లల్ని గుర్తించినట్లు తెలిపారు. తొలిరోజు ఆలకూరపాడు, పుల్లారెడ్డిపాలెం, వల్లూరు, గ్రామాల్లో సర్వే నిర్వహించారు. టంగుటూరు భవిత సెంటర్ టీచర్లు శ్రీదేవి, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.


ఆలకూరపాడులో బాలుడుతో ఎంఈవో బాలాజీ

బిల్లుల కోసం వంట సిబ్బంది వినతి

జరుగుమల్లి (కొండపి), జూన్ 1 : పోలింగ్ సిబ్బందికి గత నెల 12,13 తేదీల్లో నిర్వహించిన శిక్షణ సందర్భంగా వంట చేసిన తమకు బిల్లులు చెల్లించాలని 15 మంది వంట పనివారు ఎంఈవోను కోరారు. ఈమేరకు శనివారం ఆయనకు వినతిపత్రం ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు దుర్మరణం

మరో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు

బైక్‌పై వెళ్తూ స్తంభాన్ని ఢీకొనడంతో ఘటన

చీమకుర్తి, జూన్ 1 : బైక్ సరదా ముక్కు పచ్చలారని బాలుడి ప్రాణాలు కోల్పోయేలా చేసింది. అలాగే మరో ఇద్దరు బాలురు ప్రాణాలతో పోరాడే పరిస్థితి తీసుకువచ్చింది. ముగ్గురు బాలురు సరదాగా ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు అదుపుతప్పిన రోడ్డు పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొనడంతో ఈ సంఘటన శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని నాయుడపాలెంకు చెందిన టి.గోపాల్ కుమారుడు ఐజాక్ (12) అతని మిత్రులు ఇదే గ్రామానికి చెందిన చందు, ఆనంద్‌లతో కలిసి ద్విచక్రవాహనంపై సరదాగా పాటిమీద పాలెం-నాయుడుపాలెం మధ్య రైడింగ్ చేస్తున్నారు. అయితే ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొనటంతో బైక్ నడుపుతున్న ఐజాక్(12) సంఘటనాస్థలంలోనే మృతిచెందాడు. వాహనంపై ఉన్న మిగతా ఇద్దరూ తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని స్థానికులు ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించగా వైద్యసేవలు పొందుతూ ప్రాణాలతో వారు పోరాడుతున్నారు. ఈ సంఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

కూటమి విజయం ఖాయం : ఎమ్మెల్యే స్వామి



శ్రీవారిని దర్శించుకొని వస్తున్న సత్య, ఎమ్మెల్యే స్వామి తదితరులు

టంగుటూరు, జూన్ 1 : రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయం ఖాయమని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆయన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యతో కలిసి శనివారం తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసీపీ ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా ప్రజలు మాత్రం టీడీపీ కూటమికి మద్దతు తెలిపారన్నారు. త్వరలోనే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఏపీలో ప్రభుత్వం ఏర్పడబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట ఉదయగిరి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్, చిత్తూరు నియోజకవర్గ అభ్యర్థి గురజాల జగన్ మోహన్‌రావు ఉన్నారు.

ఉపాధి కూలీలకు వేసవి భత్యం ఇవ్వాలి



కూలీలతో కలిసి నినాదాలు చేస్తున్న నాయకులు

టంగుటూరు, జూన్ 1 : ఉపాధి కూలీలకు వేసవి భత్యాన్ని ప్రభుత్వం పునరుద్ధరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కందులూరులో కూలీల పని ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం బృందం సందర్శించింది. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి కూలీలను ప్రోత్సహించే ఉద్దేశంతో గతంలో ఫిబ్రవరిలో చేసిన పనికి 20శాతం, మార్చిలో 30శాతం, ఏప్రిల్, మేలో 35శాతం వేతనాన్ని పెంచి అదనపు పారితోషికంగా ఇచ్చేవారన్నారు. కానీ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అన్యాయంగా ఆవిధానాన్ని రద్దుచేసిందన్నారు. దీంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మోజెస్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ చిన్నమ్మకు నివాళి



చిన్నమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దామచర్ల పూర్ణచంద్రరావు

కొండపి, జూన్ 1 : ఇలవర (నేతివారిపాలెం) గ్రామ మాజీ సర్పంచ్ బొడ్డపాటి చిన్నమ్మకు ఎమ్మెల్యే స్వామి, టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు తదితరులు నివాళులర్పించారు. శనివారం జరిగిన ఆమె దశదిన కర్మకు వారు హాజరయ్యారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, పార్టీ జరుగుమల్లి మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, నాయకులు బత్తుల నారాయణస్వామి, కొమ్మాలపాటి రాఘవరావు, మూలె కోటేశ్వరరావు, పోటు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

గిద్దలూరు, జూన్ 1: గిద్దలూరు పట్టణం రాచర్ల రోడ్డులో గల ఆదిఆంధ్ర దివ్యాంగుల సొసైటీ ద్వారా నడుపుతున్న మానసిక దివ్యాంగుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. 6 నుంచి 25 ఏళ్లలోపు వయస్సుగల మానసిక దివ్యాంగులు, మూగ, చెవిటి పిల్లలకు అర్హత గల ఉపాధ్యాయుల ద్వారా చదువు నేర్పడం, ఫిజియోథెరపి ద్వారా మార్పు తీసుకువస్తామన్నారు. ఉచిత విద్య ఉచిత రవాణా సౌకర్యం ఉంటుందని, వివరాలకు 9705869843, 9491520653 సంప్రదించాలన్నారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్, జూన్ 1: మండలంలోని రాయవరం గ్రామంలో వడదెబ్బకు గురై కంది శ్రీనివాస్‌రెడ్డి(45) మృతిచెందిన సంఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. రాయవరం గ్రామంలో మసాలా బండి వేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఇటీవల పెరిగిన ఎండ తీవ్రతకు తాళలేక వడదెబ్బకు గురైన శ్రీనివాస్‌రెడ్డిని శనివారం తెల్లవారుజామున స్థానిక సర్వజన వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిరు.మృతుడు శ్రీనివాసరెడ్డి భార్య రమాదేవి అనారోగ్యం కారణంగా మూడు సంవత్సరాల క్రితం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లిదండ్రులు మృతి చెందంతో కుమారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

మహిళ మెడలోని గొలుసు అపహరణ

పెద్దదోర్నాల, జూన్ 1: మహిళ మెడలోని బంగారు గొలుసును దొంగ బలవంతంగా లాక్కెళ్లిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటన పెద్దదోర్నాల వ్యవసాయ మార్కెట్ ఆవరణలో శిశు సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలఅగ్రహారంనకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త దండా భాగ్యలక్ష్మి కార్యాలయంలో పనులు ముగించుకుని ఇంటికి బయలుదేరారు. యార్డు బయట ఆమె మెడలోని బంగారు గొలుసును బలవంతంగా లాక్కొని పక్కనే ఉన్న చిల్లకంప వైపు పరుగు తీశాడు. ఆమె కేకలు వేస్తూ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే ఎస్సై అంకమరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గొలుసు విలువ రూ.2లక్షలు ఉంటుందని బాధితురాలు వాపోయింది.

ఇద్దరికి గాయాలు

చీరాలటౌన్, జూన్ 1 : వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. అందిన వి వరాల ప్రకారం శనివారం మధ్యాహ్నం చీరాల ఆర్వోబీ వంతెనపై ఒంగోలుకు చెందిన కేశవ్ ద్విచక్ర వాహనంపై పర్చూరు వైపు వెళుతూ ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో అతనికి రక్త గాయాలయ్యాయి. పేరాల మసీద్ సెంటర్‌లో కంభానికి చెందిన పవన్‌ను వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొవది. ప్రమాదంలో ఎడమ కాలుకు తీవ్రంగా రక్త గాయమైంది. దీంతో స్థానికులు క్షతగాత్రుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

చిన్న పిల్లలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు

● కలెక్టర్ దినేష్‌కుమార్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 1: దుకాణాలు, వాణిజ్య సంస్థలు, హోటల్స్, సినిమా థియేటర్లు, మెకానికల్ షాప్స్, ఇటుకబట్టీలు తదితర సంస్థల్లో చిన్న పిల్లలతో పనిచేయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కలెకర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ఈనెల 1 నుంచి 30వతేదీ వరకు జరగనున్న ప్రత్యేక తనిఖీల కార్యక్రమాన్ని శనివారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మికులు ఎక్కడైనా పని చేస్తున్నట్లు గుర్తిస్తే 100 కానీ, చైల్డ్‌లైన్ నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. చిన్న పిల్లలతో పనులు చేయించడం చట్ట రీత్యా నేరమని, అందువల్ల అన్ని సంస్థల్లో పిల్లలు పనిచేయకుండా చూడాల్సిన బాధ్యత ఆయా సంస్థలపై కూడా ఉంటుందన్నారు నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యురాలు బి.పద్మావతి, ఐసీడీఎస్ పీడీ మాధురి, సహాయ కార్మిక కమిషనర్లు ఎం.కోటేశ్వరరావు, కె.పవన్‌కుమార్, బి.అనితవాణి, డీసీపీవో దినేష్‌కుమార్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

2,236 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

● నోడల్ అధికారి సుధాకర్‌రావు



ఏజెంట్ల సమక్షంలో సీలు వేస్తున్న ఆర్వో

కొండపి, జూన్ 1: కొండపి నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 2,236 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారని ఆర్వో కుమార్, పోస్టల్ బ్యాలెట్ల నోడల్ అధికారి సుధాకర్‌రావు తెలిపారు. ఫెసిలిటేటెడ్ సెంటర్ ద్వారా పీవోలు, ఏపీవోలు 1,523 మంది ఓటు వేశారన్నారు. వృద్ధులు, దివ్యాంగులు 152 మంది ఇంటి వద్ద ఓటు వేశారని చెప్పారు. పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, డ్రైవర్లు 119 మంది.. ఇదే కేటగిరీలో ఇతర జిల్లాల్లో ఉన్నవారు 32 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారన్నారు. వీరితోపాటు ఇతర జిల్లాల్లో ఉన్న కొండపి నియోజకవర్గం వారు 410 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారన్నారు. సర్వీసు ఓటర్లు ఇప్పటి వరకూ 35 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారని చెప్పారు. పార్లమెంటుకు కొండపి నియోజకవర్గంలో 1,794 మంది, ఇతర జిల్లాల్లో ఉంటున్న 442 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారని వివరించారు. శనివారం వచ్చిన ఓట్లను వారు తహసీల్దార్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూంలో ఉన్న బాక్స్‌లో వేసి సీల్ వేశారు. పోస్టల్ బ్యాలెట్లు, సర్వీసు ఓట్లను కలిపి 3వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు కొండపి అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్ జరిగే రైజ్ కళాశాల ప్రాంగణంలోని స్ట్రాంగ్ రూమ్‌కు చేరుస్తామని ఆర్వో కుమార్ వివరించారు. 4వ తేదీ ముందుగా నాలుగు ప్రత్యేక టేబుళ్లలో పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కింపు నిర్వహిస్తామని చెప్పారు.

తిరుమలకు భజన మండళ్లు

ఉత్సవాల్లో పాలుపంచుకునేలా చేయడమే

దాస సాహిత్య లక్ష్యం



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

అద్దంకి, జూన్ 1 : భజన మండళ్ల సభ్యులను పెద్ద సంఖ్యలో తిరుమలలో జరిగే ఉత్సవాలలో పాలుపంచుకునే విధంగా చేయడమే టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు లక్ష్యం అని టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి పగడాల ఆనందతీర్థాచార్యులు అన్నారు. బాపట్ల, పల్నాడు జిల్లాలోని భజనమండళ్ళ సభ్యులకు శిక్షణ తరగతులు శనివారం శింగరకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆనంద తీర్థాచార్యులు మాట్లాడుతూ సభ్యులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలు మెరుగు పరచుకోవాలన్నారు. నేటి తరానికి, భవిష్యత్ తరాలకు జానపద కళల గురించి తెలియజేస్తూ హిందూ ధర్మ ప్రచారం చే యాలన్నారు. తమ భజన మండళ్లను రిజిస్టర్ చేసుకొని తిరుమలతో పాటు పలు ప్రాంతాలలో దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలలో పాల్గొనాలన్నారు. భజన మండళ్ల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భజన మండళ్ల సభ్యత్వం నమోదు చేసుకున్నారు. ఆదివారం ఉదయం ఒంగోలులోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రకాశం జిల్లా భజనమండళ్లకు శిక్షణ కార్య క్రమం జరుగుతుందని ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు తెలిపారు.

అద్దంకి గుండె చప్పుడు 'అద్దంకి కథలు'

అద్దంకిటౌన్, జూన్ 1 : నాటికీ నేటికీ విరాజిల్లుతున్న పట్టణం అద్దంకి అ ని, అద్దంకి వైభవానికి గుండె చప్పుడు అద్దంకి కథలు అని పలువురు వ క్తలు కొనియాడారు. శనివారం స్థానిక మారం వారి సేవా సదన్‌లో రచయిత పుట్టంరాజు శ్రీరామచంద్రమూ ర్తి రచించిన అద్దంకి కథలు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆర్‌వీ.రాఘవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఈ పుస్తకం విశేషాలను సభలో వివరించారు. ఈ సందర్భంగా రచయిత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దం పతులను మిత్రమండలి సభ్యులు, తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీవీఎం.సత్యనారాయణ, ఆర్‌వీ.రాఘవరావు, వెంకటేశ్వరరావు, రఘురామశర్మ, దివాకర్‌దత్తు, చంద్రశేఖర్, ప్రతాప్, వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య) పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చీరాలటౌన్, జూన్ 1 : పట్టాలు దాటుతూ రైలు ఢీకొన్న ఘటనలో గుర్తుతెలియని కలిగిన వ్యక్తి (30)మృతి చెందాడు. ఈ సంఘటన కారంచేడు రైలు గేటు సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

10న సోపిరాలలో మండల స్థాయి పోలురాధ ఎడ్ల పందేలు

ఇంకొల్లు, జూన్ 1 : ఇంకొల్లు మండలంలోని సోపిరాల గ్రామంలో వేంచేసి ఉన్న పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మండల స్థాయి నాటుబండి పోలురాధ ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో సోపిరాల గ్రామ పెద్దలు, ప్రజల సహాయ సహకారంతో ఎడ్ల పందేలు నిర్వహించనున్నట్లు గ్రామ టైరుబండ్ల యూనియన్ అధ్యక్షుడు తుమ్మలపెంట జయరావు పేర్కొన్నారు. మొదటి బహుమతిగా రూ.20,116, రెండవ బహుమతి రూ.18,116, మూడవ బహుమతిగా రూ.15,116, నాల్గో బహుమతిగా రూ.12,116, ఐదో బహుమతిగా రూ.10,116 అందజేయనున్నట్లు తెలిపారు. బండిని ఆరుగురు మాత్రమే తోలాలని, బండి మీద బరువు క్వింటా మాత్రమే ఉంటుందని, తోకలు విరువరాదు, కర్రతో కొట్టరాదని, తుది నిర్ణయం కమిటీ సభ్యులదేనని తెలిపారు. పూర్తి వివరాలకు 9133377719, 73370790548, 7675011316 సెల్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. పోటీలను తిలకించడానికి వచ్చే చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలకు భోజన వసతి కల్పిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

టమాటా లారీ బోల్తా

మార్టూరు, జూన్ 1 : మండల పరిధిలో జొన్నతాళి సెంటరు సమీపంలో సూర్య దాబా ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై టమాటా బాక్సులతో వెళుతున్న లారీ బోల్తా పడిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ క్షేమంగా ఉన్నాడు. అందిన సమాచారం మేరకు.. కర్ణాటక రాష్ట్రం రాయచోటి నుంచి విజయవాడకు లారీలో టమాటా బాక్సులను తీసుకువెళుతున్నారు. అయితే లారీ డ్రైవర్ 1వ నంబరు లైన్‌లో వెళ్తుండగా పక్కనే వెళుతున్న మరో వాహనం మీదకు దూసుకురాగా లారీని అదుపుచేయలేక డివైడర్ పైకి ఎక్కించడంతో రోడ్డుపై బోల్తాపడినట్లు డ్రైవర్ చెప్తున్నారు. దాంతో లారీలో ఉన్న టమాటా బాక్సులు రోడ్డుపై చెల్లా చెదురుగా పడిపోయాయి. ఈ విషయంపై సమాచారం అందడంతో హైవే మొబైల్ వాహనం సంఘటనా స్థలానికి చేరి ట్రాఫిక్‌కు అవరోధం లేకుండా చేశారు. అదేవిధంగా విజయవాడకు చెందిన వారు టమాటా బాక్సులు కోసం ప్రత్యేకంగా మూడు వాహనాలలో వచ్చి రోడ్డుపై ఉన్న టమాటా బాక్సులు తమ వాహనాలలో తీసుకువెళ్లారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



పురవీధుల్లో సాగుతున్న శోభాయాత్ర

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 1: మార్కాపురం పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయాత్ర కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర శనివారం ఘనంగా నిర్వహించారు. తర్లుపాడు రోడ్డు లోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి భక్త జనసందోహం మధ్య భారీ ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం వద్దకు శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యే కంగా అలంకరించిన వాహనంపై వీరాంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఈ విగ్రహం విశేషంగా ఆకర్షించింది. యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, హనుమాన్ వేషా ధారణ ఆకట్టుకున్నాయి. హనుమాన్ జయంతి సందర్భంగా పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సిరసనగండ్ల శ్రీనివాసులు, జీవీ.కృష్ణారావు, ఇమ్మడిశెట్టి వీరారావు, గోపాలుని హరిహర రావు, పిన్నిక లక్ష్మీప్రసాద్, పానుగంటి మురళీ, దేవిశెట్టి చంద్రశేఖర్, కందెపు రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాలోత్సవ్ శిబిరం

ఒంగోలు(కల్చరల్), జూన్ 1: ఒంగోలు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గత నెల 25 నుంచి జరుగుతున్న బాలోత్సవ్ సమ్మర్ క్యాంపు ముగింపు సభ శనివారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యులు చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు నూతన విషయాలు తెలుసుకోవటానికి, మానసిక ఉల్లాసం పొందటానికి ఇటువంటి క్యాంపులు ఎంతగానో ఉపయోగపడతాయన్నరు. విద్యార్థుల్లో శాస్త్రీయ భావాలను నింపేందుకు చిల్డ్రన్‌క్లబ్‌లు కృషిచేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ పేర్కొన్నారు. సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి షేక్ సర్దార్ బాష మాట్లాడుతూ ఇటువంటి మంచి కార్యక్రమాలను నిర్వహించటంలో తమ ట్రస్ట్ సహాయసహకారాలు ఎప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అట్టలు, పెన్నులు, నోట్‌బుక్స్, జామెంట్రీ బాక్స్‌లను అందజేసి, భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, జేవీవీ సభ్యులు రామన్, వెంకటేష్, అంకశాల రంగనాయకులు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేఎఫ్.బాబు, ఇంద్రజ్యోతి, కోణంకి వరుణ్, జి.బాలకృష్ణ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పల్లెపు ధనశ్రీ యోగా ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

4న 144 సెక్షన్ అమలు : ఎస్ఐ

మద్దిపాడు, జూన్ 1: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మద్దిపాడు మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్ఐ మహేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ నలుగురు వ్యక్తుల కంటే ఎక్కువమంది గుంపులుగా ఉండకూడదని, ఎన్నికల కౌంటింగ్ అయిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు జరపకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాగులుప్పలపాడు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఈ నెల 4 న మండలంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్ఐ బ్రహ్మనాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల గెలుపుపై వీధుల్లో సంబరాలు నిర్వహించకూడదని, జనం గుంపులుగా చేరకూడదన్నారు. అలాగే బాణసంచా కాల్చడం, రంగులు చల్లుకోవడం నిషేధమని చెప్పారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు సహకరించి శాంతియుతంగా ఉండాలన్నారు.

కొండపిలో పొగాకు కిలో రూ.350

కొండపి, జూన్ 1: కొండపి పొగాకు వేలం కేంద్రంలో మేలురకం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.350 పలికింది. శనివారం జువ్విగుంట, అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాల రైతులకు చెందిన 1,215 బేళ్లను వేలానికి అనుమతించారు. వాటిలో 1,137 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు.

టంగుటూరులో కిలో రూ.347

టంగుటూరు వేలం కేంద్రంలో పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.347 పలికింది. రోజుకు ఒకట్రెండు రూపా యిలు పెరుగుతూ వస్తున్న మార్కెట్ శనివారం ఏకంగా రూ.12 పెరిగింది. మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు రైతులకు చెందిన 866 బేళ్లను వేలానికి అనుమతించారు. అందులో 745 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివి ధ కారణాలతో తిరస్కరించారు. కనిష్ఠ ధర కిలో రూ.205, సరాసరి ధర రూ.283.14 దక్కింది.

అంతా బెట్టింగ్‌లే..!



పట్టణం నుంచి గ్రామాల వరకు నాయకులందరూ అదేదారి..

ఎవరిని కదిలించినా అదేమాట

రాష్ట్రంలో అధికారం మొదలు .. అద్దంకిలో మెజార్టీ వరకు పందేలు

ఎన్నికల ఫలితాల తరువాత ఓవర్గం మునగడం ఖాయం

ఎవరు గెలిచినా... ఎవరు ఓడినా సగం మంది అప్పులపాలే

అద్దంకి, జూన్ 1 : బెట్టింగ్‌ల భూతం గ్రామీణ ప్రాంతాలకు కూడా పాకింది. దీంతో గెలుపు, ఓటములు పక్కన పెడితే కౌంటింగ్ తరువాత సగం మంది బెట్టింగ్‌రాయుళ్లు నిండా మునుకు వేసుకోవడం ఖాయమే అని చెప్పవచ్చు. ఇప్పుడు ఏ ఒక్కరిని కదిలించినా బెట్టింగ్‌ల గురించే ఆరా తీయడం కనిపిస్తోంది. గతంలో కొద్దిమంది మాత్రమే ఎన్నికల బెట్టింగ్‌లు పెట్టే వాళ్లు. ప్రస్తుతం ఎన్నికలను గ్రామస్థాయిలో కూడా అటు కూటమి నేతలు, వైసీపీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఓటింగ్ చేయటంతో పాటు, అదే ఊపుతో బెట్టింగ్ లకు కూడా దిగుతున్నారు. కౌంటింగ్ తేది దగ్గర పడే కొద్ది బెట్టింగ్‌ల జోరు కూడా మరింత పెరుగుతుంది. ప్రధానంగా రాష్ట్రంలో అధికారం చేపట్టే పార్టీ, అద్దంకి లో టీడీపీ మెజార్టీ పై ఎక్కువ బెట్టింగ్ లు సాగుతున్నాయి. టీడీపీ మెజార్టీ 12 వేల నుంచి 15 వేల మధ్యననే ఎక్కువ బెట్టింగ్‌లు సాగుతున్నాయి. అదే సమయంలో అన్ని మండలాలలో టీడీపీ మెజార్టీపై బెట్టింగ్‌లు సాగుతున్నట్లు తెలుస్తున్నది. అద్దంకి నియోజవకర్గంలో గెలుపుపై మాత్రం అత్యల్పంగానే బెట్టింగ్ జరుగుతుండడంతో చూస్తుంటే వైసీపీ నేతలు అద్దంకి నియోజకవర్గంలో ఓటమిని పరోక్షంగా ఒప్పుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొద్దిమంది మా త్రం లక్షకు రెండు లక్షలు చొప్పున గెలుపుపై బెట్టింగ్ లు పెడుతున్నట్లు తెలుస్తుంది. గ్రామస్థాయి నేతలతో పాటు రైతులు కూడా బెట్టింగ్‌లలో ఉండడం చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది పంటలు సాగు చేయక ఖాళీగా ఉన్న రైతులు ఇప్పుడు బెట్టింగ్ లను ఎం చుకొని సంపాదించాలన్న ఆశతో దిగారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 4వ తేదీన కౌంటింగ్ ముగిసిన తరువాత బెట్టింగ్‌లు పెట్టిన వారిలో సగం మంది కచ్చితంగా తీవ్రంగా నష్టపోవడం ఖాయం. గత ఎన్నికలలో ప్రభుత్వంపై, అద్దంకి నియోజకవర్గంపై బె ట్టింగ్‌లు పెట్టి ఉండడంతో అక్కడ వైసీపీ, ఇక్కడ టీడీపీ గెలవడంతో కొద్దిమంది మాత్రమే నష్టపోయారు. ఇప్పుడు వివిధ రకాలుగా బెట్టింగ్‌లు పెట్టి ఉండడంతో ఎవరు లాభ పొందుతారో, ఎంతమంది తీవ్రంగా నష్టపోతారో వేచి చూడాల్సి ఉంది. సొంత డబ్బులతో బెట్టింగ్‌లు పెడుతున్న వారు తక్కువ కాగా, ఎక్కువ మంది వడ్డీలకు తెచ్చి మరీ బెట్టింగ్‌లు పెడుతుండడం తో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం గ్రామస్థాయిలో కూడా బెట్టింగ్ పెట్టడంతో కౌంటింగ్ తరువాత పలు కుటుంబాలు అప్పులపాలు కావడంతోపాటు, వ్యక్తిగత కక్షలు కూ డా పెరిగే అవకాశం ఉంది. గ్రామాలలో ఘర్షణలకు కూడా దారి తీసే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా ఫలితాల కోసం మంగళవారం వరకూ వేచిచూడాల్సిందే.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 1: మార్కాపురంలో వెలసియున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామికి శాంతి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూల విరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులుఅధిక సంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు

పెద్దదోర్నాల, జూన్ 1: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గ్రంథ పాలకుడు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో చిత్రలేఖనం, నృత్యం, స్పోకెన్ ఇంగ్లీష్, తది తర అంశాల్లో శిక్షణనిచ్చారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతు లు అందజేశారు.

గిద్దలూరు: పట్టణంలోని శాఖాగ్రంథాలయం ఆవరణలో వేసవి విజ్ఞాన శిబి రం కొనసాగుతున్నది. 16 మంది విద్యార్థుకు స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, ప లు ఆటలపై మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ రామిరెడ్డి, గ్రం థ పాలకురాలు ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గిద్దలూరు, జూన్ 1: పట్టణంలోని రాచర్ల రోడ్డులో గల ఆదిఆంధ్ర వికలాంగుల సొసైటీ ద్వారా నడుపుతున్న మానసిక దివ్యాంగుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. 6 నుంచి 25 ఏళ్లలోపు వయస్సుగల మానసిక దివ్యాంగులు, మూగ, చెవిటి పిల్లలకు అర్హత గల ఉపాధ్యాయుల ద్వారా చదువు నేర్పడం, ఫిజియోథెరపి ద్వారా మార్పు తీసుకురావడం జరుగుతుందన్నారు. ఉచిత విద్య, ఉచిత రవాణా సౌకర్యం ఉంటుందని, ఇతర వివరాలకు 9705869843, 9491520653 సంప్రదించాలని పేర్కొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు తప్పకపాటించాలి

» రిటర్నింగ్ ఆఫీసర్ రాహుల్ మీనా

మార్కాపురం, జూన్ 1: మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల కౌంటింగ్‌లో పాల్గొనే అన్నిపార్టీల ఏజెంట్లు నిబంధనలు తప్పక పాటించాలని రిటర్నింగ్ ఆఫీసర్ రాహుల్ మీనా అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శనివారం వివిధ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లతో నిబంధనలకు సంబంధించిన అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌వో రాహుల్‌మీనా మాట్లాడుతూ కౌంటింగ్ ఏజెంట్లతో పాటు కేవలం తెల్ల పేపర్ మినహా ఎటువంటి వస్తువులు అనుమతించరన్నారు. పెన్నులు కూడా అధికారులు ఇస్తారని చెప్పారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించడానికి అనుమతి లేదన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో నోటాతో కలిసి 28 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున ఓట్ల లెక్కింపు ప్రక్రియ రెండు ఈవీఎంలలో జరుగుతుందన్నారు. దీంతో కొంతమేర ఆలస్యమయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఏజెంట్లు సంయమనం పా టించాలని సూచించారు. అధికారులకు సహరించి కౌంటింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తికావడానికి తోడ్పడాలన్నారు.


మాట్లాడుతున్న రిటర్నింగ్ ఆఫీసర్ రాహుల్ మీనా

కౌంటింగ్ కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై కఠినచర్యలతోపాటు 3 సంవత్సరాల జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉందన్నారు.

సమావేశంలో గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, టీడీపీ, వైసీపీ కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

కౌంటింగ్ సమయంలో సంయమనం పాటించాలి

మార్కాపురం రూరల్, జూన్ 1: ఓట్ల లెక్కింపు సమయంలో గ్రామాలలో ప్రతిఒక్కరూ సంయమనం పాటించాలని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలో ని భూపతిపల్లి గ్రామంలో శనివారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జూన్ 4 ఓట్ల లెక్కింపు సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. మార్కాపురం పట్టణంలోకి జూన్ 4న వచ్చేందుకు ఎవరికీ అనుమతి లేదని తెలిపారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజున విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా, ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహించడానికి వీలులేదన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే బైండోవర్


భూపతిపల్లిలో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

అయినవారు ఘర్షణలకు పాల్పడినట్లయితే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏపీజీబీ ఆర్ఎం రఘురాం

రక్తదానం ప్రాణదానంతో సమానం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 1: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్(ఏపీజీబీ) రీజనల్ మేనేజర్ రఘురామ్ అన్నారు. స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆవరణలో బ్యాంకు 19వ అవతరణ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంకు ఉద్యోగులు రక్తదానం శిబిరం నిర్వహించారు. శిబిరం ప్రారంభించిన ఆర్ఎం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ఆరోగ్యాలు కాపాడుకోవాలన్నారు. తమ బ్యాంకు గత ఆర్థిక సంవత్సరం 2023-24లో రూ.1632 కోట్ల డిపాజిట్‌లు, రూ.2360 కోట్ల రుణాల వ్యాపారం నమోదు చేసిందన్నారు. బ్యాంకు డిపాజిట్‌లపైనా అన్ని ప్రభుత్వ బ్యాంకుల కంటే అధిక వడ్డీలు ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్‌లు సంతోష్ కుమార్, సందీప్, వెంకట సాయి, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్, జూన్ 1: మండలంలోని రాయవరం గ్రామంలో వడదెబ్బకు గురై కంది శ్రీనివాస్‌రెడ్డి(45) మృతిచెందిన సంఘటన శనివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. రాయవరం గ్రామంలో మసాలా బండి వేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఇటీవల పెరిగిన ఎండ తీవ్రతకు తాళలేక వడదెబ్బకు గురై మృతి చెందినట్లు తెలిపారు. వడదెబ్బకు గురై ఇబ్బంది పడుతున్న మృతుడు శ్రీనివాస్‌రెడ్డిని శనివారం తెల్లవారుజామున స్థానిక సర్వజన వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిరు.మృతుడు శ్రీనివాసరెడ్డి భార్య రమాదేవి అనారోగ్యం కారణంగా మూడు సంవత్సరాల క్రితం మృతి చెందినట్లు బంధువులు తెలి పారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లిదండ్రులు మృతిచెండంతో కుమారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

మహిళ మెడలోని గొలుసు అపహరణ

పెద్దదోర్నాల, జూన్ 1: మహిళ మెడలోని బంగారు గొలుసును దొంగ బలవంతంగా లాక్కెళ్లిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో శిశు సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలఅగ్రహారంకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త దండా భాగ్యలక్ష్మి కార్యాలయంలో పనులు ముగించుకుని ఇంటికి బయలుదేరారు. యార్డు బయట ఆమె మెడలోని బంగారు గొలుసును బలవంతంగా లాక్కొని పక్కనే ఉన్న చిల్లకంప వైపు పరుగు తీశాడు. ఆమె కేకలు వేస్తూ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే స్థానిక ఎస్సై అంకమరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గొలుసు విలువ రూ2 లక్షలు ఉంటుందని బాధితురాలు వాపోయింది.

ఉచిత ప్రవేశాలకు 263 మంది ఎంపిక

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 1: బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో రెండవ విడతలో లాటరీలో 1వ తర గతి ప్రవేశానికి 263 మంది బాలబాలికలను ఎంపిక చేసినట్లు డీఈవో సుభద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో బీసీలు, 141, ముస్లింలు 38, ఓసీ లు 58, ఎస్సీలు 25 మంది, ఎస్టీలు ఒక్కరు ఉన్నారు. లాటరీ ద్వారా 1వతరగతి లో ప్రవేశానికి ఎంపికైన వీరందరూ తాము ఎంపిక చేసుకున్న పాఠశాలలో సం బంధిత పత్రాలతో చేరాల్సి ఉంటుందన్నారు. అడ్మిషన్లకు సంబంధించి మండల స్థాయి అభ్యంతరాలను సంబంధిత ఎంఈవోల ద్వారా వచ్చిన అభ్యంతరాలను డీఈవో సమక్షంలో పరిష్కరిస్తామన్నారు. డీఈవో అభ్యంతరాలను విజయవాడ సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ సమక్షంలో పరిష్కరిస్తారని ఆమె పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు

ఒంగోలు(విద్య), జూన్ 1: జిల్లాలో శనివారం ప్రారంభమైన ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని 15 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. పది, ఇంటర్ విద్యార్థులు 650 మందికి 555 మంది హాజరయ్యారు. 55మంది గైర్హాజర య్యారు. ఒంగోలు జిల్లా జైలులో ఏర్పాటుచేసిన పదో తరగతి పరీక్ష కేంద్రంలో పరీక్ష జరగలేదు. ఈ కేంద్రంలో ముగ్గురు రిమాండ్ ఖైదీలు పరీక్ష రాయాల్సి ఉండగా వారు బెయిల్ మీద బయటకు వెళ్ళిపోవడంతో అక్కడ పరీక్ష జరగ లేదు. మిగిలిన ఐదు పరీక్షా కేంద్రాల్లో 387 మందికిగాను 319మంది హాజరు కాగా 68 మంది గైర్హాజరయ్యారని ఓపెన్ స్కూలు జిల్లా కోఆర్డినేటర్ బి.శ్రీని వాసరెడ్డి తెలిపారు. ఇంటర్ పరీక్షకు 640కి 546మంది హాజరు కాగా 94 మం ది గైర్హాజరయ్యారు. హిందీకి ఎ నిమిది మందికి ఏడుగురు పరీక్ష రాయగా, ఉర్దూరు ఇద్దరు గాను ఇద్దరు పరీక్షకు హాజరయ్యారు. ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ షేక్ అక్బర్‌అలీ, సీహెచ్.శ్రీనివాసరావు ఒంగోలు నగరంలోని పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

చిన్న పిల్లలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 1: దుకాణాలు, వాణిజ్య సంస్థలు, హోటల్స్ సినిమా థియేట ర్లు, మెకానికల్ షాప్స్, ఇటుకబట్టీలు తదితర సంస్థల్లో చిన్న పిల్లలతో పనిచేయిస్తే చట్టపర మైన చర్యలు తప్పవని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు జరగ నున్న ప్రత్యేక తనిఖీల కార్యక్రమాన్ని శనివారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఆయన జెండా ఊపి ప్రా రంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మికులు ఎక్కడైనా పని చేస్తున్నట్లు గుర్తిస్తే 100 కానీ, చైల్డ్‌లైన్ నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. చిన్న పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని, అందువల్ల అన్ని సంస్థల్లో పిల్లలు పనిచేయకుండా చూడా ల్సిన బాధ్యత ఆయా సంస్థలపై కూడా ఉంటుం దన్నారు నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యురాలు బి.పద్మావతి, ఐసీడీఎస్ పీడీ మాధురి, సహాయ కార్మిక కమిషనర్లు ఎం.కోటేశ్వరరావు, కె.పవన్‌కుమార్, బి.అనితవాణి, డీసీపీవో దినేష్‌కుమార్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాదిగ జనజాతరను విజయవంతం చేయాలి

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 1: ఈదుమూడిలో ఈనెల 7న జరిగే మాదిగ జనజాతరను విజయవం తం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని ఎంసీఏ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముప్పై సంవత్సరాలుగా మాదిగ జాతి వివక్షతకు గురవు తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగలను మోసం చేస్తున్న నాయకులను ఇక నమ్మే పరిస్థితి లేదన్నారు. మాదిగలను అడ్డుపెట్టుకుని చేస్తున్న రాజకీ యాలను తాము ప్రజల్లోకి తీసుకెళతామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎందరో యువకులు, మాదిగ జాతి శ్రేణులు తమ ప్రాణాలు పణంగా పెట్టారని, అమరులైన మాదిగ వీరుల జ్ఞాపకార్థం స్థూపం ఏర్పాటుచేసేలా కొత్త ప్రభుత్వం ముందు ప్రతిపాదనలు తెస్తామన్నారు. జాతిని అడ్డుపెట్టుకుని కొందరు చేస్తున్న రాజకీయాలను మాదిగలు నమ్మవద్దని తెలిపారు. మాదిగల పుణ్యభూమి నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామంలో మాదిగ జన జాతర నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మార్పీఎస్ పేరుతో మాదిగలను మోసం చేస్తున్న నాయకుడు క బంధ హస్తాల నుంచి వారిని విముక్తి చేయడం కోసం తాము ఇకపై ప్రజల్లోకి వెళతామన్నారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి మాదిగలను ఒకే వేదికపై తీసుకొచ్చి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బ్రహ్మయ్య తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరిసంహ, మ జీకొండ శ్రీధర్, ఏటుకూరి విజయ్, కొమ్మూరి గరటయ్య, కోటి, మున్నంగి డేవిడ్, మున్నంగి చంద్రశేఖర్, తేళ్ళ ఏసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేసవి భత్యం ఇవ్వాలి

టంగుటూరు, జూన్ 1: ఉపాధి కూలీలకు వేసవి భత్యాన్ని ప్రభుత్వం పునరుద్ధరిం చాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కందులూరులో కూలీల పని ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం బృందం సందర్శించింది. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి కూలీలను ప్రోత్సహించే ఉద్దేశంతో గతంలో ఫిబ్రవరిలో చేసిన పనికి 20శాతం, మార్చిలో 30శాతం, ఏప్రిల్, మేలో 35శాతం వేతనాన్ని పెంచి అదనపు పారితోషికంగా ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అన్యాయంగా ఆవిధానాన్ని రద్దు చేసిందన్నారు. దీంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మోజెస్ పాల్గొని కూలీలకు పలు సూచనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

» అంజనీపుత్రునికి ప్రత్యేక పూజలు
» పలుచోట్ల శోభాయాత్ర
» భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

గిద్దలూరు, జూన్ 1: హనుమాన్ జయంతి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. హనుమాన్ దేవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక రేడియోబావి సెంటర్‌లోగల శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో శనివారం తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలైంది. ఆంజనేయస్వామికి అభిషేకాలు, ఆకు పూజలు నిర్వహించారు. సామూహికంగా హనుమాన్ చాలీసా పఠనం చేశారు. రాచర్లగేటు వద్ద గల పంచముఖ ఆంజనేయస్వామి దేవాయల, కొత్తపల్లిలో ఆంజనేయస్వామి దేవాలయం, పలు గ్రామాలలో గల ఆంజనేయస్వామి దేవాలయాలు, రామాలయాలలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

కాగా, హనుమాన్ జయంతి సందర్భంగా దేవాలయాల కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపం నుంచి ఆంజనేయ స్వామి భక్తులు మోటార్ సైకిళ్ళపై పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో శోభాయాత్ర చేశారు. రేడియో బావి సెంటర్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయం వరకు శోభాయాత్ర సాగింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పెద్దదోర్నాల: ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కంభంలో.. కంభం, జూన్ 1: కంభం, అర్థవీడు మండలాల్లోని పలు అంజనేయస్వామి దేవాలయాల్లో హనుమాన్ జయంతి వైభవంగా జరిగింది. కంభం పట్టణంలోని అంజనేయస్వామి దేవాలయం, అభయాంజనేయ స్వామి దేవాలయం, గుండిక ఆంజనేయస్వామి దేవాలయం, పూసలబజారులోని ఆంజనేయస్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఒగ్గు వెంకటశ్రీనివాసులు, గంగిశెట్టి సుబ్బరత్నం ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం కోలాటం భక్తులను అలరించింది.

దోర్నాలలో.. పెద్దదోర్నాల, జూన్ 1: మండలంలోని ప్రజలు శ్రీ హనుమాన్ జయంతి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రధానంగా తిమ్మాపురం, ఐనముక్కల, దోర్నాలలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, చట్టుతాండా, హసనాబాద్ తదితర గ్రామాలలోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో శ్రీహనుమాన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అంజనీ పుత్రునికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు.

కొమరోలులో.. కొమరోలు, జూన్ 1: మండలంలోని ఆంజనేయస్వామి, రామాలయాల్లో శనివారం హనుమన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో ఉదయం అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఆంజనేయునికి ఇష్టమైన ఆకు పూజను దంపతులచే ఆలయ పూజారి ఆచారి నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం మాదాల సిద్ధయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. దామోర్ల చెరువు దగ్గర ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

మార్కాపురం రూరల్: మండలంలోని చింతకుంట్ల గ్రామంలో వెలసిన శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పుష్పాలతో అలంకరణ చేశారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

ఎర్రగొండపాలెంలో.. ఎర్రగొండపాలెం, జూన్ 1 : హనుమజ్జయంతి సందర్భంగా స్థానిక సువర్చలా సహిత ప్రసన్నాంజనేయస్వామికి తమలపాకులతో ఆకుపూజలు నిర్వహించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సువర్చలాసహిత ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి మహిళా భక్తులు హనుమత్ వ్రతం నిర్వహించారు. అనంతరం సువర్చలా సహిత ప్రసన్నాంజనేయ స్వామికి మహానైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయకమిటి అధ్యక్షుడు గోళ్ళ సుబ్రమణ్యం, కార్యదర్శి రమాసత్యమూర్తి, కోశాధికారి దేవకి బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.


కొమరోలు: భక్తులకు దర్శనమిచ్చిన ఆంజనేయుడు


ఎర్రగొండపాలెంలో ప్రసన్నాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక అలంకరణ


కంభం: ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

హనుమజ్జయంతి పూజల్లో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూన్ 1: మండలంలోని మొగుళ్ళపల్లి గ్రామంలో శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ఆంజనేయస్వామిని టీడీపీ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు దర్శనం చేసుకొని పూజలు నిర్వహించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాద్, చిట్యాల వెంగళరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఎర్రగొండపాలెం: మొగుళ్ళపల్లి గ్రామంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎరిక్షన్‌బాబు

రోడ్డు ప్రమాదంలో బాలుడు దుర్మరణం

చీమకుర్తి, జూన్ 1: బైక్ సరదా ముక్కు పచ్చలారని బాలుడి ప్రాణాలు కోల్పోయేలా చేసింది. మరో ఇద్దరు బాలురు ప్రాణాలతో పోరాడే పరిస్థితి తీసుకువచ్చింది. ముగ్గురు బాలురు సరదాగా ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొనడంతో ఈ సంఘటన శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నాయుడపాలెంకు చెందిన టి.గోపాల్ కుమారుడు ఐజాక్ (12), అతని మిత్రులు అదే గ్రామానికి చెందిన చందు, ఆనంద్‌లతో కలిసి ద్విచక్రవాహనంపై సరదాగా పాటిమీద పాలెం-నాయుడుపాలెం మధ్య రైడింగ్ చేస్తున్నారు. ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొ నటంతో బైక్ నడుపుతున్న ఐజాక్ సం ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. వాహనంపై ఉన్న మిగతా ఇద్దరూ తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని స్థానికులు ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించిగా వైద్యసేవలు పొందుతూ ప్రాణాలతో వారు పోరాడుతున్నారు. ఈ సంఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. పోలీ సులు కేసు నమోదు చేశారు.

జిల్లాకు చేరిన 1,896 సర్వీసు ఓట్లు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 1: జిల్లాకు ఇప్పటివరకు 1,896 సర్వీసు ఓట్లు చేరాయని జిల్లా పోస్టల్ ఓటింగ్ పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ కె.రూసీలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్ వద్ద రాజ కీయ పార్టీలతో కలిసి శనివారం సర్వీసు ఓట్లను బ్యాలెట్ బాక్సులో వేసి స్ట్రాంగు రూములో భద్రపర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 6,693 సర్వీసు ఓట్లు ఉన్నాయని తెలిపారు. శనివారం ఉదయం 25 సర్వీసు ఓట్లు రాగా ఆ ఓట్లను కూడా బ్యాలెట్ బాక్సులో వేసి భద్రర్చడం జరిగిందన్నారు. ఈనెల 4వ తేదీ ఉదయం 8గంటల లోపు వచ్చే సర్వీసు ఓట్లన్నింటిని ఓట్ల లెక్కింపు చేపడతామని తెలిపారు. కార్యక్ర మంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రాంతికుమార్, రసూల్, బి.రాజశేఖర్, యోహాను, సీహెచ్.ఏడుకొండలు, కొండారెడ్డి, సూర్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కూటమి విజయం ఖాయం

టంగుటూరు, జూన్ 1 : రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయం ఖాయమని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆయన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యతో కలిసి శనివారం తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసీపీ ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా ప్రజలు మాత్రం టీడీపీ కూటమికి మద్దతు తెలిపారన్నారు. త్వరలోనే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఏపీలో ప్రభుత్వం ఏర్పడబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట ఉదయగిరి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్, చిత్తూరు నియోజకవర్గ అభ్యర్థి గురజాల జగన్ మోహన్‌రావు ఉన్నారు.

కొండపిలో పొగాకు కిలో రూ.350

కొండపి, జూన్ 1: కొండపి పొగాకు వేలం కేంద్రంలో మేలురకం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.350 పలికింది. శనివారం జువ్విగుంట, అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాల రైతులకు చెందిన 1,215 బేళ్లను వేలానికి అనుమతించారు. వాటిలో 1,137 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 1: మార్కాపురం పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా శోభాయాత్ర కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర శనివారం ఘనంగా నిర్వహించారు. తర్లుపాడు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి భక్త జనసందోహం మధ్య భారీ ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం వద్దకు శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై వీరాంజ నేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఈ విగ్రహం విశేషంగా ఆకర్షిం చింది. యాత్ర సందర్భంగా ఏర్పాటుచేసిన కోలాటాలు, హనుమాన్ వేషా ధారణ ఆకట్టుకున్నాయి.


మార్కాపురంలో ఆకట్టుకున్న హనుమంతుని విగ్రహం, పురవీధుల్లో సాగుతున్న శోభాయాత్ర


త్రిపురాంతకంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

హనుమాన్ జయంతి సందర్భంగా పోలీసుల ఆ ధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో శోభాయాత్ర నాయ కులు సిరసనగండ్ల శ్రీనివాసులు, జీవీ కృష్ణారావు, ఇమ్మడిశెట్టి వీరారావు, గోపాలుని హరిహరరావు, పిన్నిక లక్ష్మీప్రసాద్, పానుగంటి మురళీ, దేవిశెట్టి చంద్రశేఖర్, కందెపు రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకంలో.. త్రిపురాంతకం, జూన్ 1: హనుమత్ జయంతి సందర్భంగా శనివారం త్రిపురాంతకంలో శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. మహిళా భక్త లు, ఆర్యవైశ్య యువకులు, హిందూధర్మ పరిరక్షణ సమితి, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శోభాయాత్ర సాగింది. వైపాలెం కూడలిలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రధాన రహదారి గుండా బ్రహంగారికాలనీ, ఆర్టీసీ బ స్టాండ్, ఉత్తరపు బజార్, పాత రామాలయం గుండా వై. పాలెం కూడలి ఆంజనేయ ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా స్వామికి ఆకుపూజ నిర్వహించారు.

నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలు

ఎర్రగొండపాలెం, జూన్ 1: నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ అమలులో ఆందని ఆర్వో ఎంవీ సత్యనారాయణ అన్నారు. పోటీల ఉన్న అభ్యర్థులు, మద్దతుదారులు ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించాలని చెప్పారు. నియోజకవర్గంలో పోటీచేసిన అభ్యర్థులు కౌంటింగ్‌లో పాల్గొనే ఏజెంట్లకు శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్‌కు వచ్చే ఏజెంట్లు తప్పనిసరిగా వారి గుర్తింపుకార్డులు తీసుకురావాలన్నారు. ఏజెంటుగా ఫారం పొందిన వ్యక్తులు మాత్రమే రావాలని తెలిపారు. సెల్‌ఫోన్లు అనుమతించరని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలో గొడవలు చేసిన, నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతంగా కౌంటింగ్ పూర్తి చేసుకొని ఫలితం ప్రకటించేందుకు అన్నిపార్టీల ఏజెంట్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీ అశోక్‌బాబు, టీడీపీ కూటమి అభ్యర్థి ఎరిక్షన్‌బాబు, సీఐ రాములునాయక్, తహసీల్దార్లు, కౌంటింగ్‌కు వచ్చే ఏజెంట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఎస్పీ అశోక్‌బాబు, ఆర్వో సత్యనారాయణ



తిమ్మారెడ్డిపల్లిలో నిమ్మతోటలను పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న ఏవో అంజలీబాయి

ఉద్యాన పంటల పరిశీలన

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కనిగిరి, జూన్ 1: ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వాలు మరింత ఊతమివ్వనున్నాయని ఉద్యానశాఖాధికారిణి అంజలీబాయి అన్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన "ఉద్యానం ఉసూరు" అనే కథనానికి ఆ శాఖ అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో నియోజకవర్గంలోని కనిగిరి, హనుమంతునిపాడు మండలాల్లోని వివిధ ఉద్యాన పంటలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా హనుమంతునిపాడు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలోని నిమ్మతోటలను పరిశీలించి ఆయా రైతులకు నీటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. నేల స్వభావాన్ని బట్టి చెట్లకు నీటి అవసరాన్ని వివరించారు. నిమ్మతోటలకు క్రమం తప్పకుండా నీరందించటంతోపాటు డ్రిప్ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కొమ్మ కత్తిరింపుపై, ఆకుముడత నివారణపై రైతులకు చేయాల్సిన పద్ధతి, వాడాల్సిన మందుల పిచికారీని తెలియ చేశారు. ఉద్యాన పంటల సాగుల వివరాలను, దిగుబడి శాతం పెంపు విధానాలను, పంటల సంరక్షణ వంటి విషయాలపై ఎప్పటికప్పుడు రైతులు తమ నుంచి పూర్తి సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. ఆమె వెంట వీఏఏలు, షీమా, రైతులు పాల్గొన్నారు.



ఏపీటీఎఫ్ జోనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ఏపీటీఎఫ్ లక్ష్యం..!

● రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల

కనిగిరి, జూన్ 1: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం దిశగా ఏపీటీఎఫ్ అవిశ్రాంత కృషి చేస్తుందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల అన్నారు. కనిగిరిలో ఏపీటీఎఫ్ నూతన కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రానున్న విద్యాసంవత్సరంలో పాఠశాలల పరిరక్షణకు ఏపీటీఎఫ్ ప్రత్యేక చొరవ వహించాలన్నారు. ఉపాధ్యాయులు సమస్యల పరిష్కరించటంలో ఏపీటీఎఫ్ కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి నాయబ్‌రసూల్, ఐ. విజయసారథి, వీ కృష్ణయ్య, శేషారావు, శిరామకృష్ణ, హనుమంతరావు, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, కే శ్రీనివాసరావు, హజరత్‌రెడ్డి, దండే శ్రీనివాసులు, కేవీ సుబ్బయ్య, ఆనందబాబు, హరిబాబు, ప్రసాద్, మచ్చా ప్రసాద్, జీ రామకృష్ణ, రెహానా, అరుణ, పెన్నా వెంకటేశ్వర్లు, సీహెచ్ చంద్రశేఖర్, యం. రాములు, బీ చిన్ననారాయణ, పీ మాలకొండయ్య రవీంద్ర, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.



ఉగ్ర గెలవాలని నాయకుడి దేవాలయంలో పూజలు చేస్తున్న పందిటి హరీష్

నాయకుడి దేవాలయంలో ప్రత్యేక పూజలు

పామూరు, జూన్1 : టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఎమ్మెల్యేగా గెలవాలని కోరుతు పామూరు శివారు ప్రాంతంలో వెలసియున్న అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయక శ్రీ అంజనీపుత్ర నిలయంలోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో టీడీపీ పట్టణ ఫోర్‌మెన్‌కమిటీ సభ్యుడు పందిటి హరీష్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా నాయకుని దేవస్థానంలో టీడీపీ శ్రేణులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ సభ్యులు చలపతి, సోమిశెట్టి లక్ష్మీనారాయణ, మెంటా ఆనంద్‌పాల్గొన్నారు. కాగా పామూరు పట్టణంలోని శ్రీ మదనవేణు గోపాలస్వామి దేవస్థానంలో వెలసియున్న రామాంజనేయస్వామి దేవస్థానంలో పామూరు పట్టణ ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ మిత్రబృందం ఆధ్వర్యంలో ఉగ్ర విజయం సాధించాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నుచ్చుపొద, బొట్లగూడూరు, రేణిమడుగు, కంభాలదిన్నె, తూర్పుకట్టకిందపల్లి, మోపాడు, నర్రమారెళ్ల,తదితర గ్రామాల్లో హనుమత్ జయంతి వేడుకలు నిర్వహించారు.

పీసీపల్లిలో..

పీసీపల్లి : మండలంలోని వెంగళాపురం సమీపంలోని గంగమ్మ గుడి ప్రాంగణంలో ఉన్న అభయాంజనేయ స్వామి విగ్రహం వద్దకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు.అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మారెళ్ల గ్రామంలో కూడా హనుమాన్ జయంతిని గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

నేడు గుంటిగంగ దేవాలయంలో సుహాసినీ పూజలు

తాళ్లూరు, జూన్ 1 : మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన గుంటిగంగ భవానీ దేవాలయం ఆవరణలో సుహాసినీ పూజా కార్యక్రమం ఆదివారం జరుగనున్నట్లు ఆలయ ఈవో కార్తిక్ శనివారం తెలిపారు. 108 మంది ముత్తైదువలు భక్తిశ్రద్ధలతో సుహాసినీ పూజా కార్యక్రమం జరుగనున్నట్లు తెలిపారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు.

కౌంటింగ్‌లో నిబంధనలు పాటించాలి

సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట పోలీస్ బందోబస్తు

దర్శి, జూన్ 1 : ఎన్నికల కౌంటింగ్‌లో అభ్యర్థులు, ఏజంట్లు నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని దర్శి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు సూచించారు. స్థానిక ఆర్‌వో కార్యాలయంలో శనివారం పోలీస్ అధికారులు,రాజకీయపార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ హాలు వద్దకు అభ్యర్థులు, ఏజెంట్లు ఉదయం 6గంటల లోపు హాజరుకావాలని సూచించారు. దర్శి నియోజకవర్గంలో పోలింగ్ సందర్భంగా జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుని 14 సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు తెలిపారు. దర్శి, బొట్లపాలెం,దేవవరం, లక్కవరం,శివరాంపురం, బొద్దికూరపాడు, నాగంబొట్లపాలెం, ఇండ్లచెరువు, గంగదేవపల్లి, పొట్లపాడు,పడమర నాయుడు పాలెం, శంకరాపురం, ఈదర, పోలవరం, తదితరగ్రామాల్లో కౌంటింగ్ సందర్భంగా, ఫలితాల అనంతరం ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. ఊరేగింపులు, ర్యాలీలు, గులాంలు చల్లుకోవటం,బాణ సంచా కాల్చటం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దర్శి అసెంబ్లీకి సంబంధించి 14 టేబుల్స్, పార్లమెంట్ కౌంటింగ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ రెడ్డి, సీఐ షమీముల్లా, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు, ఏజెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

మొదటిస్థానంలో కురిచేడు, రెండో స్థానంలో ఒబ్బాపురం జట్లు

దొనకొండ, జూన్1 : స్థానిక ఆర్సీఎం పాఠశాల ఆవరణలో ఒబ్బాపురం అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీల ఫైనల్స్ హోరా హోరీగా కొనసాగాయి. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా దర్శి నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కుందుర్తి లక్ష్మణ్ నేతృత్వంలో మే 25వ తేది నుంచి ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. ఫైనల్స్‌లో కురిచేడు-దొనకొండ క్రీడాకారులు పోటాపోటీగా తలబడగా కురిచేడు క్రీడాకారులు వారి క్రీడా ప్రతిభను కనబర్చి ప్రథమస్థానంలో నిలిచారు. ప్రథమస్థానం పొందిన క్రీడాకారులకు మండల టీడీపీ అధ్యక్షుడు నాగలపాటి శివకోటేశ్వరరావు రూ.10వేలు, టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు రూ.10వేలు మొత్తం రూ.20వేలు నగదు, రెండవస్థానంలో నిలిచిన ఒబ్బాపురం క్రీడాకారులకు టీడీపీ నాయకుడు కొత్తం రఘునాథరెడ్డి అందించిన రూ.10వేలు నగదు, మూడవ స్థానంలో నిలచిన గజ్జలకొండకు చెందిన క్రీడాకారులకు దర్శి నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కుందుర్తి లక్ష్మణ్ అందించిన రూ.7వేల నగదును, టీడీపీ నాయకులు కొమ్మతోటి సుబ్బారావు, శృంగారపు నాగసుబ్బారెడ్డి, బొందల రాజు, అంకాల మల్లిఖార్జున తదితరులు అందించిన షీల్డులను బహూకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పత్తి వెంకటేశ్వర్లు, ఎం. సురేష్‌బాబు, నిర్వాహకులు కుందుర్తి లక్ష్మణ్, కొమ్మతోటి దుర్గాప్రసాద్, దమ్ము చిరంజీవి, బూరగ బాబు, బిల్లా సాయి, బొందల లక్ష్మణ్, బిల్లా రాజేష్ పలు గ్రామాలకు చెందిన క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



ప్రథమస్థానంలో నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న మండల టీడీపీ అధ్యక్షుడు, నాయకులు

హనుమజ్జయంతి వేడుకలు

అంజనీపుత్రుడికి అభిషేకాలు, విశేషపూజలు



దర్శిలో ఆంజనేయస్వామి గుడిలోపూజలు చేస్తున్న టీడీపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి, లలిత్ సాగర్ దంపతులు

దర్శి, జూన్ 1 : మండలంలో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శి పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామి వారికి వేదపండితులు అభిషేకం, లక్ష తమలార్చన తదితర పూజలు చేశారు. దర్శి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, భర్త లలిత్ సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగరపంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు ప్రత్యేక పూజలు చేశారు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా రాజంపల్లి పంచాయతీ పరిధిలోని ముసినది తీరానగల ఆంజనేయస్వామి, వెంకటాచలంపల్లి ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు : మండలంలోని వేంపాడు, పెదరావిపాడు, పూరిమెట్ల, పసుపుగల్లు, ఉల్లగల్లు, పులిపాడు, కెల్లంపల్లి, జమ్మలమడక, బొప్పూడివారిపాలెం, ఈదర, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి భక్తులు తమలపాకులతో అర్చనలు చేశారు. భక్తులు పొంగళ్ళు పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు.

మండలంలోని కొమ్మవరంలో హనుమాన్ జయంతి సందర్భంగా నూతనంగా ప్రతిష్ఠించనున్న ఆంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేయనున్న ధ్వజ స్తంభాన్ని శనివారం గ్రామంలోకి తీసుకువచ్చారు. జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ ముఖ్య అతిథిగా హాజరై ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆశీస్సులు కొమ్మవరం గ్రామస్తులకు ఉండాలని ఆమె దేవుడిని వేడుకుంటున్నారు.

కురిచేడులో..

కురిచేడు : మండలంలోని ఆంజనేయ స్వామి విగ్రహాల వద్ద, ఆంజనేయ స్వామి దేవాలయాలలో శనివారం ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కురిచేడు కొండమీద వెలసిన ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఉదయం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వేంపాడులో ఆంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ



కురిచేడు : అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి

తాళ్లూరులో

తాళ్లూరు : .మండలంలోని తాళ్లూరు, బొద్దికూరపాడు, లక్కవరం, కొత్తపాలెం, మాధవరం, తూర్పుగంగవరం, సోమవరప్పాడు, విఠలాపురం, మల్కాపురం తదితర గ్రామాల్లో హనుమత్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.తూర్పుగంగవరం ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద గతనెల28 వతేదీ నుంచి ఈనెల 1 వతేదీ వరకు 5 రోజుల పాటు హనుమత్ జయంతి ఉత్సవాలు జరిపారు. శనివారం స్వామిని ఆలయపూజారి నారాయణం ఆదిత్య దీక్షితులు ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించి స్వామికి అభిషేకాలు, అష్టోత్తర నామపూజలు, ఆకు పూజలు నిర్వహించారు. యత్తపు ఎల్లారెడ్డి దంపతులు స్వామికి నగలు బహూకరించారు.



తాళ్లూరులో పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

కనిగిరిలో

కనిగిరి : కనిగిరి రామాలయం వీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో, శంఖవరం గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో, కొత్తూరు గ్రామంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. కొత్తూరు అభయాంజనేయ స్వామి ఆలయంలో భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహించారు.

దొనకొండలో..



ఆనంద ఆశ్రమంలోని ఆంజనేయ స్వామి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

దొనకొండ : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని ఆనంద ఆశ్రమంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆకుపూజలు నిర్వహించారు. వేడుకల సందర్భంగా దేవాలయానికి వచ్చిన భక్తులకు ధర్మకర్త భైరవానంద స్వామి తీర్థప్రసాదాలను, అల్పాహారాన్ని అందించారు. ఈ వేడుకల్లో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సీఎస్‌పురంలో..

సీఎస్‌పురం(పామూరు) : మండలంలో హనుమజ్జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. చింతపూడు నాగులారం దేవస్థానంలో వెలసియున్న శ్రీ వీరభద్ర వీరాంజనేయ స్వామి వారికి అభిషేకాలు,విశేష పూజలను నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ మురార్జీ, కార్యనిర్వాహకుడు వసంతరాజు, ఈవో పాల్గొన్నారు.



సీఎస్‌పురంలో ఆంజనేయుడికి గ్రామోత్సవం

చౌడేశ్వరీ అమ్మవారి కొలుపులు

కురిచేడు, జూన్ 1: మండలంలోని పడమర వీరాయపాలెం గ్రామంలోని చౌడేశ్వరీ అమ్మవారి కొలుపులు శనివారం ప్రారంభం అయ్యాయి. రాత్రి కన్నుల పండువగా జ్యోతులతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సంవత్సరం 48 జ్యోతుల ప్రదర్శన ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది. ఆదివారం చౌడేశ్వరీ అమ్మవారి కొలుపులు జరగనుండటంతో గ్రామంలో తిరునాళ్ల వాతావరణం నెలకొంది.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

దర్శి, జూన్ 1: స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో చేరే విద్యార్థుల నుంచి 20 వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధానాధికారి పి.సంధ్యారాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 10 వ తరగతి పాసైన ఫెయిలైన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



విచారిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్లో అబుదావలి (ఫైల్)

బీరు సీసా దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

కురిచేడు, జూన్ 1: బోదనంపాడు గ్రామంలో శుక్రవారం చింత పిక్కలు ఆట విషయంలో ఘర్షణ జరిగి వేమా గోవింద రమేష్ అనే యువకుడు 108 అంబులెన్స్ పైలెట్ అబుదావలిని బీరు సీసాతో పొడిచాడు. ఈ ప్రమాదంలో అబుదావలి అక్కడిక్కడే అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. వెంటనే క్షతగాత్రుడిని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్ళగా మెరుగైన వైద్యం కోసం ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మంగళగిరి ఎన్‌ఆర్‌ఐ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున అబుదావలి మృతి చెందాడు. అబుదావలి స్వగ్రామం ముండ్లమూరు మండలం కాగా కురిచేడు మండలం బోదనంపాడు గ్రామంలో వివాహం చేసుకుని ఇక్కడే స్థిర పడ్డాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని కురిచేడు ఎస్‌ఐ శ్రీకాంత్ పరిశీలించి అక్కడి వారితో మాట్లాడారు. సంఘటనా స్థలంలో ఉన్న వారితో మాట్లాడి వారి వివరాలు రికార్డ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నిందితుడు గోవింద రమేష్ పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ తెలియజేశారు.

రావిగుంటపల్లిలో చోరీ

పామూరు, జూన్ 1 : మండలంలోని రావిగుంటపల్లి గ్రామంలో పట్టపగలు చోరీ జరిగింది. శనివారం గ్రామంలోని టోల్‌గేటు సమీపంలో పోలంరెడ్డి బాలమ్మ ఇంటిలోని బీరువా తాళం తీసి బీరువాలోని సుమారు రూ.3.50 లక్షల నగదు, ఒకటిన్నర సవర బంగారు ఆభరణాలు అపహరించుకొని వెళ్లినట్లు బాధితురాలు తెలిపారు. చోరీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.



హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

కురిచేడులో ఇంటర్ తరగతులు ప్రారంభం

కురిచేడు, జూన్ 1: కురిచేడులోని వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హైస్కూల్ ప్లస్ పథకంలో భాగంగా ఇంటర్ తరగతులు ప్రారంభం అయ్యాయి. ఎంపీసీ, సీఈసీ గ్రూపులు కురిచేడులో ఉన్నట్లు ప్రిన్సిపాల్ సాయి తెలిపారు. కనీసంగా గ్రూపునకు 20 ఉండాలని లేకపోతే తరగతులు జరగడం కష్టమని ఆయన తెలిపారు. విద్యార్థులు ప్రవేశాల కోసం 94408 87264, 94402 87015 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మిగులు సీట్ల భర్తీకి నోటిఫికేషన్

ముండ్లమూరు, జూన్ 1 : మండల కేంద్రం ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో 2024 - 25 విద్యా సంవత్సరానికి గాను 7, 8, 9, ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేశామని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కే పూర్ణచంద్రరావు తెలిపారు. ప్రవేశం కోసం విద్యార్థులు ఈనెల 11వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని, 13వ తేదీన ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని కోరారు. మిగులు సీట్లను రిజర్వేషన్‌ల వారీగా భర్తీ చేయటం జరుగుతుందన్నారు.

దివ్యాంగ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

సీఎస్‌పురం(పామూరు), జూన్ 1 : దివ్యాంగ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నట్లు మండల విద్యశాఖ అధికారులు జె. ప్రసాదరావు, రాజాల కొండారెడ్డిలు తెలిపారు. జిల్లా సమగ్రశిక్ష అభియాన్ అధికారుల ఆదేశాల మేరకు బడిలో నమోదుకాని దివ్యాంగ పిల్లలను గుర్తించి వారిని తగిన తరగతిలో చేర్పించేందుకు ఐఈఆర్‌పీల ద్వారా ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వే విధానాన్ని శనివారం ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండలంలో ఇప్పటి వరకు 25 మంది దివ్యాంగ పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు వి. వెంకట్రావు, కే రంజిత్ పాల్గొన్నారు.







జై హనుమాన్

జిల్లా అంతటా హనుమాన్ జయంతి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి విశేష అలంకారాలు, పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. తమలపాకులతో, మామిడి పండ్లతో సహస్ర నామార్చనలు నిర్వహించారు. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయాల్లో భక్తుల కోలాహలం నెలకొంది. భక్తులు శ్రీఆంజనేయం నామస్మరణ చేశారు. సువర్చలా సహిత వీరాంజనేయస్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు వడపప్పు, పానకం అందించగా కొన్ని ప్రధాన దేవాలయాల్లో అన్న ప్రసాద వితరణలు జరిగాయి.

కర్లపాలెం: పాతనందాయపాలెంలో శ్రీఅభయాంజనేయస్వామికి గజమాల, నిమ్మకాయలతో అలంకరణ



విశేషాలంకరణలో జంపని వీరాంజనేయ స్వామి

కందిపప్పు కోత

- ఐదు నెలలుగా కార్డుదారులకు ఎగవేత
- బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180
- రాయితీపై పంపిణీని విస్మరించిన పౌరసరఫరాల శాఖ
- నిత్యావసరాల ధరలు పెరిగినా పట్టించుకోని ప్రభుత్వం
- రేషన్ సరుకుల కోత జాబితాలో చేరిన గోధుమ పిండి

రేషన్ సరుకుల్లో కందిపప్పునకు కోతేశారు.. గోధుమ పిండి పంపిణీని మరిచారు. కొన్ని నెలలుగా రేషన్ అంటే బియ్యం మాత్రమే ఇస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర విపరీతంగా పెరిగిపోయింది. ఆ భారం నుంచి తప్పించుకునే క్రమంలో రేషన్‌లో కందిపప్పును పక్కన పెట్టేశారు. రేషన్ సరుకుల కోత జాబితాలో గోధుమపిండి కూడా చేరిపోయింది. గతంలో బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరిగితే వాటిని క్రమబద్ధీకరించే చర్య ల్లో భాగంగా ప్రభుత్వం సబ్సిడీపై వాటిని రేషన్ స్టోర్లు, రైతుబజారుల ద్వారా పంపిణీ చేసేది. అయితే వైసీపీ ప్రభుత్వం ధరల క్రమబద్ధీకరణ అనే విషయాన్నే విస్మరించింది. పైగా రేషన్ సరుకుల్లో వాటికి కోత వేసి కార్డుదా రుల బాధలను పట్టించు కోవడం లేదన్న విమర్శలున్నాయి. రేషన్ సరు కుల కోత, మరో వైపు ధరల భారంతో పేదలు ఇక్కట్లు పడుతున్నా అటు అధికా రులు, ఇటు పాలకులకు పట్టడంలేదు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గతంలో రేషన్ స్టోర్లు మిని మాల్స్‌గా ఉండేవి. సబ్సిడీపై బియ్యం, కందిపప్పు, గోధుమ పిండి, పామాయిల్ తదితరాలను కార్డుదారులకు ప్రభుత్వం అందజేసేది. అయితే వైసీపీ ప్రభుత్వం పౌరసరఫరాల వ్యవస్థ ప్రక్షాళన అంటూ పేదల పొట్టకొట్టింది. వ్యవస్థ ప్రక్షాళన ఏమో కానీ తమకు అందే సరుకుల్లో కోత పడిందని తెల్లకార్డుదారులు వాపోతున్నారు. ఇంటి వద్దకు రేషన్ అని చెప్పి ఓ వాహనం, దానికో డ్రైవర్, హెల్పర్‌ను నియమించి కేవలం ఒక్కో లబ్ధిదారుడికి ఐదు కేజీల బియ్యంతో సరిపుచ్చుతోంది. రేషన్ సరుకుల్లో కందిపప్పు, గోధుమ పిండి పంపిణీని నిలిపివేసింది. తెల్లకార్డుదారులకు ఐదు నెలలుగా ప్రభుత్వం కందిపప్పు పంపిణీపై మొండిచేయి చూపుతున్నది. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో ధర రూ.180 నుంచి రూ.190 వరకు ఉంది. మార్కెట్‌లో ధర పెరగడంతో ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసే కందిపప్పు కోసం కార్డుదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే రాయితీపై కందిపప్పు పంపిణీని పౌరసరఫరాల శాఖ పూర్తిగా విస్మరించింది. కందిపప్పు అడిగితే స్టాక్ లేదనే సమాధానంతో సరిపుచ్చుతున్నారు. ప్రభుత్వం కిలో కందిపప్పు రాయితీపై రూ.67కు ఇవ్వాల్సి ఉంది. ప్రైవేట్ మార్కెట్‌లో దాదాపు రూ.100 నుంచి రూ.110 వరకు అధికంగా ఉండటంతో కార్డుదారులు రాయితీ కందిపప్పు పంపిణీ చేయాలని కోరుతున్నా వీరి మొర ఆలకించే వారే కరువయ్యారు. కందిపప్పు ధర మార్కెట్‌లో పెరగడంతో ఆ భారం తప్పించుకునేందుకే సరఫరాను నిలిపివేసిందన్న విమర్శలున్నాయి. బహిరంగ మార్కెట్‌లో కిలో గోధుమ పిండి ధర రూ.45 నుంచి రూ.50 వరకు ఉంది ప్రభుత్వం రాయితీపై కిలో రూ.16కు అందిస్తోంది. దీంతో కార్డుదారులు గోధుమ పిండి తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. గోధుమ పిండి సరఫరాను కూడా నిలిపివేసింది. కందిపప్పుతో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పేదలపై ఆర్థిక భారం పడుతుంది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కందిపప్పు పంపిణీని ప్రభుత్వం దాదాపుగా నిలిపివేసింది.



- పల్నాడు జిల్లాలో 6,45,110 తెల్లకార్డులు ఉన్నాయి. ఒక్కొక్క కార్డుదారుడికి కిలో కందిపప్పు అందజేయాలి. మేలో ఎన్నికలు ఉండటంతో 48.21 శాతం కార్డుదారులకు 2,85,104 ప్యాకెట్ల కందిపప్పును పంపిణీ చేశారు. ఎన్నికలు పూర్తవడంతో జూన్‌లో కార్డుదారులకు మొండిచేయి చూపనుంది. గోధుమ పిండి గత నెలలో 10.87 శాతం కార్డులకు పంపిణీ చేశారు. ఈ నెలలో 1.17 శాతం కార్డులకు సరఫరా చేయనున్నారు.
- బాపట్ల జిల్లాలో 4,86,029 తెల్లకార్డులు ఉన్నాయి. ఈ నెలలో 0.03 శాతం కార్డుదారులకు మాత్రమే కందిపప్పు సరఫరా చేశారు. గోధుమ పిండి గత నెలలో 12.85 శాతం కార్డులకు ఈ నెలలో 1.12 శాతం కార్డులకు సరఫరా చేశారు.
- గుంటూరు జిల్లాలో 5,99,511 తెల్ల కార్డులు ఉన్నాయి. మే నెలలో 16,634 ప్యాకెట్ల కందిపప్పు పంపిణీ చేశారు. గోధుమ పిండి గత నెలలో 9.73 శాతం కార్డులకు పంపిణీ చేయగా ఈ నెలలో 1.52 శాతం కార్డులకు పంపిణీ చేయనున్నారు.

ఈవీఎంలదే.. తొలి ఫలితం



- పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు మధ్యాహ్నం తర్వాతే
- అరగంట ముందే పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభం
- తతంగమంతా పూర్తి అయ్యేందుకు కొన్ని గంటల సమయం
- అదే ఈవీఎంల లెక్కింపు ప్రతీ అరగంటకు ఒక రౌండ్ పూర్తి

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఓట్ల లెక్కింపులో ప్రప్రథమం గా ఈవీఎంల ద్వారా కౌంటింగ్ చేసిన తొలి రౌండ్ ఫలితమే ముం దుగా వెలువడుతుంది. పోస్టల్‌బ్యాలెట్ ఓట్లు లెక్కింపు అరగంట ముందే ప్రారంభమౌతుందని, దీనివల్ల వాటి ఫలితాలే ముందు వస్తా యని చాలామంది అపోహలకు గురౌతున్నారు. అది నిజం కాదని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈవీఎంల లెక్కింపు కంటే అరగంట ముందుగా పోస్టల్‌బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తామని, అయితే వాటి లెక్కింపు చాలా సమయం పడుతుందంటున్నారు. శాసనసభ నియోజవకర్గాల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మధ్యాహ్న సమయం దాట వచ్చని, గుంటూరు పార్లమెంట్‌కు మాత్రం సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య సమయం అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అనేక నియమ నిబంధనలున్నాయి. ఇవి స్థానిక సంస్థల ఎన్నికల్లో వినియోగించే బ్యాలెట్ ఓట్లు లాంటివి కావు. ఉద్యోగులు, దివ్యాంగులు, 85 ఏళ్ల వయస్సు దాటి ఇంటి వద్దనే ఓటు వేసిన వారు, అత్యవసర సేవల్లో ఉన్న వారు, సర్వీసు ఓటర్లు వేసిన ఓట్లు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కవర్ల రూపంలో బ్యాలెట్ బాక్సులలో నిక్షిప్తమై ఉన్నాయి. కౌంటింగ్ సందర్భంగా ఈ నెల 4న ఉదయం స్ట్రాంగ్‌రూం సీలు తెరిచి హాల్‌లోకి తీసుకొస్తారు. ఏజంట్ల సమక్షంలో బాక్సులు తెరిచి కవర్లను ఓపెన్ చేయడం ప్రారంభిస్తారు. అంతకంటే ముందు రిటర్నింగ్ అధికారి పోస్టల్ బ్యాలెట్‌లు మొత్తం ఎన్ని అనేది అబ్జర్వర్‌కు వివరిస్తారు. పెద్ద కవర్ తెరిచిన తర్వాత డిక్లరేషన్ ఫారం విడిగా ఉండాలి. అలానే ఓటు వేసిన బ్యాలెట్ పేపర్ వేరే కవర్‌లో ఉండాలి. బ్యాలెట్ పేపర్ ఉన్న కవర్ సీలు తెరిచే ముందు డిక్లరేషన్ ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తారు. డిక్లరేషన్ ఫారం లేకపోయినా, దానిపై అటెస్టింగ్ అధికారి సంతకం చేయకపోయినా, పోస్టల్ బ్యాలెట్ పేపర్ ఉన్న కవర్ సీరియల్ వేర్వేరుగా ఉన్నా బ్యాలెట్ పేపర్ నిక్షిప్తం అయి ఉన్న కవర్‌ని తెరవకుండానే తిరస్కరిస్తారు. అటెస్టింగ్ అధికారి సీలు లేకపోయినా, పేరు, హోదా లేకపోయినా తిరస్కరించడానికి వీల్లేదు. అన్ని చెక్‌లు అయిన తర్వాత పోస్టల్ బ్యాలెట్ ఉన్న కవర్‌ని ఓపెన్ చేస్తారు. అందులోనూ కొన్ని చెక్స్ చేపడతారు. ఏ అభ్యర్థి పేరు పక్కన టిక్ పెట్టకపోయినా, ఒకరి కంటే ఎక్కువ మందికి టిక్ కొట్టినా, డ్యామేజ్ అయి ఉన్నా వాటిని కూడా తిరస్కరిస్తారు. ఆ తర్వాతే ఓట్ల లెక్కింపు చేపడతారు. ఏజంట్లకు చూపించి అభ్యర్థుల బాక్సులలో వేస్తారు. ఆ తర్వాత అభ్యర్థి వారీగా వచ్చిన ఓట్లు లెక్కించి ఫలితాన్ని ప్రకటిస్తారు. ఒకవేళ ఇద్దరు అభ్యర్థుల మధ్య ఓట్ల వ్యత్యాసం తిరస్కరించిన వాటి కంటే తక్కువ ఉంటే మరోసారి లెక్కిస్తారు. ఈ తతంగం అంతా పూర్తి అయ్యే సరికి కొన్ని గంటల సమయం పడుతుంది. మరోవైపు ఈవీఎంల లెక్కింపు ఉదయం 8.30 గంటలకు ప్రారంభమౌతుంది. అవి కౌంటింగ్ టేబుల్స్ మీదకు రాగానే సీలు తెరిచి రిజల్ట్ బటన్ నొక్కుతారు. ఆ వెంటనే ఒక్కో అభ్యర్థికి ఎన్ని ఓట్లు ఆ పోలింగ్ బూత్‌లో వచ్చాయనేది తెలుస్తుంది. ప్రతీ అరగంటకు ఒక రౌండ్ లెక్కింపు పూర్తి అవుతుంటుంది. ఈ నేపథ్యంలో ఫలితాల సరళి తొలుత ఈవీఎంలలో వచ్చిన ఓట్ల ద్వారానే తెలుస్తుంది. ఎప్పుడైతే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తి అవుతుందో అప్పుడు వాటిని తీసుకొచ్చి ఈవీఎం ఫలితాలతో కలిపి ప్రకటిస్తారు.

ఎమ్మెల్యే పిన్నెల్లి నుంచి ప్రాణహాని

సుప్రీంకోర్టులో శేషగిరిరావు పిటీషన్.. రేపు విచారణ

నరసరావుపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ పాల్వా యిగేటు టీడీపీ పోలింగ్ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు సుప్రీంకోర్టును శనివారం ఆశ్ర యించారు. పిన్నెల్లికి 6వ తేదీ వరకు అరెస్టు నుంచి హైకోర్టు ఇచ్చిన మినహాయింపును రద్దు చేయాలని శేషగిరిరావు పిటిషన్‌లో కోరారు. ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో పిన్నెల్లి తనపై దాడి చేశారని కూడా పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు రోజు కూడా పిన్నెల్లి హింసకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. ఆధారాలున్నా ఎమ్మెల్యే పేరు, అనుచరుల పేర్లు లేకుండా కేసు పెట్టారని ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనపై శేషగిరిరావు మరో పిటిషన్ దాఖలు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులంటూ ఎమ్మెల్యేకు అనుకూలంగా అధికారులు వ్యవహరించారని అందులో పేర్కొన్నారు. ఈ అంశాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోకుండా ముందస్తు బెయిల్ ఇచ్చిందన్నారు. తీవ్ర ఘటనలైనా పిన్నెల్లికి హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై శేషగిరిరావు ఆందోళన వ్యక్తం చేశారు. మాచర్ల నియోజకవర్గంలో ప్రతిపక్షాలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదన్నారు. శేషగిరిరావు దాఖలు చేసిన రెండు పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టనుంది.

ఓట్ల లెక్కింపునకు సిద్ధం

- పటిష్ట బందోబస్తు ఏర్పాటు
- జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా
- బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల చుట్టూ రెడ్ జోన్ : ఎస్పీ

బాపట్ల, జూన్ 1: ఓట్లలెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని ఓట్లలెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాల మేరకు ఓట్లలెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామన్నారు. ఓట్లలెక్కింపునకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 14 ఓట్లలెక్కింపు కేంద్రాలు ఉండగా 12 కేంద్రాల్లో ఈవీఎంలు, రెండు కేంద్రాల్లో పోస్టల్‌బ్యాలెట్లు లెక్కిస్తామన్నారు. కళాశాల ప్రవేశ ద్వారం నుంచి 100 మీటర్ల లోపు వాహనాలకు అనుమతిలేదన్నారు. వాహనాలకు పార్కింగ్ జోన్ సిద్ధం చేశామన్నారు. లెక్కింపు అధికారులు, సిబ్బంది ఉదయం 5 గంటలకు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ అధికారులు, సిబ్బంది తప్ప ఇతరులను కౌంటింగ్ జరిగే కళాశాల పరిసరాల్లోకి అనుమతి లేదన్నారు.



బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాల పరిసరాలను ఎస్పీ వకుల్‌జిందాల్‌తో కలిసి పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా

బాపట్లలో పూర్తి నిఘా : ఎస్పీ వకుల్ జిందాల్

కౌంటింగ్ రోజు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల చుట్టూ 2 కిలోమీటర్ల పరిధిని రెడ్‌జోన్‌గా పరిగణించడంతోపాటు పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. బాపట్ల పట్టణంలో పూర్తి నిఘా ఉంటుందన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో అభ్యర్థులు, ఏజెంట్లు వారికి కేటాయించిన ప్రదేశాల్లోనే వాహనాల పార్కింగ్ చేయాలని తెలిపారు. పార్కింగ్ ప్రదేశాలను సిబ్బందితో కలిసి ఎస్పీ పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశంలోకి వెళ్లడానికి, రావడానికి అనువుగా ర్యాంప్‌లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. కలెక్టర్, ఎస్పీల వెంట డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ఏఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, ఆర్వోలు, డీఎస్పీ సి.హెచ్.మురళీకృష్ణ, రూరల్ సీఐ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ ప్రదేశాలు ఇలా..

- కౌంటింగ్ కేంద్రానికి వచ్చే అభ్యర్థు లందరూ కమ్మజనసేవాసమితి కల్యాణమండపం పక్కన, దానిఎదురుగా ఉన్న రెండు ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- అధికారులు, సిబ్బంది, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ అధికారులు విలియంబూత్ జూనియర్ కళాశాల వద్ద వాహనాలు పార్కింగ్ చేయాలి.
- పర్చూరు, చీరాల, అద్దంకి వైపు నుంచి వచ్చే టీడీపీ, ఇండిపెండెంట్ ఏజెంట్లు చీరాల రోడ్డులోని జాతీయ రహదారి వై జంక్షన్ సమీపంలో రాయల్‌మెరైన్ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- పర్చూరు, చీరాల, అద్దంకి వైపు నుంచి వచ్చే వైసీపీ, ఇండిపెండెంట్ ఏజెంట్లు వెదుళ్ళపల్లి బధిరుల ఆశ్రమపాఠశాల ప్రాంతంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- పర్చూరు, చీరాల, అద్దంకి వైపు నుంచి వచ్చే కాంగ్రెస్, ఇండిపెండెంట్ ఏజెంట్లు చీరాల రోడ్డులోని వై జంక్షన్ వద్ద రాయల్ మెరైన్ స్థలం ఎదురుగా వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- రేపల్లె, వేమూరు, బాపట్ల వైపు నుంచి వచ్చే టీడీపీ, ఇండిపెండెంట్ ఏజెంట్లు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల వెనుక సుబ్బారెడ్డిపాలెం రోడ్డు వద్ద ప్రదేశంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- రేపల్లె, వేమూరు, బాపట్ల వైపు నుంచి వచ్చే వైసీపీ ఏజెంట్లు జాతీయ రహదారి నుంచి నాగేంద్రపురం వెళ్ళే రోడ్డు పక్కన వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- రేపల్లె, వేమూరు, బాపట్ల వైపు నుంచి వచ్చే కాంగ్రెస్, ఇండిపెండెంట్ ఏజెంట్లు ఇంజనీరింగ్ కళాశాల వెనుక సుబ్బారెడ్డిపాలెం రోడ్డు పక్కన వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.



కౌంటింగ్ కేంద్రంలో టేబుళ్లను పరిశీలించి సూచనలు చేస్తున్న ఎన్నికల అధికారి రంజిత్‌బాషా

టిక్..టిక్..టిక్

- హీట్ పెంచిన ఎగ్జిట్ పోల్స్
- మరింత జోరందుకున్న బెట్టింగులు
- 48 గంటల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభం

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కొన్ని గంటల్లోకి వచ్చేసింది. మరో 48 గంటల వ్యవధిలో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతో సర్వత్రా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. దేశ వ్యాప్తంగా తుది దశ పోలింగ్ శనివారం సాయంత్రం 6 గంటలతో పూర్తి కాగా అర గంట తర్వాత వచ్చిన ఎగ్జిట్ పోల్స్‌ని కూడా ఎంతో ఆసక్తిగా వీక్షించారు. ఇప్పటికే భారీగా జరుగుతున్న బెట్టింగ్‌లు ఎగ్జిట్ పోల్స్‌తో మరింత జోరందుకున్నాయి. ఇంచు మించు రెండున్నర నెలల ఎన్నికల ప్రక్రియ కొనసాగిన అనంతరం మరికొన్ని గంటల్లో తుది దశకు చేరుకోబోతోన్నది. ఈ నెల 4వ తేదీ మంగళవారం ఉదయం సరిగ్గా 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో తొలుత లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఓటరు ఏ పార్టీకి తీర్పు ఇచ్చాడో ఆ రోజున తేలిపోతుంది. కాగా శనివారం సాయంత్రం విడుదలైన ఎగ్జిట్ పోల్స్ రాజకీయ వాతా వరణాన్ని మరింత వేడెక్కించాయి. సర్వే ఫలితాలు అనుకూలంగా ఇచ్చిన సంస్థలకు జేజేలు కొడుతూ ఏ సంస్థ అయితే తమ అంచనాకు భిన్నంగా పేర్కొన్నదో దానిని తూర్పారబడుతూ సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడుతున్నారు. జాతీయ స్థాయి ఛానెళ్ల మొదలుకుని అనేక సర్వే సంస్థలు టీడీపీ కూటమికి అనుకూలంగా ఫలి తాలు వస్తాయని పేర్కొన్నాయి. ఒకటి, రెండు మాత్రం వైసీపీకి మళ్లీ అధికారం వస్తుందని అంచనా వేశాయి. అయితే ఈ సర్వేల శాస్త్రీయత ఎంతవరకు వాస్తవమనేది మంగళవారం సాయంత్రంతో తేలిపోతుంది. ఇదిలావుంటే ఎగ్జిట్ పోల్స్ సర్వేల ఆధారంగా బెట్టింగ్‌రాయుళ్లు మరింత జోరు పెంచారు. ఆన్‌లైన్‌లోనూ పలు సంస్థలు నిర్వహిస్తున్న బెట్టింగ్‌లపై పందేలు కాస్తున్నారు. మధ్యవర్తుల ద్వారా నిర్వహించే బెట్టింగ్‌లలో 10 శాతం కమీషన్ పోతుంది. అదే బెట్టింగ్‌యాప్‌లు, సైట్‌లలో అయితే ఎలాంటి కమీషన్ ఉండదు.యాప్‌ల ద్వారా కాసే బెట్టింగులలో గెలిస్తే నగదు నేరుగా బ్యాంకు అకౌంట్‌లోకే వస్తుంది. దీంతో బెట్టింగ్ యాప్‌ల వైపు కొంతమంది మొగ్గు చూపుతున్నారు.



వేసవి క్రీడా శిక్షణకు.. మంగళం

- ఎన్నికలు ముగిశాక అంటూ తొలుత ప్రకటన
- కోడ్ సాకుగా చూపుతూ పూర్తిగా విస్మరించిన వైనం

బాపట్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల కాలంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన రం గాల్లో క్రీడారంగం కూడా చేరిన సంగతి తెలి సిందే. గతేడాది ప్రభుత్వం తలపెట్టిన ఆడు దాం ఆంధ్రా కార్యక్రమం కూడా సరైన నిర్వ హణ లేకపోవడంతో అభాసుపాలైంది. ఇక వేసవి క్రీడా శిక్షణా శిబిరాలపై కూడా ప్రభుత్వ నిర్లక్ష్యం పరిపాటిగా మారింది. ఐదేళ్ల పాలన లో రెండేళ్ల మాత్రమే వాటిని నిర్వహించింది. అది కూడా క్రీడాకారులకు ఎటువంటి ఆట సామగ్రి ఇవ్వకుండా, నామమాత్రపు నిధులు మంజూరు చేసి మమ అనిపించింది. గతేడాది వేసవి శిక్షణా శిబిరాల కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులు కేవలం రూ.2.25 లక్షలు మాత్రమే కావడం గమనార్హం. దాదాపు 60 సెంటర్లలో శిక్షణ ఇస్తామని ఆర్భాటపు ప్రకటనలు చేసిన ప్రభుత్వం చివరికొచ్చేసరికి అంతాకలిపి 40 చోట్ల కూడా శిబిరాలు నిర్వహించలేక చేతులెత్తేసింది. వాటిని మే ఆరంభం నుంచి చివరివరకు నిర్వహిస్తారు. ఈ ఏడాది ఎన్నికలు ఉండడంతో ముగిశాక ప్రారంభిస్తామని తొలుత ప్రకటించారు. ఎన్నికలు ముగిసి మూడు వారాలు దాటినా శిక్షణా శిబిరాలు ఊసే ఎత్తలేదు. ఈ లోగానే మే నెల ముగిసిపోవడంతో ఆటలు లేకుండానే వేసవి వెళ్లిపోయింది. ఈ ఏడాది ప్రత్యేకంగా శిక్షణ శిబిరాలు లాంటివేమి లేవని ఆయా పాఠశాలల్లో ఉన్న క్రీడా కోచ్‌ల సారథ్యంలోనే విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తేల్చేశారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు కోచ్‌లను సంప్రదిస్తే శిక్షణ ఇస్తారని చేతులు దులుపుకున్నారు. జిల్లాలోని సగం పాఠశాలల్లో ఆటలకు కోచ్‌లు లేరు. అలాంటిది లేని కోచ్‌లు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని చెప్పడం మొక్కుబడి తంతేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొలుత ప్రకటించినట్లు మే 15నుంచి వేసవి శిక్షణా శిబిరాలు ఎందుకు నిర్వహించలేదన్న ప్రశ్నలు తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

నిధులు లేవనే సాకులా....

గతేడాది వేసవి శిక్షణా శిబిరాల కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులు కేవలం రూ.2.25 లక్షలు మాత్రమే. ఈ అరకొర నిధులతో శిబిరాల నిర్వహణ మొక్కుబడి తంతుగానే ముగించారు తప్పితే పిల్లలకు క్రీడాపరంగా వచ్చిన నైపుణ్యాలు శూన్యమనే చెప్పాలి. ఈ ఏడాది ఆ నిధులు కూడా లేకపోవడం వల్లే కోడ్ సాకుగా చూపి ప్రభుత్వం చేతులెత్తేసిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

గత ప్రభుత్వంలో ప్రత్యేక శ్రద్ధ..

టీడీపీ ప్రభుత్వంలో పర్చూరులో నిర్మించిన క్రీడా ప్రాంగణాన్ని వైసీపీ పాలకులు ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోకుండా దానిని దాదాపు శిథిలావస్థ స్థితికి చేర్చారు. ఇటీవలే ఎన్నికల నిమిత్తం దానిని బాగు చేసి సిబ్బంది విధుల కోసం వాడుకుంటున్నారు. ఇలా టీడీపీ హయాంలో నిర్మించిన క్రీడా ప్రాంగణాలను అటెకెక్కించిన వైసీపీ, పాఠశాలల్లో కనీస స్థాయిలో కూడా క్రీడా పరికరాలు ఉంచడంలో విఫలమైంది. ఒక్క పైసా నిధులు వాటి కోసం నిధులు విదిల్చిన దాఖలాలు లేకపోవడంతో విద్యార్థులకు క్రీడల్లో మెలకువలు నేర్పేవారే కరువయ్యారు

హడావిడి తప్ప చిత్తశుద్ధి కరువు...

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల వ్యవధిలో విద్యార్థుల క్రీడల మీద పెట్టిన ఖర్చు ఎంతంటే అంతా కలిపి పది లక్షలలోపే. ఇదే గత ప్రభుత్వంలో చూసుకుంటే క్రీడా పనిముట్లు, శిబిరాలకోసం దాదాపు కోటి రూపాయలు పైనే వెచ్చించినట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. నాలుగేళ్లుగా క్రీడల నిర్వహణ ఊసే మరచిన పాలకులు చివరి ఏడాది మాత్రం ఆడుదాం ఆంధ్రా పేరిట చేసిన హడావిడి ప్రచారానికే పరిమితమైంది. పైగా క్రీడలపేరిట వాటిల్లో కూడా రాజకీయాలు చొప్పించిన ఘనత వైసీపీది.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న దామచర్ల

బాలినేని కుటుంబంపై రౌడీషీటు ఓపెన్ చేయాలి

● ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా పోలీసుల నిర్లక్ష్యం
● మీడియా సమావేశంలో దామచర్ల డిమాండ్

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 1: ఎన్నికల సమయంలో రౌడీయిజానికి పాల్పడిన బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కుటుంబీకులపై రౌడీషీటు ఓపెన్ చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కూటమి అభ్యర్థి దామచర్ల డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో దామచర్ల మాట్లాడుతూ సమతానగర్‌లో టీడీపీ శ్రేణులపై దాడి, అలాగే రిమ్స్‌లో జరిగిన గొడవలో బాలినేని, ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొని, దౌర్జన్యం చేశారని, అలాగే పోలింగ్ రోజున వెంగముక్కలపాలెంలో ఆయన కోడలు కావ్యశ్రీ దాడి చేశారని తెలిపారు. పోలీసులు వారిపై కేసులు నమోదు చేసి, రౌడీషీటు ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల పోలీసులు 137 రౌడీషీట్లు తెరిచారని, అందులో 62మంది టీడీపీ వారిపై తెరిచారన్నారు. ఎన్నికల సమయంలో అల్లర్లకు పాల్పడి, రౌడీయిజం చేసి, టీడీపీ శ్రేణులపై దాడులు చేసిన బాలినేని కుటుంబంపై పోలీసులు కేసు నమోదు చేయడంతోపాటు రౌడీషీటు ఎందుకు రౌడీ షీటు తెరవలేదని ప్రశ్నించారు. ఈ విషయంలో ఎస్పీ, డీఎస్పీ, ముగ్గురు సీఐలు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. దాడిలో వైసీపీ శ్రేణులు 2వేలమంది పాల్గొన్నారని బాలినేని స్వయంగా వెల్లడించారని, ఆధారాలతో సహా పోలీసులకు రెండుసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదన్నారు. బాలినేని స్వయంగా, మీడియా సాక్షిగా దాడి ఘటనపై మాట్లాడినా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఘర్షణతో సంబంధం లేని వారిపై రౌడీషీట్లు తెరవడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ ఎప్పుడూ గొడవలు చేయలేదన్నారు. కనీస విచక్షణ లేకుండా వైసీపీ శ్రేణులతో కలిసి బాలినేని, ఆయన తనయుడు నేరుగా రిమ్స్‌లోకి వచ్చి రోగులను భయభ్రాంతులకు గురిచేశారని, ఆ విషయాన్ని ఆధారాలతో సహా తాము పోలీసులకు అందజేశామన్నారు. దీనిపై పోలీసులు సీరియస్‌గా దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రైవేటు కేసు వేస్తామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని టీడీపీ భావించిందని, అందుకోసం తాము సహకరించామన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని, పోలీసుల సహకారంతో రౌడీయిజం చేసిన వైసీపీ శ్రేణుల్లో ఎవరినీ వదిలిపెట్టమన్నారు. హైకోర్టు ద్వారా రౌడీషీట్లు తొలగించేందుకు కృషిచేస్తానని, పార్టీశ్రేణులు అధైర్యపడవద్దని దామచర్ల తెలిపారు. రెండురోజుల్లో ఎన్నికల కౌంటింగ్ ముగుస్తుందని, ఖచ్చితంగా టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి కాబోతున్నారని స్పష్టం చేశారు. ఒంగోలులో అత్యధిక మెజారిటీతో తాను గెలవబోతున్నామని పేర్కొన్నారు.



కౌంటింగ్ జరిగే రైజ్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఇతర అధికారులు

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 2: ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. శనివారం ఎస్పీ గరుడ్ సుమిత్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా పార్కింగ్‌కు సంబంధించి ఎస్పీతో చర్చించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కౌంటింగ్ హాల్స్‌ను పరిశీలించారు. అక్కడ అధికారులకు పలు సూచనలు చేశారు. కంప్యూటర్లు, ప్రింటర్లను, స్ట్రాంగ్‌రూము సీలును పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన రిజిస్టర్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం పార్లమెంట్ నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రంతో పాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఆర్వో శ్రీలతతో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

భారీగా పొగాకు కొనుగోలు ధరలు
ఆశాజనకంగా మార్కెట్
పోటీపడి కొంటున్న బయ్యర్లు
వచ్చే ఏడాది మరింతగా
సాగు పెరిగే అవకాశం
బ్యారన్‌లు, పొలాల కోసం పరుగులు
వచ్చే ఏడాదికి బ్యారన్ కౌలు రూ.2లక్షలపైనే
ఎకరా కౌలు రూ.30వేల నుంచి
రూ.45వేల వరకు
ఇప్పుడే అడ్వాన్సులిస్తున్న రైతులు

అ'ధర'హో !

పొగాకు మార్కెట్ కళకళలాడుతోంది. ధరలు అదిరిపోతున్నాయి. ఊహించని రీతిలో దూసుకపోతున్న ప్రస్తుత సీజన్ పొగాకు మార్కెట్ ధరలతో అప్పుడే రైతులు వచ్చే సీజన్ సాగుపై దృష్టి సారించారు. క్రమంగా పొగాకు సాగులో కౌలు రైతులు పెరుగుతుండగా రానున్న ఏడాదికి మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. వేలం కేంద్రాల్లో సగం పొగాకు అమ్మకం పూర్తి అయిందో? లేదో? వచ్చే పంటకాలంపై దృష్టిపెట్టారు. వచ్చే ఏడాది సాగుకు భూములు, బ్యారన్ల కోసం పరుగులు తీస్తున్నారు. దీంతో అటు భూముల కౌలు, ఇటు బ్యారన్ అద్దెలు ఆకాశాన్ని అంటుతున్నాయి. గతేడాది కన్నా కనీసం 50శాతం అధికంగా కౌలు, అద్దెలకు సిద్ధమవుతున్నారు. అంతేకాక కొన్నిచోట్ల డిమాండ్ అధికమై ముందుగానే అడ్వాన్సులు చెల్లించి ఖాయపర్చుకుంటున్నారు.



ఒంగోలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి)/కొండపి: సాధారణంగా పొగాకు పంటలో అధిక లాభాలకు అవకాశం ఉండదు. అంతర్జాతీయ పరిణామాలపై ఈ మార్కెట్ ఆధారపడి ఉండటం, కూలీలు అవసరం గణనీయంగా ఉండటతోపాటు ఉత్పత్తి ఖర్చులు కూడా అధికంగా ఉంటాయి. సొంత బ్యారన్, భూమి ఉన్న రైతులకు ఒక మోస్తరులో మిగులదల ఉంటే కౌలురైతులకు ఒక ఏడాది లాభం వస్తే మరోసారి నష్టం వస్తుంటుంది. కొన్ని సందర్భాల్లో వరుసగా రెండు, మూడేళ్లు మార్కెట్ సరిలేక తీవ్రంగా నష్టపోతుంటారు. అలా 2015లో తీవ్ర నష్టాల పాలైన పొగాకు రైతులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. అనంతరం పంట సాగు విస్తీర్ణం కొంత మేర తగ్గడంతో తిరిగి మార్కెట్ కాస్తంత కోలుకుంటూ వస్తుండగా మూడేళ్లుగా మంచి ధరలే లభిస్తున్నాయి. గతేడాది(2022-23) దక్షిణాదిలో పొగాకు రైతులకు కాస్తంత మంచి ధరలే లభించాయి. 56వేల హెక్టార్లలో సాగుకు 88 మిలియన్ కిలోలు పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతివ్వగా సుమారు 61వేల హెక్టార్లలో సాగుచేశారు. దాదాపు 90 మిలియన్ కిలోలు ఉత్పత్తి జరగ్గా సగటు ధర కిలోకు రూ.237 ధర లభించింది. దీంతో బ్యారన్‌కు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు రైతులకు మిగిలాయి. దీంతో ప్రస్తుత ఏడాది (2023-24)లో భారీగా సాగు పెంచారు. సుమారు 56వేల హెక్టార్లలో సాగుకు, 99.82 మిలియన్ కిలోలు పంట ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా 72వేల హెక్టార్లకుపైగా విస్తీర్ణంలో పంట సాగు చేశారు. దాదాపు 134 మిలియన్ కిలోల ఉత్పత్తి అంచనా. అంతకుముందు సీజన్‌లో(2022-23)లో ఎకరా భూమి కౌలు రూ.15వేల నుంచి రూ.20వేలు, బ్యారన్ అద్దె రూ.లక్ష ఉండగా 2023-24 సీజన్‌కు భూమి కౌలు ఎకరాకు రూ.20వేల నుంచి రూ.25వేలు, బ్యారన్ అద్దె లక్షన్నర పెట్టి తీసుకున్నారు. ఇతర ఖర్చులు కూడా అలాగే పెరిగాయి. అయినప్పటికి ప్రస్తుత సీజన్‌లో మార్కెట్ జోరుగానే సాగుతోంది.

సీజన్ మొదటి నుంచి హాట్‌హాట్‌గా..

అంతర్జాతీయంగా అధికంగా, నాణ్యమైన పొగాకు పండే బ్రెజిల్, జింబాబ్వేలలో ఉత్పత్తి గణనీయంగా తగ్గడం వంటి సానుకూల పరిస్థితులతో ప్రస్తుత సీజన్ హాట్‌హాట్‌గా సాగుతున్నది. మేలురకం గరిష్ఠ ధరలు కిలో రూ.360కు చేరుకోగా బ్రౌన్‌రకం రూ.270 అలాగే లోగ్రేడ్‌లు సైతం కిలో రూ.225పైనే ఉంటున్నాయి. ఇప్పటివరకు సుమారు 62.52 మిలియన్ కిలోలు దక్షిణాదిలో విక్రయాలు జరగ్గా సగటున కిలో రూ.249.50 ఉంది అయితే ఇప్పటివరకు అమ్మకాలు జరిగిన దానిలో లోగ్రేడ్ రకం మూడొంతులుగా ఉంది. అంటే ఈ ఏడాది మార్కెట్ ముగిసేసరికి సగటు ధర కిలో రూ 260కిపైగానే చేరే అవకాశం ఉంది. ఈ స్థాయి ధరలతో ఈ ఏడాది కూడా రైతులకు బ్యారన్‌కు రూ.5లక్షల వరకు మిగులుదల కనిపిస్తుంది. దీంతో ప్రస్తుత సీజన్ అమ్మకాలు సగం కూడా పూర్తి కాకముందే రైతులు వచ్చే సీజన్ పంట సాగుపై దృష్టి సారించారు. అందుకు సంబంధించి కీలకమైన భూముల కౌలు, బ్యారన్ అద్దెలకు తీసుకోవడం గత నెలరోజుల నుంచి జోరుగా సాగుతోంది.

డిమాండ్‌తో పెరిగిన కౌలు

ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి, కందుకూరు నియోజకవర్గాల పరిధిలోని అనేక గ్రామాల్లో ఇప్పటికే వేలాది ఎకరాల భూములను, వందలాది బ్యారన్‌లను వచ్చే ఏడాది కోసం గతం కన్నా దాదాపు 50శాతం అధిక ధరతో రైతులు తీసుకున్నట్లు సమాచారం. ఆ పరిధిలోని దాదాపు వందకుపైగా గ్రామాల్లో గతంలో ఎకరా రూ. 25వేలు ఉన్న భూమి కౌలు ప్రస్తుతం రూ.30వేల నుంచి రూ.35వేల వరకు చేరింది. అలాగే బ్యారన్ అద్దెలు కూడా రూ. లక్షన్నర నుంచి ఏకంగా రూ. 2.5లక్షలకు చేరాయి. సాధారణంగా పొగాకు అమ్మకాలు తర్వాత కౌలు, అద్దెలు చెల్లింపులు జరుగుతుంటుంది. అయితే ప్రస్తుత డిమాండ్‌తో చాలా చోట్ల అడ్వాన్స్‌లు ఇస్తున్నారు. అయితే ఈ విపరీత పోకడపై ఆ రంగంలోని అనుభవజ్ఞులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు మార్కెట్ పూర్తిగా అంతర్జాతీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని, గత రెండు, మూడేళ్లుగా అనుకూల పరిస్థితులతో ప్రస్తుతం ధరలు ఉన్నాయంటున్నారు. వచ్చే ఏడాది ఇతర ప్రపంచ దేశాల్లో పంట ఉత్పత్తి నాణ్యత పెరిగితే ఆ మేర దేశీయంగా ప్రత్యేకించి దక్షిణాది ఆంధ్ర మార్కెట్‌లో ధరలు పడిపోయే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. గతంలో అనేక సందర్భాలలో ఇలా జరిగి ధరలు కోసం రైతులు రోడ్డెక్కడం చివరకు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకోవడాన్ని ఉదహరిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

స్వీయ నియంత్రణ పాటించాలి: ఆర్‌ఎం

కాగా ప్రస్తుత పరిస్థితిపై పొగాకు బోర్డు ఒంగోలు ప్రాంతీయ మేనేజర్ ఎం.లక్ష్మణరావు స్పందిస్తూ రైతులు స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. అత్యధిక మంది పొగాకు రైతులు దీర్ఘకాలంగా ఈ పంట సాగులో ఉండి ఒడుదుడుకులు చూస్తున్న వారేనని అలాంటి వారు ప్రస్తుతం ధరలను చూసి అధికంగా కౌలు, అద్దెలకు భూములు, బ్యారన్‌లు తీసుకోవడం సరైంది కాదన్నారు వీటితోపాటు ఇతర ఉత్పత్తి ఖర్చులు కూడా భారీగా పెరిగి ఉత్పత్తి వ్యయం అధికమైతే ఎంత ధర ఉన్నా మిగిలేది ఏమి ఉండదన్న వాస్తవాన్ని గ్రహించాలని కోరారు. పొగాకు బోర్డు అనుమతి ఇచ్చిన మేరకు మాత్రమే పంట సాగు, ఉత్పత్తిని నియంత్రించుకోవాలని సూచించారు.



ఆల్‌టైం రికార్డు

పొగాకు బోర్డు చరిత్రలో భారీ ధర
కిలో గరిష్ఠ ధర రూ 360
మేలురకం కోసం పోటీపడుతున్న బయ్యర్లు

ఒంగోలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పొగాకు ధరలు అదరగొడుతున్నాయి. తాజాగా శనివారం మార్కెట్‌లో కిలో గరిష్ఠ ధర ఏకంగా రూ.360 పలికింది. పొగాకు బోర్డు చరిత్రలో ఇది ఆల్‌టైం రికార్డు. సాధారణంగా కర్ణాటకలో అధికంగా, ఆంధ్రాలోని ఉత్తరాదిలో కర్ణాటక కన్నా కాస్తంత తక్కువగా అలాగే దక్షిణాదిలో కాస్తంత తక్కువగా ధరలు ఉంటుంటాయి. అలాంటిది ఈ ఏడాది దక్షిణాది పొగాకు మార్కెట్ ఆరంభం నుంచి అదరగొడుతుంది. ఇక్కడ అనుమతి ఇచ్చిన దాని కన్నా పంట సాగు విస్తీర్ణం, పంట ఉత్పత్తి పెరిగినా కూడా ఊహించని రీతిలో ధరలు పెరిగాయి. ఈ సీజన్ కొనుగోళ్ల తొలిరోజు గరిష్ఠ ధర కిలో రూ.230 ఉండగా శనివారం కిలోకు రూ.130 పెరిగి ఏకంగా రూ.360 ధర లభించింది. ఈ ఏడాది కొనుగోళ్లను ఫిబ్రవరి 29న తొలిదశ, మార్చి 6న రెండవదశ ప్రారంభించారు. దాదాపు నెలన్నర రోజులు పెద్దగా గరిష్ఠ ధరలు పెంచకుండానే కొనుగోలు చేశారు. అయితే లోగ్రేడ్, మీడియం రకం బేళ్లను మాత్రం భారీగానే ధర ఇచ్చి కొన్నారు. దీంతో రైతులు మేలురకం బేళ్ళను కాకుండా లోగ్రేడ్ బేళ్లను అధికంగా వేలంకు తెచ్చారు కాగా నెలక్రితం నుంచి మేలురకం బేళ్ల ధరలు క్రమంగా పెరుగుతూ వస్తూ పక్షం క్రితం కిలో రూ.300 ధర పలికింది. అలాగే వారం నుంచి పెరుగుతుండగా గురువారం కిలో రూ.326 లభించింది. శుక్రవారం రూ.338 లభించింది. ఆ ధరలే బోర్డు చరిత్రలో అధికం కాగా శనివారం ఊహించని రీతిలో ఏకంగా కిలో గరిష్ఠ ధర రూ.360 పలికింది. ఒంగోలు-1 కేంద్రంలో ఈ ధర లభించగా ఒంగోలు-2లో రూ.356 లభించింది. ఇతర కేంద్రాల్లోనూ కిలో రూ.345 నుంచి రూ.355 వరకు ఉన్నాయి. గత మూడు దశాబ్దాల పొగాకు బోర్డు చరిత్రలో ఎన్నడూ ఇంత ధర లభించిన దాఖలాలు లేవు. అంతర్జాతీయంగా పంట ఉత్పత్తి తగ్గి ఇక్కడ ఈ స్థాయి ధరలు లభిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాగా ఊహించిన రీతిలో పెరిగిన డిమాండ్, మార్కెట్‌లో లభిస్తున్న ధరలతో రైతుల్లో సంతోషం, ఉత్సాహం కనిపిస్తున్నా భవిష్యత్ పరిణామాలపై బోర్డు అధికారులు, రైతు ప్రతినిధులలో ఆందోళన వ్యక్తమవుతోంది.

24 ఎయిడెడ్ పాఠశాలల మూసివేతకు నోటీసులు

● 18 స్కూళ్లలో అసలు పిల్లలే లేరు
● ఆరు పాఠశాలల్లో పది మందిలోపే విద్యార్థులు

ఒంగోలు(విద్య), జూన్ 1 : జిల్లాలో పిల్లలు లేని ఎయిడెడ్ పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధమైంది. అసలు పిల్లలు లేని(జీరో ఎన్‌రోల్‌మెంట్) పాఠశాలలు, పది మందిలోపు విద్యార్థులు ఉన్నవాటిని గుర్తించి యాజమాన్యాలకు నోటీసులు జారీచేసి మూసివేయమని ప్రభుత్వం డీఈఓని ఆదేశించింది. ఈ మేరకు 2022-23, 2023-24 విద్యాసంవత్సరాల్లో పిల్లలు లేని పాఠశాలలపై వేటు పడనుంది. అధికారులు తేల్చిన లెక్కల ప్రకారం.. ఈ రెండు విద్యా సంవత్సరాల్లో 18 పాఠశాలల్లో అసలు విద్యార్థులు లేరు. మరో ఆరింటిలో పది మందిలోపు విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలకు ఇప్పటికే రెండుసార్లు నోటీసులు జారీచేశారు. తాజాగా ఈ 24 పాఠశాలల యజమానులకు డీఈఓ సుభద్ర నోటీసులు ఇచ్చారు. 15 రోజుల్లోపు వారు వివరణ ఇవ్వాలి. అలా ఇవ్వకపోతే పాఠశాలలకు ఎయిడెడ్ గ్రాంటును నిలిపివేసి, పాఠశాల ప్రభుత్వ గుర్తింపును వెనక్కు తీసుకుంటామని ఆ నోటీసుల్లో హెచ్చరించారు. ఈ 24 పాఠశాలలకు శుక్రవారం నోటీసులు జారీచేశారు.

నోటీసులు జారీ అయిన పాఠశాలలు ఇవే..

దొనకొండ మండలం బచ్చాపురం ప్రాథమిక పాఠశాల, ఒంగోలు వీజీఎస్ హైస్కూలు, వైపాలెం డీఎంఎస్‌బీసీ హైస్కూలు, మార్కాపురం ఏబీఎం హైస్కూలు, కొమరోలు మండలం నల్లగుంట హైస్కూలు, కంభం ఎస్ఎస్‌పి హైస్కూలు, అర్ధవీడు ఎస్ఎస్ఆర్ఎం, నిఖరంపల్లి ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూలు, మద్దిపాడు మండలం రాచవారిపాలెం ఎయిడెడ్ స్కూలు ఉంది. కనిగిరి ఏబీఎం ప్రైమరీ స్కూలు, గిద్దలూరు ఎస్‌పీజీ ప్రైమరీ స్కూలు, నల్లగుంట్ల ప్రైమరీ, దశరాజుపల్లి ఎయిడెడ్ ప్రైమరీ, ఒంగోలు గద్దలగుంట ప్రైమరీ, ఒంగోలు సీతారాంపురం ప్రైమరీ, సింగరాయకొండ ప్రైమరీ, మానేపల్లి ప్రైమరీ, ఒంగోలు జగజ్జీవన్ గురుకులం యూటీ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా లేడు. పోతవరం వీవీఎస్ ఎయిడెడ్‌లో ఆరుగురు, పెద్దకొత్తపల్లి ఆర్ఏఈఎస్‌లో ఏడుగురు, ఒంగోలు ఏబీఎం పీఎస్‌లో ఏడుగురు, మార్కాపురం శారదా ఏఈఎస్‌లో నలుగురు, బోడపాడు ఏఈఎస్‌లో పదిమంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలన్నింటికి మూసివేతకు నోటీసులు జారీ అయ్యాయి.

బీరు సీసా దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

కురిచేడు, జూన్ 1: బోదనంపాడు గ్రామంలో శుక్రవారం చింత పిక్కెలు ఆట విషయంలో ఘర్షణ జరిగి వేమా గోవింద రమేష్ అనే యువకుడు 108 అంబులెన్స్ పైలెట్ అబుదావలిని బీరు సీసాతో పొడిచాడు. ఈ ప్రమాదంలో అబుదావలి అక్కడికక్కడే అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. వెంటనే క్షతగాత్రుడిని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్ళగా మెరుగైన వైద్యం కోసం ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మంగళగిరి ఎన్ఆర్ఐ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున అబుదావలి మృతి చెందాడు. అబుదావలి స్వగ్రామం ముండ్లమూరు మండలం కాగా కురిచేడు మండలం బోదనంపాడు గ్రామంలో వివాహం చేసుకుని ఇక్కడే స్థిర పడ్డాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని కురిచేడు ఎస్ఐ శ్రీకాంత్ పరిశీలించి అక్కడి వారితో మాట్లాడారు. సంఘటనా స్థలంలో ఉన్న వారితో మాట్లాడి వారి వివరాలు రికార్డ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నిందితుడు గోవింద రమేష్ పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ తెలియజేశారు.

కూటమి శ్రేణుల్లో జోష్...

● ఎక్కువ సర్వే సంస్థల అంచనా టీడీపీకే అధికారం
● ఆరా సంస్థ లెక్కలపై విభిన్న చర్చ
● జిల్లాలోనూ కూటమికే మెజారిటీ అని అంచనా

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రంలో టీడీపీ కూటమికే అధికారం దక్కనుందని ఎక్కువ సర్వే సంస్థలు అంచనా వేయడంతో ఆ శ్రేణుల్లో జోష్ పెరిగింది. జాతీయ సర్వే సంస్థలు దాదాపు పూర్తిగా కూటమికే విజయావకాశాలున్నాయని తేల్చేశాయి. రాష్ట్ర స్థాయిలోని సర్వే సంస్థలు కూడా అత్యధికం అటువైపు మొగ్గుచూపాయి. తదనుగుణంగా జిల్లాలోనూ ఎక్కువ స్థానాల్లో టీడీపీ కూటమికే దక్కుతాయని ఆ సంస్థలు అంచనా వేశాయి. అయితే వైసీపీకి అధికారం దక్కే అవకాశం ఉందని కొన్ని సర్వే సంస్థలు అంచనా వేసినప్పటికీ అందులో ఆరా అనే ఒక సర్వే సంస్థ అంచనాలపై విస్తృత చర్చ జరుగుతోంది. జిల్లాకు సంబంధించి కూడా కొన్ని స్థానాలపై ఆరా ఇచ్చిన విశ్లేషణ కూడా కొన్ని అనుమానాలకు తావిచ్చింది.

అక్కడ.. ఇక్కడ కూటమే..

కేంద్రంలో తిరిగి ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని ప్రధాన సర్వే సంస్థలన్నీ అంచనా వేశాయి. రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉన్న సంస్థలన్నీ కూడా ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని వెల్లడించాయి. ఇండియా టుడే, ఏబీసీ సీఓటర్, పయనీర్, ఇండియా టీవీ, సీఎన్ఎస్, న్యూస్ 18 తదితర జాతీయ స్థాయి సర్వే సంస్థలన్నీ కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని అంచనా వేశాయి. రాష్ట్రంలో టీడీపీ కూటమికి ఇటు అసెంబ్లీ, అటు లోక్‌సభ స్థానాల్లో పూర్తి ఆధిక్యత వస్తుందని కూడా వెల్లడించాయి. ఇక రాష్ట్రస్థాయిలో అయితే గతం నుంచి పనిచేస్తున్న సర్వే సంస్థలలో అత్యధిక సంస్థలు టీడీపీ కూటమికి అధికారం ఖాయమని అంచనా వేశాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కచ్చితమైన ఎగ్జిట్ పోల్స్‌ను ఇచ్చిన ఎక్కువ సంస్థలు రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని అంచనా వేశాయి. అలాంటి వాటిలో పీపుల్స్‌సర్వే, చాణక్య రైస్ లాంటి సంస్థలతోపాటు కేకే సర్వీసెస్ లాంటి కొత్త సంస్థలు ఉన్నాయి. అయితే వీటిలో ఆరా సంస్థ రాష్ట్రంలో తిరిగి వైసీపీ అధికారంలోకి వస్తుందని వెల్లడించడం చర్చనీయాంశమైంది. గత ఏడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆరా సంస్థ ఎగ్జిట్ పోల్స్ నిజమయ్యాయి. అయితే ఈ పర్యాయం ఆయన కేవలం టీడీపీ కూటమి కన్నా 15 నుంచి 20 స్థానాల ఆధిక్యతతో మాత్రమే వైసీపీ తిరిగి అధికారంలోకి రావచ్చని అంచనా వేశారు. అదే సమయంలో వైసీపీలోని కొందరు ప్రముఖులు, కొందరు మంత్రులు ఘోర ఓటమిని చవిచూడబోతున్నారని ప్రకటించారు. దీంతో స్వల్ప చోట్ల ఆధిక్యతనే ఆరా సంస్థ చూపించినందున ఆయన అంచనా నిజమవుతుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాకు వచ్చేసరికి

ఇంకోవైపు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వైసీపీ ప్రముఖుల స్థానాల గురించి ఆయన ప్రస్తావిస్తూ సంతనూతలపాడులో మంత్రి నాగార్జున గట్టిపోటీలో స్వల్ప ఓట్లతో గెలుపొందవచ్చని అంచనా వేశారు. కొండపిలో మాత్రం మంత్రి సురేష్ ఓడిపోతాడని అంచనా వేశారు. మరో వైసీపీ ప్రముఖుడు బాలినేని శ్రీనివాసరెడ్డి అంశాన్ని ఆయన ప్రస్తావించకపోవడం విశేషం. అలాగే ఉమ్మడి జిల్లాలో వైసీపీకే అధిక స్థానాలు వచ్చే అవకాశం ఉందని ఆరా సంస్థ మస్తాన్ అంచనా వేశారు. నెల్లూరు లోక్‌సభలో వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి ఓటమి ఖాయమని చెప్పిన మస్తాన్ ఒంగోలు సిట్టింగ్ ఎంపీ మాగుంట విషయం ప్రస్తావించకపోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఉమ్మడి ప్రకాశం జిల్లాలో టీడీపీ కూటమికి కూడా గత ఎన్నికల్లో వచ్చిన ప్రకారం నాలుగు స్థానాలు నుంచి ఐదు స్థానాలు దక్కవచ్చని అంచనా వేసినట్లు తెలిసింది. మిగిలిన సర్వే సంస్థలైతే జిల్లాలో టీడీపీ కూటమికే ఎక్కువ స్థానాలు వస్తాయని అంచనా వేశాయి. సర్వే సంస్థల అంచనాల ప్రకారం టీడీపీకి గతం కన్నా ఎక్కువ స్థానాలు వచ్చే అవకాశం కనిపిస్తోంది.



ఐక్యతతోనే మాదిగల అభివృద్ధి

● ఎమ్మార్పీఎస్ నేత కృష్ణమాదిగ

చీరాలటౌన్, జూన్ 1 : మాదిగలు ఐక్యమత్యంతో ముందుకు సాగితేనే అభివృద్ధి సాధ్యమని ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పేర్కొన్నారు. శనివారం రాత్రి చీరాల మండల పరిధిలోని విజయనగర్ కాలనీలో ఆయన మాదిగలతో జాతీయ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని కారంచేడు మృతవీరుల రుధిర క్షేత్రాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంతేకాకుండా ఎమ్మార్పీఎస్ నాయకులు నాగరాజు అనారోగ్యంతో ఉన్నందున ఆయన్ని పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఎస్సీ వర్గీకరణ కోసం పాటుపడుతున్నట్లు చెప్పారు. ఈనెల 7వ తేదీన వరంగల్‌లో 30 ఏళ్ల ఎమ్మార్పీఎస్ కవాతు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో నాయకులు రుద్రపోగు సురేష్, నరేష్ మాదిగ, విశ్వనాథ మాదిగ, లక్ష్మీనరసయ్య, డీ వందనం, తేళ్ల లక్ష్మీ ప్రసాద్, దేవదానం, ఏసుపాదం, నరేంద్ర, సత్యం, భిక్షాలు, రమేష్, పవన్, అంకయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

- శింగరకొండకు పోటెత్తిన భక్తులు
- శ్రీరాం, ఆంజనేయుని నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- ప్రత్యేక ఏర్పాట్లు, అన్నదానాలు





ప్రదక్షిణ నిర్వహిస్తున్న దేవస్థానం అధికారులు, పూజారులు, భక్తులు
లక్ష తమలపాకుల పూజ అనంతరం ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి



అభయాంజనేయునికి పూజలు చేస్తున్న కొండయ్య

అద్దంకి, జూన్ 1 : హనుమజ్జయంతిని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హనుమజ్జయంతి శనివారం రోజు రావడంతో శింగరకొండ కు భక్తులు పోటెత్తారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో గురువారం ప్రారంభమైన హనుమజ్జయంతి ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. శనివారం ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, బిందెతీర్థం, గోపూజ నిర్వహించారు. అనంతరం నిత్యాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం పరివార దేవతలకు నారికేళ ఫల సమర్పణ చేశారు. ప్రసన్నాంజనేయస్వామి మూల విరాట్‌కు లక్ష నాగవల్లీ (లక్ష తమలపాకులు) దళార్చన నిర్వహించారు. యాగశాలలో నిత్య అనుష్టానములు, మన్యుసూక్త హవనము, పూర్ణాహుతి ద్రవ్య పూజ, మహా పూర్ణాహుతి, యాగశాల ప్రదక్షిణ జరిగింది. సాయంత్రం దీపాలంకరణ, ఊంజల్ సేవ నిర్వహించారు. సహస్ర చూతఫల (మామిడి పండ్లు) పూజ నిర్వహించారు. ఉభయదాతలు గా పాతూరి సీతాపతి దంపతులు, ధూళిపాళ్ల రామగోవిందు, శివకుమారి దంపతులు, వామరాజు ప్రసాదరావు, కల్యాణి దంపతులు, దేరంగుల వెంకటేశ్వర్లు, అంజమ్మ దంపతులు పాల్గొన్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన దీక్షా భక్తులు శనివారం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ఇరుముడులు సమర్పించి దీక్ష విరమించారు. ఆకు పూజలు, అర్చన, వాహన పూజలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈవో, అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా హనుమజ్జయంతికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. దీంతో శింగరకొండ వద్ద తిరునాళ్లను తలపించే విధంగా ఉంది. 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. అద్దంకి పట్టణంలో ప్రభుత్వ వైద్యశాల వద్ద, వేలమూరిపాడు రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం ల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని తిమ్మాయపాలెంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంగులూరులో..

పంగులూరు : మండలంలోని చందలూరు, పంగులూరు గ్రామాలలో హనుమజ్జయంతిని శనివారం భక్తితో నిర్వహించారు. చందలూరులోని శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద వందలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు భారీ అన్నదాన ఏర్పాటు చేశారు. పంగులూరు శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం ప్రాంగణంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవదూతేంద్ర భక్త సమాజం హనుమాన్ చాలీసా పఠనం చేశారు.

బల్లికురవలో..

బల్లికురవ : హనుమజ్జయంతిని భక్తులు భక్తితో నిర్వహించారు. కొత్తపాలెం, గుంటుపల్లి, నక్కబొక్కలపాడు, అంబడిపూడి, వైదన, కొప్పెరపాడు, మల్లాయపాలెం, కొణిదెన, చెన్నుపల్లి, కొండాయపాలెం, ముక్తేశ్వరం గ్రామాలలో ఉన్న అంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా, పొంగళ్లు సమర్పించారు. గ్రామాల్లో హనుమ ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. కొత్తపాలెం, అంబడిపూడి. నక్కబొక్కలపాడు తదితర గ్రామాలలో అన్నదానాలు ఏర్పాటు చేశారు. జై శ్రీరాం అంటూ భజనలు చేస్తూ అలరించారు. కొన్ని గ్రామాలలో కోలాట ప్రదర్శనలు నిర్వహించారు.

ఆంజనేయునికి తమలపాకుల సేవ

చీరాల, జూన్ 1 : చీరాల నియోజకవర్గంలో శనివారం హనుజ్జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామి దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు దేవాలయాల్లో హనుమకు తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. చీరాల మండలం బుర్లవారిపాలెం, ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ సమీపంలో అభయ ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద జరిగిన ప్రత్యేక పూజల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య పాల్గొన్నారు. పేరాల భద్రావతి సమేత భావనారుషి దేవాలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. చీరాల బోసునగర్‌లో వేంచేసియున్న వీరాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వేటపాలెం స్ట్రయిట్‌కట్ సమీపంలోని అభయ అంజేయస్వామి విగ్రహం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

చినగంజాంలో..

చినగంజాం : మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాయుపుత్రుని విగ్రహానికి నూతన వస్త్రాలు, పలు రకాల పూలలతో గజమాల వేసి విశేష పూజలు జరిపారు. ఆర్చకులు ముఖేష్‌పాండే ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి, వడమాల పూజలు జరిపారు. భూ సమేత భావనారాయణస్వామి ఆలయంలో ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపి, స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని భాగ్యనగర్‌లో, గొనసపూడి, సంతరావూరు, పెదగంజాం, రాజుబంగారుపాలెం తదితర గ్రామాల్లో అభయాంజనేయస్వామికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

పర్చూరులో..

పర్చూరు : హనుమజ్జయంతి వేడుకలు శనివారం మండలంలో ఘనంగా జరిగాయి. శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీ అభయాంజనేయస్వామివారికి ఆకు పూజలు నిర్వహించారు. వైజంక్షన్‌లో ఏర్పాటు చేసిన శ్రీ అభయాంజనేయస్వామి 92 అడుగుల విగ్రహం వద్ద పూజాకార్యక్రమాలు చేశారు. మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో జయంతి వేడుకలను భక్తితో నిర్వహించారు. కాల్వ



పర్చూరులో పూజలందుకున్న స్వామి

సత్యనారాయణ నేతృత్వంలో గ్రామస్థుల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. బోడవాడ గ్రామంలో ప్రధాన రహదారి వెంబడి ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామివారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. దీంతోపాటు, అన్నంబొట్లవారిపాలెం, అడుసుమల్లి, నాగులపాలెం, నూతలపాడు, చెరుకూరు గ్రామాల్లో హనుమజ్జంతి వేడుకలు వైభవంగా చేశారు.

ఇంకొల్లులో..

ఇంకొల్లు : హనుమాన్ జయంతి సందర్భంగా ఇంకొల్లులో శ్రీహరిహర ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. పెద్దచెరువు తటాకాంజనేయ స్వామి దేవస్థానం నుంచి ప్రారంభమై వీరాంజనేయస్వామి సందర్శన, కృష్ణనగర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి సందర్శన అనంతరం పర్చూరు రోడ్డు గుండా నాగులచెరువు రావిచెట్టు వద్ద ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం వరకు యాత్ర కొనసాగింది. గంగవరంలో ఆంజనేయస్వామికి, పావులూరు పొలిమేర వీరాంజనేయస్వామి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గొయ్యిలో ఏర్పాటు చేసిన డ్రమ్ము

ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదమరిస్తే అంతే..!

- ప్రమాదకరంగా గొయ్యి
- నివారణకు గొయ్యిలో డ్రమ్ము ఏర్పాటు



ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

అద్దంకి, జూన్ 1 : ఆర్టీసీ బస్టాండ్ వద్ద గొయ్యి ప్రమాకరంగా ఉంది. అవుట్ గేట్ నుంచి బయటకు వచ్చే చోట సైడ్ డ్రైన్‌కు పెద్ద గొయ్యి పడింది. గతంలో ఉన్న గొయ్యిని మట్టితో పూడ్చగా మరలా సమీపంలో మరో పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు ప్రమాదపు అంచున ప్ర యా ణం చేస్తున్నారు. పెద్ద గొయ్యి కావడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో అన్న ఆందోళన నెలకొంది. దీంతో గొయ్యిలో డ్రమ్మును ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా తాత్కాలిక ఏర్పాటు చేశారు. మధ్యలో డ్రమ్ము ఏర్పాటు చేయడంతో ఆర్టీసీ బస్‌లు బయటకు రావడానికి ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టమాటా లారీ బోల్తా



జొన్నతాళి సెంటర్ సమీపంలో బోల్తాపడిన లారీ

మార్టూరు, జూన్ 1 : జాతీయ రహదారిపై గుంటూరు వైపు మండల పరిధిలో జొన్నతాళి సెంటరు సమీపంలో సూర్య దాబా ఎదురుగా టమాటా బాక్సులతో వెళుతున్న ఐషర్ లారీ బోల్తా పడిన సంఘటన శుక్రవారం అర్థరాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ క్షేమంగా ఉన్నాడు. అందిన సమాచారం మేరకు కర్నాటక రాష్ట్రం రాయచోటి నుంచి విజయవాడకు ఐషర్ లారీలో టమాటా బాక్సులను తీసుకువెళుతున్నారు. అయితే లారీ డ్రైవర్ 1వ నంబరు లైన్‌లో వెళ్తుండగా పక్కనే వెళుతున్న మరో వాహనం మీదకు దూసుకురాగా లారీని అదుపుచేయలేక డివైడర్ పైకి ఎక్కించడంతో రోడ్డుపై లారీ బోల్తాపడినట్లు డ్రైవర్ చెప్తున్నారు. దాంతో లారీలో ఉన్న టమాటా బాక్సులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ విషయంపై సమాచారం అందడంతో హైవే మొబైల్ వాహనం సంఘటనా స్థలానికి చేరి ట్రాఫిక్‌కు అవరోధం లేకుండా చేశారు. అదేవిధంగా విజయవాడకు చెందిన వారు టమాటా బాక్సులు కోసం ప్రత్యేకంగా మూడు వాహనాలలో వచ్చి రోడ్డుపై ఉన్న ట మాటా బాక్సులు వారి వాహనాలలో తీసుకువెళ్లారు. హైవే మొబైల్ పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

చీరాలపై ప్రత్యేక నిఘా



చీరాలటౌన్, జూన్ 1 : కౌంటింగ్ సమయంలో చీరాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఎలక్షన్ నేపథ్యంలో శనివారం చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మంగళవారం రెండు కెమెరాల పర్యవేక్షణలో చీరాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. గతంలో వివాదాలకు పాల్పడిన పలువురిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. కొంతమందిపై రౌడీషీట్‌లు నమోదు చేసినట్లు వివరించారు. ప్రశాంత కౌంటింగ్‌కు అన్ని పార్టీల ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్పీ వెంట డీఎస్పీ బేతపూడి ప్రసాద్, ఎస్బీ సీఐ మల్లికార్జునరావు, సీఐలు శేషగిరిరావు, సోమశేఖర్ తదితర స్టేషన్‌ల సిబ్బంది ఉన్నారు.

స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేయండి

ఇంకొల్లు, జూన్ 1 : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శాంతిభద్రతల దృష్ట్యా 3వ తేదీ సాయంత్రం, 4వ తేదీన పట్టణంలో అన్ని రకాల దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి సహకరించాలని ఎస్ఐ మల్లికార్జునరావు కోరారు. 4న మండలంలోని అన్ని గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా, అల్లర్లు చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

నేడు గుంటూరులో టీడీపీ ఏజెంట్లకు శిక్షణ

అద్దంకి, జూన్ 1 : పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ టీడీపీ ఏజెంట్‌లకు ఆదివారం ఉదయం 11 గంటలకు గుంటూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో శిక్షణ జరుగుతుందని, అద్దంకి నియోజకవర్గంలోని పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఏజెంట్‌లు హాజరు కావాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జోన్ 3 పరిధిలోని నర్సరావుపేట, గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం, బాపట్ల పార్లమెంట్ ప రిధిలోని పోస్టల్ బ్యాలెట్ టీడీపీ ఏజెంట్లకు శిక్షణ జరుగుతుందని తెలిపారు.

కూటమితోనే బీసీ వర్గాల అభివృద్ధి

ఇంకొల్లు, జూన్ 1 : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంతో బీసీ వర్గాలవారి అభివృద్ధితోపాటు వారికి అగ్రస్థానం కల్పిస్తుందని బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతనిధి గుంజి వెంకట్రావు అన్నారు. శనివారం ఇంకొల్లు మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు అధ్యక్షతన మార్టూరు పార్టీ కార్యాలయంలో సమావేశం జరిగింది. సమావేశంలో వెంకట్రావు మాట్లాడుతూ బీసీ వర్గాల ప్రజలు ఏలూరి సాంబశివరావుకు పూర్తి మద్దతు తెలిపారని రానున్న ఎన్నికల ఫలితాల్లో 25 వేల అత్యధిక మెజార్టీతో ఏలూరి సాంబశివరావు 3వ సారి గెలవనున్నారని ధీమా వ్యక్తం చేసారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కరి శ్రీనివాసరావు, బట్టు శ్రీనివాసరావు, తన్నీరు ఆంజనేయులు, వడ్లమూడి సాంబయ్య, గుంజి బాబు, రవి, వేణు, మోహనరావు, వెంకట్రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10న సోపిరాలలో మండల స్థాయి పోలురాధ ఎడ్ల పందేలు

ఇంకొల్లు, జూన్ 1 : మండలంలోని సోపిరాల గ్రామంలో వేంచేసి ఉన్న పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మండల స్థాయి నాటుబండి పోలురాధ ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో సోపిరాల గ్రామ పెద్దలు, ప్రజల సహాయ సహకారంతో ఎడ్ల పందేలు నిర్వహించనున్నట్లు గ్రామ టైరుబండ్ల యూనియన్ అధ్యక్షుడు తుమ్మల పెంట జయరావు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.20,116, రెండవ బహుమతి రూ.18,116, మూడవ బహుమతిగా రూ.15,116, నాల్గో బహుమతిగా రూ.12,116, ఐదో బహుమతిగా రూ.10,116 అందజేయనున్నట్లు తెలిపారు. బండిని ఆరుగురు మాత్రమే తోలాలని, బండి మీద బరువు క్వింటా మాత్రమే ఉంటుందని, తోకలు విరువరాదు, కర్రతో కొట్టరాదని, తుది నిర్ణయం కమిటీ సభ్యులదేనని తెలిపారు. పూర్తి వివరాలకు 9133377719, 73370790548, 7675011316 సెల్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. పోటీలను తిలకించడానికి వచ్చే చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలకు భోజన వసతి కల్పిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన కొండయ్య

సేవా కార్యక్రమాలు అభినందనీయం

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య

చీరాల, జూన్ 1 : పది మందికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు ఎవరు నిర్వహించినా వారు అభినందనీయులని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని ఈపురుపాలెంలో మర్చంట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రోహిణి కార్తె ఎండలు, వడగాలులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ సమయంలో దాహార్తిని తీర్చేందుకు, ఎండలకు సేదతీరేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొండయ్య అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దంకి వైభవానికి అద్దం 'అద్దంకి కథలు'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ మిత్ర మండలి సభ్యులు

అద్దంకిటౌన్, జూన్1 : నాటికీ నేటికీ విరాజిల్లుతున్న పట్టణం అద్దంకి అని, అద్దంకి వైభవానికి గుండె చప్పుడు అద్దంకి కథలు అని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం స్థానిక మారం వారి సేవా సదన్‌లో రచయిత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి రచించిన అద్దంకి కథలు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆర్‌వీ రాఘవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఈ పుస్తకం విశేషాలను సభలో వివరించారు. ఈ సందర్భంగా రచయిత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులను మిత్రమండలి సభ్యులు, తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీవీఎం సత్యనారాయణ, ఆర్‌వి రాఘవరావు, వెంకటేశ్వరరావు, రఘురామశర్మ, దివాకర్‌దత్తు, చంద్రశేఖర్, ప్రతాప్, వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య) పాల్గొన్నారు.

వైభవంగా బొబ్బేపల్లి తిరునాళ్ల



కల్యాణం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో శ్రీ సువర్చలా సహిత వీరాంజనేయస్వామి

మార్టూరు, జూన్ 1 : మండలపరిధిలో బొబ్బేపల్లి రాజుగారిపాలెం కొండపై శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం శ్రీసువర్చలాసహిత వీరాంజనేయస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీవీరాంజనేయస్వామి జయంతి ఉత్సవాలు సందర్భంగా 37వ తిరునాళ్లను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ శ్రీవీరాంజనేయస్వామి విగ్రహానికి తమలపాకులు, పూలు, వెండితొడుగులతో అందంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చినభక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారి కల్యాణానికి దంపతుల ఉత్సవ విగ్రహాలను భక్తులు పల్లకిలో ఊరేగిస్తూ మూలవిరాట్ చుట్టూ ప్రదక్షిణాలు చేయించి కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. కల్యాణానికి 20 మంది దంపతులపైగా పీటలపై కూర్చున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా కోలాటం ప్రదర్శించారు. తిరునాళ్లకు మార్టూరు, బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తుల తరలివచ్చారు. అదేవిధంగా మండలంలోని ద్రోణాదుల గ్రామంలో స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు భారీగా అన్నదానం చేశారు. కార్యక్రమానికి గ్రామస్థులు విశేషంగా తరలి వచ్చారు. మార్టూరులో చెన్నకేశవుని దేవస్థానంలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఉదయాన్నే భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఐనవోలు రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వలపర్ల గ్రామంలో హనుమ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం ప్రాంగణంలో శ్రీ ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్ర సాదాలను పంపిణీ చేశారు.

తిరుమలకు భజన మండళ్లు

ఉత్సవాల్లో పాలుపంచుకునేలా చేయడమే దాస సాహిత్య లక్ష్యం



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

అద్దంకి, జూన్ 1 : భజన మండళ్ల సభ్యులను పెద్ద సంఖ్యలో తిరుమలలో జరిగే ఉత్సవాలలో పాలుపంచుకునే విధంగా చేయడమే టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు లక్ష్యం అని టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి పగ డాల ఆనందతీర్థాచార్యులు అన్నారు. బాపట్ల, పల్నాడు జిల్లాలోని భజనమండళ్ళ సభ్యులకు శిక్షణ తరగతులు శనివారం శింగరకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆనంద తీర్థాచార్యులు మాట్లాడుతూ సభ్యులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలు మెరుగు పరచుకోవాలన్నారు. నేటి తరానికి, భవిష్యత్ తరాలకు జానపద కళల గురించి తెలియజేస్తూ హిందూ ధర్మ ప్రచారం చేయాలన్నారు. తమ భజన మండళ్లను రిజిస్టర్ చేసుకొని తిరుమలతో పాటు పలు ప్రాంతాలలో దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలలో పాల్గొనాలన్నారు. భజన మండళ్ల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భజన మండళ్ల సభ్యత్వం నమోదు చేసుకున్నారు. ఆదివారం ఉదయం ఒంగోలులోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రకాశం జిల్లా భజనమండళ్లకు శిక్షణ కార్య క్రమం జరుగుతుందని ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు తెలిపారు.

గ్రామాల్లో 144 సెక్షన్

బల్లికురవ, జూన్ 1 : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 4వ తేదీ మంగళవారం అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు సహకరించాలని ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దుకాణాలను మంగళవారం మూసి వేయాలన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఫలితాలు వచ్చాక ర్యాలీలు నిర్వహించినా, బాణసంచా కాల్చినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే పార్టీల నేతలపై బైండోవర్ కేసులు ఉన్నాయని, కౌంటింగ్ సందర్భంగా ఘర్షణలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చీరాలటౌన్, జూన్ 1 : పట్టాలు దాటుతూ రైలు ఢీకొన్న ఘటనలో గుర్తుతెలియని సుమారు 30 సంవత్సరములు కలిగిన వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన కారంచేడు రైలు గేటు సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

చీరాలటౌన్, జూన్ 1 : వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. అందిన వివరాల ప్రకారం శనివారం మధ్యాహ్నం చీరాల ఆర్వో బీ వంతెనపై ఒంగోలుకు చెందిన కేశవ్ ద్విచక్ర వాహనంపై పర్చూరు వైపు వెళుతూ ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో అతనికి రక్త గాయాలయ్యాయి. పేరాల మసీద్ సెంటర్‌లో కంభానికి చెందిన పవన్‌ను వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొవది. ప్రమాదంలో ఎడమ కాలుకు తీవ్రంగా రక్త గాయమైంది. దీంతో స్థానికులు క్షతగాత్రుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

అంతా బెట్టింగ్‌లే..!

- పట్టణం నుంచి గ్రామాల వరకూ నాయకులందరూ అదేదారి
- ఎవరిని కదిలించినా అదేమాట
- రాష్ట్రంలో అధికారం మొదలు .. అద్దంకిలో మెజార్టీ వరకు పందేలు
- ఎన్నికల ఫలితాల తరువాత ఓవర్గం మునగడం ఖాయం
- ఎవరు గెలిచినా... ఎవరు ఓడినా సగం మంది అప్పులపాలే



అద్దంకి, జూన్ 1 : బెట్టింగ్‌ల భూతం గ్రామీణ ప్రాంతాలకు కూడా పాకింది. దీంతో గెలుపు, ఓటములు పక్కన పెడితే కౌంటింగ్ తరువాత సగం మంది బెట్టింగ్‌రాయుళ్ల నిండా ముసుకు వేసుకోవడం ఖాయమే అని చెప్పవచ్చు. ఇప్పుడు ఏ ఒక్కరిని కదిలించినా బెట్టింగ్‌ల గురించే ఆరా తీయడం కనిపిస్తోంది. గతంలో కొద్ది మంది మాత్రమే ఎన్నికల బెట్టింగ్‌లు పెట్టే వాళ్లు. ప్రస్తుతం ఎన్నికలను గ్రామస్థాయిలో కూడా అటు కూటమి నేతలు, వైసీపీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఓటింగ్ చేయటం తో పాటు, అదే ఊపుతో బెట్టింగ్‌లకు కూడా దిగుతున్నారు. కౌంటింగ్ తేది దగ్గర పడే కొద్ది బెట్టింగ్ ల జోరు కూడా మరింత పెరుగుతుంది. ప్రధానంగా రాష్ట్రంలో అధికారం చేపట్టే పార్టీ, అద్దంకిలో టీడీపీ మెజార్టీ పై ఎక్కువ బెట్టింగ్ లు సాగుతున్నాయి. టీడీపీ మెజార్టీ 12 వేల నుంచి 15 వేల మధ్యననే ఎక్కువ బెట్టింగ్‌లు సాగుతున్నాయి. అదే సమయంలో అన్ని మండలాలలో టీడీపీ మెజార్టీపై బె ట్టింగ్‌లు సాగుతున్నట్లు తెలుస్తుంది. అద్దంకి నియోజకవర్గంలో గెలుపుపై మాత్రం అత్యల్పంగానే బెట్టింగ్ జరుగుతుండడంతో చూస్తుంటే వైసీపీ నేతలు అద్దంకి నియోజకవర్గంలో ఓటమిని పరోక్షంగా ఒప్పుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొద్దిమంది మా త్రం లక్షకు రెండు లక్షలు చొప్పున గెలుపుపై బెట్టింగ్ లు పెడుతున్నట్లు తెలుస్తుంది. గ్రామస్థాయి నేతలతో పాటు రైతులు కూడా బెట్టింగ్‌లలో ఉండడం చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది పంటలు సాగు చే యక ఖాళీగా ఉన్న రైతులు ఇప్పుడు బెట్టింగ్ లను ఎం చుకొని సంపాదించాలన్న ఆశతో దిగారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 4వ తేదీన కౌంటింగ్ ముగిసిన తరువాత బెట్టింగ్‌లు పెట్టిన వారిలో సగం మంది కచ్చితంగా తీవ్రంగా నష్టపోవడం ఖాయం. గత ఎన్నికలలో ప్రభుత్వంపై, అద్దంకి నియోజకవర్గంపై బె ట్టింగ్‌లు పెట్టి ఉండడంతో అక్కడ వైసీపీ, ఇక్కడ టీ డీపీ గెలవడంతో కొద్దిమంది మాత్రమే నష్టపోయారు. ఇప్పుడు వివిధ రకాలుగా బెట్టింగ్‌లు పెట్టి ఉండడంతో ఎవరు లాభ పొందుతారో, ఎంతమంది తీవ్రంగా నష్టపోతారో వేచి చూడాల్సి ఉంది. సొంత డబ్బులతో బె ట్టింగ్‌లు పెడుతున్న వారు తక్కువ కాగా, ఎక్కువ మంది వడ్డీలకు తెచ్చి మరీ బెట్టింగ్‌లు పెడుతుండడం తో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం గ్రామస్థాయిలో కూడా బెట్టింగ్ పెట్టడంతో కౌంటింగ్ తరువాత పలు కుటుంబాలు అప్పులపాలు కావడంతోపాటు, వ్యక్తిగత కక్షలు కూడా పెరిగే అవకాశం ఉంది. అదే సమయం లో గ్రామాలలో ఘర్షణలకు కూడా దారి తీసే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా ఫలితాల కోసం మంగళవారం వరకూ వేచిచూడాల్సిందే.



ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం	42.6	40.0	42.0	41.0	38.0
కనిష్ఠం	32.0	30.0	29.0	29.0	30.0

నమో వాయుపుత్ర!

● భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

జై శ్రీరామభహనుమాన్ మహారాజ్‌కీ జై.., జై హనుమాన్.. జైజై హనుమాన్.. నామస్మరణలతో శ్రీరామ, శ్రీకృష్ణ, ఆంజనేయ స్వామి మందిరాలు మారుమోగిపోయాయి. శనివారం హనుమజ్జయంతి సందర్భంగా జిల్లాలోని ఆలయాలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఉదయం పంచామృతాభిషేకాలు, హోమాలు, విశేష అలంకరణ పూజలు, లక్ష తమలపాకులతో సామూహిక పూజలు, లక్ష మల్లెల అర్చనలు, అన్నదానాలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవలతోపాటు పల్లకీ సేవలు కనుల పండువగా జరిగాయి. నెల్లూరులోని శబరి శ్రీరామక్షేత్రంలో ఉదయం అభిషేకాలు, అర్చనలు జరిగాయి. హోమం అనంతరం భక్తులతో సామూహిక లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. అనంతరం పూర్ణాహుతి హారతులు, అన్నదానం జరిగింది. సాయంత్రం పిల్లలకు వెండి ఆంజనేయుడి డాలర్‌తో కంకరణధారణ, గ్రామోత్సవం, పల్లకీసేవలు జరిగాయి.

- నెల్లూరు (సాంస్కృతికం)



నెల్లూరు : శబరి శ్రీరామక్షేత్రంలో లక్ష మల్లెల అర్చన



కార్యసిద్ధి ఆంజనేయస్వామికి లక్ష తమలపాకుల అర్చన



సంగం : విశేష అలంకరణలో వీరాంజనేయుడు

సింహ వాహనంపై కామాక్షితాయి కనువిందు

బుచ్చిరెడ్డిపాళెం : ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన డప్పుల చప్పుళ్లు.. వేదపండితుల మంత్రోచ్చరణ.. తరలివచ్చిన భక్తజనం నడుమ శనివారం రాత్రి కామాక్షితాయి సింహ వాహనంపై ఊరేగారు. జొన్నవాడలో అట్టహాసంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం తిరుచా ఉత్సవంలో స్వామిఅమ్మవార్లకు గ్రామోత్సవం జరిగింది. అనంతరం రాత్రి సింహ వాహనంపై కొలువుదీరిన అమ్మవారు భక్తులను కటాక్షిస్తూ ముందుకు కదిలారు. నిత్యాన్నదాన సదనంలో భక్తజనానికి భోజన వసతి కల్పించారు. కాగా, ఆదివారం రాత్రి హంస వాహనసేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో గిరికృష్ణ తెలిపారు.



సింహవాహనంపై ఊరేగుతున్న కామాక్షితాయి

పాతాళానికి భూగర్భ జలం

నెల్లూరు రూరల్, జూన్ 1 : జిల్లాలో భూగర్భ జలమట్టం ఆందోళనకరంగా మారింది. జిల్లా అంతట నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, మితిమీరిన ఎండలు ఇందుకు కారణంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గడిచిన మే నెలలో భూగర్భ జలమట్టం సరాసరిన 7.09 మీటర్ల లోతున ఉంది. ఏప్రిల్ లో 6.5 మీటర్లుగా నమోదైంది. నెల వ్యవధిలోనే దాదాపుగా మీటరు మట్టం తగ్గిపోయింది. గతేడాది మే నెలలో 5.37 మీటర్లుగా మట్టం లెక్కగట్టారు. అదికాస్త నవంబరుకు 6.92 మీటర్లుగా నమోదైంది. తగ్గుతూ వస్తున్న భూగర్భ జలమట్టంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం చేస్తుండగా రుతుపవనాల రాకతో ప్రజలంతా వరుణుడిపైనే ఆశలు పెట్టుకున్నారు. కాగ గాలిలో తేమ శాతం మరింత ఆందోళనకరంగా మారింది. శనివారం సాయంత్రం 5 గంటలకు గణాంక శాఖ అందించిన వివరాలు మేరకు గరిష్ఠంగా ముత్తుకూరులో 75.9 శాతం ఉండగా కనిష్ఠంగా ఏఎస్ పేటలో 52.5 శాతం నమోదైనట్లు లెక్కగట్టారు. కాగ గాలిలో ప్రయాణ వేగం గణనీయంగా తగ్గి ఉదయగిరిలో 3 మీటర్ల ఎత్తులో 13.6, 10 మీటర్ల ఎత్తులో 15.27 కి.మీ వేగం గరిష్ఠంగా నమోదవగా కనిష్ఠంగా ఉలవపాడులో 3.10 మీటర్ల ఎత్తులో 3 కి.మీ వేగం నమోదైంది. దీనివల్ల ఊపిరాడని పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

లోకల్ మార్కెట్ ముంచేసింది!

ఈసారి బయట నుంచి ఎక్స్‌పోర్టు వ్యాపారులు ఉలవపాడు మామిడి కొనుగోలుకు సుముఖంగా లేనందున ధర పడిపోయింది. నా సొంతంగా 50 ఎకరాలు కౌలుకు తీసుకున్నా, భాగస్వాములతో కలిసి మరో 150 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. కాపు తక్కువైనా బయట వ్యాపారులు వస్తే గిరాకీ పెరిగి మంచి ధర వస్తుందని అనుకున్నారు. కానీ లోకల్ మార్కెట్‌తో ధరలు లేక నష్టపోవాల్సి వచ్చింది.

- పందిళ్ల ప్రసాద్, మామిడి కౌలు రైతు, మన్నేటికోట గ్రామం

మా మామిడి వైపు చూసేవారేరీ!?

మూడేళ్లుగా కౌలుకు తీసుకొని మామిడి సాగు చేస్తున్నా. ప్రతిసారీ నష్టాలే వస్తున్నాయి. ఈ ఏడాది కాపు తక్కువ కావడంతో డిమాండ్ పెరిగి చివరి దశలో టన్ను అధిక రేటు పలుకుతుందనుకున్నా. వాతావరణం తేడాగా ఉండటంతో పక్వానికి వచ్చిన కాపు వచ్చినట్లే లోకల్ వ్యాపారులకు అమ్మాల్సిన పరిస్థితి. బయటి వ్యాపారులు ఉలవపాడు మామాడి వైపు కన్నెత్తి చూడకపోవడమే ఇందుకు కారణం.

- అమ్మనబ్రోలు రమేష్, మామిడి కౌలు రైతు, కొల్లూరుపాడు

బయటివ్యాపారులే రాలేదు!

ఏటా బయట నుంచి ఎక్స్‌పోర్టు వ్యాపారులు వచ్చి చుట్టు పక్కల మండలాల మామిడి తోటల్లో కాపు చూపించి కొనుగోలు చేయించినందుకు బ్రోకరైజ్ వచ్చేది. కానీ, ఇప్పుడు గుంటూరు, విజయవాడ, ఇనమలమెళ్లూరు, ఒంగోలుకు చెందిన లోకల్ వ్యాపారులు మాతో పనిలేకుండానే నేరుగా రైతుతో మాట్లాడుకొని కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది సంపాదన కష్టమైందనే చెప్పాలి.

- సయ్యద్ దాదావలి, దళారి, ఉలవపాడు



ఫలరాజును కొనేవారేరి!?

- ముఖంచాటేసిన ఎగుమతి వ్యాపారులు
- ఈ ఏడాది రాష్ట్రం దాటని మామిడి
- స్థానికంగా పెరగని ధరలు
- నష్టాల ఊబిలో లీజుదారులు

ఉలవపాడు, జూన్ 1 : మే నెల మధ్య నాటికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మామిడి ఎగుమతి వ్యాపారులు, దళారులు, రైతులతో ఉలవపాడులో హడావుడి ఉండేది. దళారులు కూడా వ్యాపారుల వెంటే ఉండి వారికి అవసరమైన సరుకును చూపించి పర్సంటేజీ ద్వారా రూ.లక్షలు సంపాదించే వారు. కాపును జాగ్రత్తగా సంరక్షిస్తూ వచ్చిన మామిడి రైతులకు బయట వ్యాపారులు వచ్చారంటే అదొక మనోధైర్యం. అయితే, ఈ ఏడాది మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. వాతావరణంలో ఏర్పడిన పరిస్థితుల కారణంగా సకాలంలో పూతలు వేయలేదు. అదును తప్పి వేసిన పూతకు పిందెలు నిలబడలేదు. వచ్చిన అరకొర దిగుబడికి కూడా ధర లేకపోవడంతో సాగుదారులు దిగాలు చెందుతున్నారు. బయటి వ్యాపారుల రాకతో ఫలాల రేటు పెరుగుతుందని ఆశలు పెట్టుకున్నా అడియాసే అయ్యింది. ప్రతి ఏడాది మే నెల వచ్చే సరికి ఉలవపాడు దాని చుట్టు పక్కల మండలాల నుంచి మామిడి కాపు పక్వానికి వచ్చి ఎగుమతికి అందుబాటులోకి వస్తుంది. హైదరాబాద్, సూర్యాపేట, చెన్నై, విజయవాడ, గుంటూరు, నెల్లూరు నుంచి వ్యాపారులు వచ్చి మామిడి సీజన్ అయ్యే వరకు ఉలవపాడులోనే మకాం వేస్తారు. ఉలవపాడు కేంద్రంగా గుడ్లూరు, సింగరాయకొండ, కావలి, వింజమూరు ప్రాంతాల నుంచి మామిడి కొను గోలు చేసి వందల టన్నులు ఆయా ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. అలాంటిది ఈ ఏడాది బయట వ్యాపారులు ముఖం చాటేశారు. స్థానిక పరిస్థితులను బట్టి నాణ్యమైన కాయలు టన్ను రూ.50 వేల నుంచి 55 వేలు వరకు పలకగా, ఒక రకమైన కాయలు టన్ను రూ.40 వేలు మాత్రమే అమ్ముడు పోతోంది. అదే ఎగుమతులు జోరుగా జరిగి ఉంటే ఈపాటికి టన్ను రూ.60 వేల నుంచి 70 వేల వరకు పలుకుతుండేది.

● **కోత పనులు కరువైన వైనం**

మామిడి ఎగుమతులు జోరందుకున్న వేళ కోత కూలీలకు రెండు నెలల పాటు ఉపాధి లభించేది. చెట్లకు ఉన్న కాయల నాణ్యత దెబ్బతినకుండా కోయడంలో నేర్పరితనంతో కూలి రేట్లు కూడా బాగానే ఉండేది. రాసి పోసిన కాయలను గ్రేడింగ్ చేసే పని, బాక్సులకు పేర్చు పని, లారీలకు లోడ్ చేసే పని ఇన్ని రకాలుగా ఉపాధి పొందే కూలీలకు ఈ ఏడాది కరువునే మిగిల్చింది. ఉలవపాడు హైవేపై మూడు లారీ కాటాలు ఉన్నాయి. 24 గంటలు విద్యుత్ దీపాల వెలుతురులో వాహనాలకు లోడు, అన్‌లోడు చేస్తూ తీరిక లేకుండా ఉండేది. అలాంటిది ఇప్పుడు ఆ కాటాలన్నీ బోసిపోయి ఉన్నాయి.



మన్నేటికోట అడ్డరోడ్డు లారీ కాటా వద్ద హడావిడి కనిపించని మామిడి గ్రేడింగ్

● **స్థానిక మార్కెట్టే దిక్కు**

ఈసారి సాగుదారులకు స్థానికంగా ఉంటున్న చిరు వ్యాపారులే దిక్కు అయ్యారు. బాపట్ల, వేటపాలెం, చీరాల, చినగంజాం, ఒంగోలు నుంచి ఉదయం రైలులో ఉలవపాడుకు వచ్చి మార్కెట్‌లో కొనుగోలు చేసిన మామిడిని ట్రేలలో సాయంత్రం తిరుగు ప్రయాణంలో రైలులో వెళ్తుంటారు. ఈ ఏడాది ఇప్పటికే 80 శాతం మామిడి స్థానిక మార్కెట్, హైవేపై అంగళ్ల ద్వారా వ్యాపారం జరిగింది. మరో రెండు వారాలు మాత్రమే మామిడి దిగుమతి ఉంటుంది.

'హౌసింగ్'పై నిఘా

తిలాపాపం తలాపిడికెడు అన్న విధంగా పేదల సొమ్మును వైసీపీ నేతలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు బొక్కేశారు. జగనన్న కాలనీల మాటున జరిగిన ఈ భారీ అవినీతి వెలుగులోకి వస్తోంది. ప్రభుత్వంలోని పెద్దలు, ఉన్నతాధికారులు కూడా ఈ అవినీతిలో భాగస్వామ్యం ఉండడంతో ఎవరి వారు పట్టీపట్టనట్టు వ్యవహరించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ నుంచి పైస్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరి పాత్ర ఉన్నట్లు ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో జాయింట్ కలెక్టర్ ఈ కుంభకోణంపై విచారణ జరిపి వాస్తవాలను ప్రభుత్వానికి పంపినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఈ క్రమంలో జిల్లాలోని హౌసింగ్ అధికారుల అవినీతిపై కొందరు ఏసీబీ, విజిలెన్స్‌కు ఫిర్యాదులు చేశారు. ముగ్గురు అధికారులు, ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగి పేర్లను ప్రస్తావిస్తూ, వారు చేసిన వ్యవహారాలను కూడా ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో దర్యాప్తు సంస్థలు బొక్కిన వారి గుట్టు రట్టు చేసేందుకు రంగంలో దిగాయి.

- కాలనీల పేరుతో భారీ అవినీతి
- ఇళ్ల నిర్మాణాలకు లెక్కాపక్కాలేని వైనం
- మొదటి నుంచీ పట్టించుకోని ప్రభుత్వం
- ముగ్గురు అధికారులపై ఏసీబీ, విజిలెన్స్‌కు ఫిర్యాదులు
- ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగే బ్రోకర్..!
- నిగ్గు తేల్చేందుకు రంగంలోకి దిగిన నిఘా సంస్థలు



వెంకటేశ్వరపురం లేఅవుట్‌లో నాసిరకంగా నిర్మించిన ఇళ్లు

నెల్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు 97,121 ఇళ్లు మంజూరవగా ఇప్పటివరకూ 22 వేల ఇళ్లను మాత్రమే పూర్తి చేశారు. అందులో సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి సంఖ్యనే 12 వేలకు పైగా ఉంది. ఈ ఇళ్లలోనూ మూడొంతులు నిర్మించకుండానే పాత ఇళ్లను చూపించి బిల్లులు తినేశారు. ఇందుకు సంబంధించిన అనేక ఆధారాలు గతంలోని వెలుగులోకి వచ్చాయి. ఒక ఇంటి నిర్మాణం మొదలై బిల్లులు మంజూరు కావాలంటే అందుకు పలు దశలున్నాయి. బేస్‌లెవల్, లింటెల్ లెవల్, రూఫ్‌కాస్ట్‌లెవల్, కంప్లీట్.. ఇలా ప్రతి దశలోనూ అధికారులు పరిశీలించి ఎంబుక్ రికార్డు చేసిన తర్వాతనే లబ్ధిదారుడి ఖాతాల్లో బిల్లులు జమవుతాయి. ప్రతి సందర్భంలోనూ ఇంటి స్థలంలో జియో ట్యాగింగ్ చేస్తూ ఇంటి ఫొటోను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ స్థలంలో కాకుండా మరో స్థలంలో నుంచి జియోట్యాగింగ్ చేస్తే అక్షాంశాలు, రేఖాంశాలు సరిపోలవు. దీనిని వెబ్‌సైట్ తిరస్కరిస్తుంది. కాబట్టి కచ్చితంగా లబ్ధిదారుడి స్థలంలోని ఇంటినే ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ కారణంగానే చాలా ఇళ్లకు బేస్ లెవల్ సందర్భంలోనూ పూర్తయిన ఇంటి ఫొటోనే, లింటెల్ లెవల్‌లోనూ పూర్తయిన ఇంటి ఫొటోనే, రూఫ్‌కాస్ట్ లెవల్‌లోనూ అదే ఫొటోను అప్‌లోడ్ చేశారు. ఇక్కడ అక్రమార్కుల బండారం బయటపడింది. ఈ నిర్మాణాలను ఏఈలు నేరుగా పరిశీలించాలి. డీఈలు కనీసం 30 శాతం, ఈఈలు పది శాతం ఇళ్లను తనిఖీ చేయాలి. కానీ వారు ఈ అక్రమాలను పట్టించుకోలేదు. వారికి కూడా భాగం ఉండబట్టే చూసీచూడనట్లు వదిలేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఇంటి గోడల మధ్య తేలిపోతున్న రాళ్లు

● **అంతా ఆ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగే!**

గృహ నిర్మాణ శాఖ జిల్లా కార్యాలయంలో ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగే జిల్లాలో జరిగిన కుంభకోణంలో ప్రధాన సూత్రధారి అని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఈ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిపై మొదటి నుంచీ ఆరోపణలు వస్తున్నా అధికారులెవరూ పట్టించుకోలేదు. కాంట్రాక్టర్లకు, అధికారులకు మధ్యవర్తిగా వ్యవహరిస్తూ పేదల సొమ్మును దిగమింగినట్లు ఫిర్యాదుల్లో ఆరోపించారు. అనంతసాగరానికి చెందిన ఓ అనుభవం లేని వ్యక్తికి రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 70 వేలకు పైగా ఇళ్లను అప్పగించారు. దీని వెనుక కూడా ఆ ఉద్యోగిపై నుంచి కింది వరకు రాయబారాలు నడిపినట్లు చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం హౌసింగ్ కార్యాలయంలో పనిచేస్తూనే సదరు కాంట్రాక్టర్ వద్ద కూడా ఆ ఉద్యోగి పనిచేస్తున్నట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. మూడేళ్లలో ఆ ఉద్యోగికి రూ.కోట్లకు పడగలెత్తారని చెప్పుకుంటున్నారు. ఈ ఉద్యోగిని విచారించి కూపీ లాగితే అసలు వాస్తవాలన్నీ బయటకు వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● **ఆ ముగ్గురిపై ఫిర్యాదులు**

జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లను దగ్గర చేరి పరిశీలిస్తే అవినీతి ఏ స్థాయిలో జరిగిందో ఇట్టే అర్థమవుతుంది. గోడలను చేతితో నెమిరితేనే ప్లాస్టింగ్ రాలిపోతోంది. ఇళ్లు పూర్తయినట్లుగా బయటకు రంగులు వేసి బిల్లులు తినేశారు. కానీ లోపల మాత్రం కనీసం దళం కూడా వేయలేదు. అసలు ఆప్షన్-3 కింద ఎంత మంది లబ్ధిదారులు ఆమోదం తెలిపారు? ఇప్పటి వరకూ ఎవరెవరికి ఇళ్లు నిర్మించి ఇచ్చారు? వాటిల్లో ఎంత మంది కాపురాలు ఉంటున్నారు? అన్న వివరాలేవీ అధికారుల వద్ద లేవు. ఆప్షన్-3 కింద ఇళ్ల నిర్మాణాలను అధికారులే కాంట్రాక్టర్లకు అప్పగించి ఇప్పుడు తమకు సంబంధం లేదని మాట్లాడుతున్నారు. ఆ కాంట్రాక్టర్లు తీసుకున్న మెటీరియల్, బిల్లులకు నిర్మించిన ఇళ్లకు పొంతన కుదరడం లేదు. ఇదే అదునుగా హౌసింగ్‌లో పనిచేస్తున్న సిబ్బంది కూడా సిమెంటు, స్టీలు అమ్మేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సంగంలో ఇది బయటపడింది కూడా. హౌసింగ్ విభాగంలో పనిచేస్తున్న ఓ ముగ్గురు అధికారుల తీరు మొదటి నుంచీ వివాదాస్పదంగా ఉంది. ఓ బాధ్యత కలిగిన అధికారి అన్నీ తెలిసినా తన వాటా తీసుకొని మిన్నకుండిపోతున్నారని ఏసీబీ, విజిలెన్స్‌కు అందిన ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. అలానే డీఈ కోవూరు మండలం పడుగుపాడు వద్ద మూడంతస్థుల ఇంటిని, మరో ఏఈ హరనాథపురంలో ఐదంతస్తుల ఇంటిని పేదల ఇళ్ల సిమెంటు, స్టీలు, ఇసుకతో నిర్మించారని ఫిర్యాదులో ఆరోపించారు. ఒక్కో అధికారి గడిచిన మూడేళ్లలో రూ.కోట్లు సంపాదించారని, వీరిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని అందులో కోరారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



కొండాపురం : భీమవరప్పాడులో ఆంజనేయుడికి పూజలు



కలిగిరి, కందుకూరుల్లో ప్రత్యేక అలంకరణంలో పవన సుతుడు



కావలిటౌన్ : హనుమత్ క్షేత్రంలో సామూహిక లక్ష సింధూర అర్చన చేస్తున్న భక్తులు



వలేటివారిపాలెం : ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు

కావలిటౌన్, జూన్1: పట్టణ పరిధిలోని రామాలయాలు, అంజనేయస్వామి ఆలయాలకు శనివారం హనుమత్ జయంతి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని పూజలు నిర్వహించారు. ముసునూరు హనుమత్‌క్షేత్రంలో ఆలయ వ్యవస్థాపక ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు పర్యవేక్షణలో వారంపాటు హనుమత్ జయంతి ఉత్సవాలు జరిగాయి. శనివారం ఉదయం 108 కలశాల స్థాపన, శాంతి అభిషేకాలు, హోమం పూజలు జరిగాయి. 11గంటలకు సామూహిక లక్ష సింధూర అర్చన పూజలు జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాదం అందచేశారు. దక్షిణంపేట రామాలయంలో జరిగిన పూజల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు. జనతాపేట ఆంజనేయ స్వామి ఆలయంలో కూడా ఉత్సవాలు జరిగాయి. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్‌ల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ జరిగింది. మద్దూరుపాడులోని అంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి ట్రంకురోడ్డు మీదుగా ముసునూరులోని హనుమత్ క్షేత్రం వరకు సాగిన శోభాయాత్రలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. యాత్ర ముగింపు సభలో ప్రధాన వక్తగా పాల్గొన్న అన్నదాత మణి (ప్రాసమణి) తనదైన శైలిలో ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

కావలి రూరల్ : మండలంలోని కొత్తపల్లి, సిరిపురం, చౌదరిపాలెం, గౌరవరం గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలను, రామాలయాలను శనివారం హనుమజ్జయంతి సందర్భంగా విద్యుత్ దీపాలు, పచ్చతోరణాలతో అలంకరించి, స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించా రు.

అల్లూరు : మండలంలోని అన్ని ఆలయాల్లో శనివారం హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అల్లూరులోని వేణుగోపాలస్వామి ఆలయం, మారుతీ ఆశ్రమంతో పాటు, నార్తుమోపూరులోని రామమందిరంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని ఆలయాల్లో అన్నదా నం నిర్వహించారు.

బిట్రగుంట, (దగదర్తి) : దగదర్తి మండలం కాట్రాయపాడులోని హనుమాన్ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజాభిషేకాలు జరిగాయి. అంజనీపుత్రుడి సేవా కార్యక్రమంలో టీడీపీ నేత మాలేపాటి సుబ్బానాయుడు పాల్గొన్ని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్ళూరి సుధాకర్, కంచర్ల దయాకర్, టీ.మోహన్‌రావు, కే.సుధాకర్, విష్ణు, సురేంద్ర, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బోగోలు కుమ్మరవీధిలోని చెన్నకేశవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ మాజీ ఛైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, విశ్రాంత ఇంజనీరు గోపికృష్ణ, అమరా ట్రస్ట్ సభ్యులు ఆనందసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : హనుమజ్జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని రెవెన్యూ కాలనీలో ఉన్న కోదండరామాలయం ఆవరణలోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద, కనిగిరి రోడ్డు అయ్యప్పస్వామి ఆలయం వద్దగల ఆంజనేయ స్వామి ఆలయంలోను, కోవూరు రోడ్డులోని దక్షిణాముఖ ఆంజనేయ స్వామి ఆలయం, జనార్దనస్వామి ఆలయంలోని ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. విఘ్నేశ్వర, వైనతేయ హనుమత్ ఆలయంలో ఉన్న స్వామివార్లకు పంచామృత అభిషేకం, విశేష అలంకారం, వడమాల ధారణతో తమలపాకులతో అర్చన చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు హనుమత్ చాలీషా పారాయణం చేయగా తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కలిగిరి : మండలంలోని కలిగిరి, కమ్మవారిపాలెం, జిల్లావారిపాలెం తిప్పగ్రామాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఆలయాల వద్ద స్వామివారికి జరిగిన అభిషేకాలు, ఆకుపూజ, కుంకుమపూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం కందుకూరు ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు దర్శించుకున్నారు. నాగేశ్వరరావుకు గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాలువాతో సత్కరించారు. అనంతరం హనుమజ్జయంతి సందర్భగా వలేటివారిపాలెం, పోలినేనిపాలెం గ్రామాల్లోని ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, వలేటి మధుసూదన్‌రావు, కాకుమాను అంజనేయులు, కాకుమాను హర్ష, పరిటాల భాస్కర్‌రావు, వలేటి నరసింహం, గుత్తా కొండయ్య, తదితరులు ఉన్నారు. కాగా హనుమజ్జయంతి సందర్భంగా శనివారం స్థానిక దక్షిణముఖ ప్రసన్నాంజనేయస్వామి జయంత్యుత్సవాలు వైభవంగా జరిగాయి. గ్రామస్థులు స్వామివారి ఆలయాన్ని సింధూరం తో అలంకరించారు. రకరకాల విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. స్వామి వారిని గజమాలతో అలంకరించారు. గ్రామస్థులతోపాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పొంగళ్లు పెట్టుకొని, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.. భక్తులకు దాతలు అన్నదానం చేశారు.

కొండాపురం : హనుమజ్జయంతి సందర్భంగా శనివారం మండల పరిధిలోని భీమవరప్పాడు, మర్రిగుంట తదితర గ్రామాల్లోని ఆంజనేయుడి విగ్రహాలవద్ద భక్తులు విశేష పూజలు చేశారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ సందర్భంగా అన్నసంతర్పణ చేపట్టారు. అలాగే తూర్పుపాలెంలోని కోదండరామాలయంలో శనివారం సీతారాములకు ఘనంగా కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు. ఈసందర్భంగా ఉభయకర్తలు భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

ఆత్మకూరు : ఆత్మకూరు సమీపంలోని హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయస్వామి ఆలయంలో ఈ హనుమజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున 5గంటలకు పంచామృతాభిషేకం, సహస్రనామపూర్వక ఆకుపూజ, హనుమాన్ చాలీసా పారాయ ణంను నిర్వహించారు. అనంతరం స్వామి కల్యాణం చేపట్టారు. ఉభయ కర్తలుగా సుధాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని పంటవీధిలోని రామాలయం, ఆర్యవైశ్య కోదండరామస్వామి దేవస్థానంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సుందరమ్మ ఆలయ ఆవరణలో వెలసిన కోదండరామాంజనేయస్వామికి చందనాలంకారం, లక్షపత్ర సామూహిక ఆకుపూజను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. కరటంపాడు, దేపూరు, వాసిలి గ్రామాల్లోని ఆలయాల్లో వేడుకలను జరిగాయి.

చేజర్ల: మండలలోని నాగులవెల్లటూరులో జరిగిన వేడుకల్లో టీడీపీ నాయకులు వేలూరు కేశవచౌదరి, చేజర్ల పీఏసీఎస్ అధ్యక్షులు వీరరాఘవరెడ్డి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

సంగం: మండలంలోని జండాలదొరువు కొండమీద వెలసిన అభయాంజనేయస్వామికి అభిషేకాలు, హోమం నిర్వహించారు. సంగంలోని వీరాంజనేయస్వామికి పూలంగి సేవ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం దువ్వూరులో భక్తులు హనుమాన్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ కోటేశ్వరస్వామి ఆలయం నుంచి ముంబాయి జాతీయ రహదారి దువ్వూరు క్రాస్ రోడ్డు వద్ద నున్న ఆంజనేయస్వామి విగ్రహం వరకు నిర్వహించారు.

అనంతసాగరం: ఉప్పలపాడు, సోమశిల, అగ్రహారం, రేవూరు, అనంతసాగరం గ్రామాల్లోని కోదండరామస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతేక పూజలు, అన్నదానం చేశారు.

ఉదయగిరి: పట్టణశివారు ప్రాంతం దుర్గంపల్లికి వెళ్లే మార్గంలో హనుమాన్‌నాలా, కుర్రపల్లి కాశినాయనగడ్డ వద్ద వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాయాకర్పూరం అందజేసి హోమాలు నిర్వహించారు. హనుమాన్‌నాలా వద్ద బ్రహ్మారెడ్డి భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు, అరటిపండ్లు పంపిణీ చేశారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), వెంకటంపేట రోడ్డుపై వెలసిన వీరాంజనేయస్వామి ఉత్సవాల్లో వేదపండితులు స్వామికి అభిషేకం, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి వదిలారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదానంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సీతారామపురం : మండలకేంద్రంతో పాటు ఓగూరువారిపల్లి, దేవిశెట్టిపల్లిలో హనుమాన్ జయంతిని నిర్వహించారు. ఓగూరువారిపల్లిలో అభయ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో వీరాంజనేయులు ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు అభిషేకం, ప్రత్యేకపూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు.

వింజమూరు: పట్టణంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాల్లో స్వామివారికి ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించి పట్టణంలో ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



ఆత్మకూరు : ఆంజనేయస్వామి సమేత సువర్చలాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



సంగం : జంగాలదొరువులో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు



ఉదయగిరి రూరల్ : వెంకటంపేటలో ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయ స్వామి, ఉదయగిరిలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



బిట్రగుంట : పూజలు నిర్వహిస్తున్న మాలేపాటి సుబ్బానాయుడు

నిత్యం కోతలు.. ప్రజలకు వెతలు

● ఉక్కపోతకు గురవుతున్న జనం

చేజర్ల, జూన్ 1: మండలంలో కొన్నిరోజులుగా అప్రకటిత విద్యుత్ కోత లతో ప్రజలు అల్లాడుతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో..ఎప్పుడు పోతుందో తెలియక సతమతం అవుతున్నారు. అసలే ఎండ వేడిమి తట్టుకోలేక ఇంట్లో ఫ్యాన్లు, కూలర్ల వద్ద సేదతీరుదాం అంటే విద్యుత్ కోతలతో ఉక్కపోతకు గురవుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అస్వస్థతకు గురవు తున్నారు. బోడిపాడు, టి.కే.పాడు, తూర్పుప ల్లి, ఆదురుపల్లి గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఇటీవల కురిసిన గాలివానలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. తిరిగి విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు గంటల సమయం పడుతోంది. రాత్రుళ్లు అయితే కరెంటు ఎప్పుడు వస్తుందో చెప్పలేని పరిస్థితి.



బోడిపాడు సమీపంలోని సబ్‌స్టేషన్

రెండేళ్లుగా ఇన్‌చార్జ్ ఏఈనే దిక్కు..

చేజర్ల మండలానికి రెండేళ్లుగా ఇన్‌చార్జ్ ఏఈనే కొనసాగుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఏఈ పొదలకూరుకు బదిలీ కాగా ఆ ఏఈనే కొన్నిరోజులు ఇన్‌చార్జ్‌గా కొనసాగారు. అయితే ప్రస్తుతం చేజర్ల మండ లాన్ని ఆత్మకూరు విద్యుత్ డివిజన్‌కు కేటాయించడంతో ప్రస్తుతం ఆత్మకూరు ఏఈ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారి ఇక్కడ లేకపో వడంతో కొంతమంది సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహ రిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

సీతారామపురం, జూన్ 1: స్థానిక మండల కార్యాలయంలో ఎంపీపీ చింతరెడ్డి పద్మావతి అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా సాగింది. గతంలో జరిగిన పనులపై సమీక్ష నిర్వహించారు. మండలంలో జరగబోయే ఉపాధిహామీ పనులు, నీటి సౌకర్యం, డ్రైనేజీ, వీధిదీపాలు ఏర్పాటుపై ముక్కుబడిగా చర్యలు జరిపారు. ప్రజాప్ర తినిధులు సమావేశంపై ఆసక్తి చూపించ లేదు.

మహిళ ఎంపీటీసీపై చిన్నచూపు..

సమావేశం అనంతరం సీతారామపురం-2 ఎంపీటీసీ తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై, ఎలక్షన్ విధుల్లో ప్రభుత్వ ఉద్యోగుల పక్షపాత ధోరణిపై మాట్లాడటానికి కనీసం మైకు కూడా కేటాయించకుండా చిన్నచూపు చూశారని వాపోయారు. అధికార పార్టీకి అనుకూలంగా రేషన్ డీలర్లు, అంగన్వాడీ సిబ్బంది ఎన్నికల ప్రచారంలో సాక్షాధారాలతో దొరికినా ఎంపీడీవో చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. మహిళ ఎంపీపీగా ఉండి ఒక మహిళ ఎంపీటీసీగా తాను మాట్లాడుతున్నప్పుడు కనీసం మైకు కూడా ఇవ్వకుండా మిగిలిన ఎంపీటీసీలకు మాట్లాడేందుకు మైక్ సౌకర్యం కల్పించడం ఎంతవరకు సమంజమన్నారు.



అనంతసాగరం : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంపూర్ణమ్మ

మొక్కుబడిగా సమావేశం

అనంతసాగరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సమావేశం మొక్కుబడిగా సాగింది. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు కొంతమంది మాత్రమే హాజరుగా మౌలిక వసతలు, ఉపాధిపనులు, తాగునీటి ఎద్దడి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, ఎంపీడీవో తాజ్‌మస్రూర్ పాల్గొన్నారు.

వైభవంగా అశ్వవాహనసేవ

సంగం, జూన్ 1: తరుణవాయి చెన్నకేశవస్వామి అశ్వవాహనసేవ శుక్రవారం అర్ధరాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అశ్వావాహనంపై ఉంచి గజమాలలతో అలంకరించి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

విధుల్లో చేరిన ఎంఈవో

అనంతసాగరం, జూన్ 1: మండల ఎంఈవో-1గా సంగం విద్యాధికారి జానకిరాం శనివారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఎంఈవో బాలకృష్ణారెడ్డి పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో వచ్చారు.

డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు

అనంతసాగరం, జూన్ 1: పదోతరగతి, తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు 2024-25 విద్యా సంవత్సరం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరు వారు అందించే డిప్లోమా కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సోమశిల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల పిన్సిపాల్ పల్లంరాజు శనివారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈ నెల 20వరకు ఉందన్నారు.

శ్రీవారి సేవలో కాకర్ల సురేష్



శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపల టీడీపీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే అభ్యర్థులు

వింజమూరు, జూన్ 1: తిరుపతి వెంకటేశ్వరస్వామిని శనివారం ఉదయగిరి నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ దర్శించుకున్నారు. బ్రేక్ దర్శనంలో ఆయనతో పాటు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, గూడూరు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్, ఎమ్మెల్సీ బీ.రాంభూపాల్ రెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు.

కౌంటింగ్‌పై ఏజెంట్లకు అవగాహన

ఉదయగిరి రూరల్, జూన్ 1: ఈ నెల 4న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌పై స్థానిక తహసీల్దారు కార్యాలయంలో కౌంటింగ్, ఎన్నికలు, అభ్యర్థుల ఏజెంట్లకు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్, ఏఆర్వో నెహ్రూబాబు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేటాయించిన టేబుల్ వద్దే ఏజంట్ ఉండాలన్నారు. కౌంటింగ్ పూర్తయి ఫలితాలు వచ్చేంతవరకు ఏజెంట్లు బయటకు పంపకూడదన్నారు. మద్యం సేవించి కౌంటింగ్ కేంద్రంలోకి రాకూడదన్నారు. ఎన్నికల కమిషన్ నిర్ణయం మేరకు పోస్టల్ బ్యాలెట్ల ఓట్లను లెక్కించడం జరుగుతుందన్నారు. 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. అనంతరం ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ల ఓట్లను ఎలా కౌంటింగ్ చేస్తారో వివరించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమనిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కావలి డీఎస్పీ వెంకటరమణ, ఉదయగిరి, కలిగిరి ఎస్‌ఐలు వేల్పుల గిరిబాబు, ఫిరోజ్, ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, మాస్టర్ ట్రైనర్ సమీవుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే క్రిమినల్ కేసులు

ఉదయగిరి రూరల్, జూన్ 1: ఈ నెల 4వ తేదీన ఎన్నికల ఫలితాల సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిలు హెచ్చరించారు. శనివారం ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ పికెటింగ్‌ను పర్యవేక్షించి మాట్లాడారు. కౌంటింగ్ సందర్భంగా పోలీస్‌యాక్ట్, 144సెక్షన్, ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్నారు. జీ.చెరువుపల్లి, గంగిరెడ్డిపల్లి, బండగానిపల్లిలతో పాటు వైసీపీ, టీడీపీ కార్యాలయాలు, ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్ వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. సీఐ, ఎస్‌ఐల మొబైల్ టీంలు ఏర్పాటు ఉంటాయన్నారు. ఉదయగిరి పట్టణంలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో శాంతిభద్రతల పరిరక్షిస్తామన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 12,44,761

వలేటివారిపాలెం, జూన్ 1 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 12,44,761 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ కే.బీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 7,500, కుంకుమార్చన ద్వారా రూ. 26,040, వివాహాల ద్వారా రూ 1000, తలనీలాల ద్వారా రూ. 71,825, వాహనపూజల ద్వారా రూ. 4,120, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 3,43,100, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 520, రూముఅద్దెల ద్వారా రూ. 32,990, కవర్ల ద్వారా రూ. 8,100, లడ్డూప్రసాదం ద్వారా రూ. 2,10,630, అన్నదానం ద్వారా రూ. 4,78,936, విరాళాల ద్వారా రూ 60 వేలు లభించింది.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

ఉలవపాడు, జూన్ 1: మండలంలోని కృష్ణాపురంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతడి వద్ద నుంచి 17 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బాజీరెడ్డి తెలిపారు. కౌంటింగ్ వేళ ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ఉండేందుకు గ్రామంలో శనివారం కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఈ సమయంలో గ్రామానికి చెందిన నక్కా చిన నరసింహులు ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను గుర్తించామని ఎస్ఐ చెప్పారు. ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాదయాత్రకు పోలీసుల అభ్యంతరం

కావలి, జూన్ 1 : కావలి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవాలని, చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలని కోరుతూ టీడీపీ నేత తిరువీధి ప్రసాద్ నిర్వహించనున్న పాదయాత్రకు శనివారం పోలీసుల అభ్యంతరం తెలిపారు. దీంతో యాత్రకు బ్రేక్ పడింది. స్థాని కచ్చేరిమిట్టలోని వేంకటేశ్వరాలయం నుంచి బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు శనివారం ఉదయం పాదయాత్ర చేపట్టనున్నట్లు ముందుగా ఆయన ప్రకటించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పాదయాత్రకు అనుమతిలేదని పోలీసులు తెలిపారు. దీంతో ప్రసాద్ తన యాత్రను వాయిదా వేసుకున్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 52 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

కావలి: స్థానిక ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 52 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కరస్పాండెంట్ జీ. రాజకుమార్ చౌ దరి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్లేస్‌మెంట్స్‌లో 192 మంది పాల్గొనగా, 52 మందిని ఎంపిక చేశారన్నారు. వారికి వార్షిక వేతనం రూ.3 లక్షలు వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్ సుమిత్‌కుమార్, అనీల్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సోమవారం కూడా ప్లేస్‌మెంట్ ఎంపికలు ఉంటాయన్నారు.

చంద్రబాబును కలిసిన చల్లా శ్రీనివాసరావు

కందుకూరు, జూన్ 1: ప్రకాశం జిల్లా డెయిరీ మాజీ ఛైర్మన్ చల్లా శ్రీనివాసరావు శనివారం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఆయన తనయుడు రవీంద్రనాథ్‌తో కలిసివెళ్లిన శ్రీనివాసరావు ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గంలో ఎన్నికల తీరును బాబుకు వివరించటంతోపాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కన్వీనర్‌గా మీరు కొనసాగితే బాగుంటుందని చంద్రబాబుకు సూచించినట్లు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.



చంద్రబాబును కలిసిన చల్లా శ్రీనివాసరావు, రవీంద్రనాథ్

డాక్టరేట్లు సాధించడం హర్షనీయం

కందుకూరు, జూన్ 1: సేవాగుణం కలిగిన ముగ్గురు వ్యక్తులకు గౌరవ డాక్టరేట్ లభించటం హర్షనీయమని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టరు కంచర్ల రామయ్య పేర్కొన్నారు. పట్టణంలో సామాజిక సేవా విభాగంలో చక్కా వెంకటకేశవరావు, రవ్వా శ్రీనివాసులు, వల్లూరి కోటేశ్వరరావులు గౌరవ డాక్టరేట్లు అందుకున్న సందర్భంగా శనివారం కళాశాలలో వీరిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ సమాజంలో సేవ చేసేవారికి ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టరు తన్నీరు మల్లికార్జున మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాభావంతో ముందుకుసాగాలన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఆర్వీ తదితరులు మాట్లాడారు.



డాక్టరేట్లు పొందిన కేశవ, కోటేశ్వరరావు, శ్రీనివాసులును సత్కరిస్తున్న కంచర్ల రామయ్య తదితరులు

పగిలిన మంచినీటి పైపులైన్లు : పట్టించుకోని అధికారులు

లింగసముద్రం, జూన్ 1: పగిలిన మంచినీటి పైపులైన్లను అధికారులు పట్టించుకోకపోవడంతో తాగునీటి కోసం ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు.మండలంలోని పెంట్రాల గ్రామంలోని తాతాహోటల్ సెంటర్ వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి గుడి పక్కనే ఉన్న చుండి-చెర్లోపాలెం నీటిపథకం ప్రధాన పైపులైన్, గుడికి సమీపంలోని మరో పైపులైను శుక్రవారం మధ్యాహ్నం పగిలిపోయాయి.విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు గోతులు తీస్తుండగా ఈపైపులైన్లు పగిలి పోయాయని కాలనీవాసులు చెప్పారు. అక్కడే ఉన్న విద్యుత్ కాంట్రాక్టర్‌ను, మంచినీటి సిబ్బందిని అడగ్గా తాము వాటిని బాగు చేయిస్తామని చెప్పారని వారు తెలిపారు.అయితే వారు పట్టించుకోలేదని చెప్పారు. దీంతో ఈ విషయాన్ని అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.వారు కూడా స్పందించ లేదని చెప్పారు. దీంతో తాము, పశువులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు కాలనీవాసులు తెలిపారు.సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



వీరబ్రహ్మేంద్రస్వామి గుడి పక్కనే పగిలిన మంచినీటి పైపులైన్

వలేటివారిపాలెంలో కుక్కల బెడద

వలేటివారిపాలెం, జూన్ 1: స్థానిక బస్టాండు సెంటరులో కుక్కల బెడదతో గ్రామస్థులు హడలిపోతున్నారు. బాబోయ్ ..కుక్కలంటూ అటు వైపు వెళ్లాలంటే వాహనదారులు సైతం భయపడిపోతున్నారు. బస్టాండు సెంటరులోని చికెన్ దుకాణాల వద్ద వీధికుక్కలు చికెన్ వ్యర్థాలు తిని రహదారులపై వెళ్లే వాహనాలు వెంట పడుతున్నాయి. అంతేకాక చిన్నపిల్లల చేతుల్లోని తినుబండారాలను లాక్కెళ్లి దాడి చేసి గాయపరుస్తున్నాయి. ముఖ్యంగా రాత్రిళ్ల రోడ్లపై గుంపులుగా చేరి పాదచారులపై దాడి చేస్తున్నాయి. ఈ విషయమై పలుమార్లు పంచాయతీ అధికారులు దృష్టికి తీసుకుపోయినా సమస్యను వారు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు వాపోయారు. కుక్కలబెడదతోపాటు కోతుల బెడద కూడా ఎక్కువుగా ఉందని వారు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీటి నియంత్రణపై దృష్టి పెట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు